RNI TELTEL/2024/89620

నేటి
# శుభోదయ
ప్రతి క్షణం - ప్రజల కోసం
తెలుగు దినపత్రిక

Gk MEDiA

పచురణ : హైదరాబాద్, రంగారెడ్డి, సంపుటి 01, సంచిక 257, సంపాదకులు : గోంగూర శ్రీనివాసరావు, పేజీలు -8 మంగళవారం - 17 - డిసెంబర్ - 2024 , వెల రూ.5/-

చారిత్రక నేపథ్యం ఉన్న లేఖలను
## తిరిగి పొందేందుకు సాయం చేయాలి
నెహ్రూ లేఖలను తిరిగిచ్చేయండి.. రాహుల్ గాంధీకి 'ప్రైమ్ మినిస్టర్స్ మ్యూజియం' లేఖ




2008లో సోనియా గాంధీ ఈ లేఖలను తీసుకున్నారన్న ప్రైమ్ మినిస్టర్స్ మ్యూజియం అండ్ లైబ్రరీ ఇన్‌స్టీన్‌తో పాటు పలువురు ప్రముఖులకు, నెహ్రూకు మధ్య ఉత్తర ప్రత్యుత్తరాలు జరిగాయని వెల్లడి

ఫ్రాన్స్‌ను అతలాకుతలం చేసిన
## 'చిడో' తుపాను.. వేలాదిమంది మృతి..
హిందూ మహాసముద్ర ద్వీప సమూహంలోని మయోట్‌ను తాకిన బలమైన తుపాను




లెక్క లేనంతమంది మృతి..
క్షతగాత్రులు కూడా వేలల్లోనే
గత వందేళ్లలో ఇదే అత్యంత శక్తమంతమైన తుపాను
200 కి.మీ. వేగంతో వీచిన గాలులకు కూలిన భవనాలు, ఆసుపత్రులు

తిరుమలలో జనవరి 14 వరకు
## సుప్రభాత సేవల రద్దు..
సోమవారం ఉదయం 6.57 గంటలకు ప్రారంభమైన ధనుర్మాస ఘడియలు




ధరుర్మాసం నేపథ్యంలో సుప్రభాత సేవల రద్దు
తిరుప్పావైతో శ్రీవారి మేల్కొలుపు సేవలు
జనవరి 10 నుంచి 19 వరకు వైకుంఠ ద్వార దర్శనాలు
సాధారణంగా ఉన్న భక్తుల రద్దీ

## ఏ జిల్లానూ రద్దు చేయబోవడం లేదు



- మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి
- పాత జిల్లాలను రద్దు చేసే ఆలోచన లేదని వెల్లడి
- రాష్ట్ర ప్రభుత్వమేదైనా నిధుల కోసం కేంద్రం వద్దకు వెళ్లడం సాధారణ విషయని వెల్లడి
- వెళ్లిన ప్రతిసారీ నిధులు రావన్న మంత్రి మిగతా..2లో



## హైదరాబాద్ గజగజ..
ఆరేళ్ల తర్వాత మళ్లీ విజృంభిస్తున్న చలిపులి!

వామ్మో.. చలిపులి

ఆరేళ్ల తర్వాత మళ్లీ హైదరాబాద్ లో చలి పులి విజృంభిస్తుంది. ఓ వైపు చలితో జనాలు అల్లాడిపోతుంటే.. మరోవైపు నానాటికీ పడిపోతున్న గాలినాణ్యత డేంజర్ బెల్స్ మోగిస్తున్నాయి. దీంతో జనజీవనం ప్రశ్నార్థకంగా మారింది. ఆదివారం సిటీలో దాదాపు 300 ఎక్యూఐ నమైదైంది. సోమవారం మధ్యాహ్నం నాటికి గాలి నాణ్యత కాస్త కోలుకుంది..

తెలంగాణలో హరిత విప్లవం దిశగా
# కీలక అడుగులు..

- హైదరాబాద్ మహానగరం పరిధిలోని మొత్తం 2000 చెరువుల రూపురేఖలు మార్చేందుకు ప్రణాళికలు సిద్ధం
- జీవవైవిధ్యాన్ని మెరుగుపరచడంతో పాటు భూగర్భ జలాలు నిండేలా ప్రణాళికలు
- అమీన్ పూర్ చెరువుకు పూర్వవైభవం రావటమే కాకుండా.. జీవ వైవిధ్యం కూడా తిరిగి సంతరించుకుంది
- సీఎం రేవంత్ సర్కార్ సంచలన నిర్ణయం..!



తెలంగాణలో చెరువులు, కుంటల పరిరక్షణే లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సర్కార్ హైడ్రాను ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. కనమరుగవుతున్న చెరువులు, కుంటలను అభివృద్ధి చేస్తూ..వాటికి పూర్వవైభవం తీసుకొచ్చే పనికి శ్రీకారం చుట్టంది.

హైదరాబాద్: తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయ్యింది. స్వరాష్ట్రంలో పదేళ్లుగా ఎదురే లేదనుకున్న గులాబి పార్టీని ఓడించి, తెలంగాణకు రెండో ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి ప్రమాణ స్వీకారం చేశారు. ఇక అంతే దూకుడుగా రేవంత్ రెడ్డి పాలనలో దూసుకుపోతున్నారు. ఈ క్రమంలోనే సుస్థిర అభివృద్ధి, పర్యావరణ పరిరక్షణ కోసం కీలక నిర్ణయాలు తీసుకుంటున్నారు సీఎం. ప్రపంచవ్యాప్తంగా సవాలుగా మారుతోన్న వాతావరణ మార్పులను అధిగమించేందుకు మిగతా..2లో




## ప్రధాని మోదీతో శ్రీలంక అధ్యక్షుడు దిసనాయకే భేటీ..!

- ద్వైపాక్షిక సంబంధాల బలోపేతం, రక్షణ, వాణిజ్యం, పెట్టుబడుల అంశంపై ప్రధాని నరేంద్ర మోదీతో విస్తృత చర్చలు
- శ్రీలంక అధ్యక్షుడిగా ఎన్నికైన తర్వాత దిసనాయకే తొలి విదేశ పర్యటన ఇదే
- భారత్‌లో తొలిసారిగా పర్యటిస్తున్న దిసనాయకేను కలవడం ఆనందంగా ఉంది

రాష్ట్రానికి పోలవరం
# గేమ్ చేంజర్ అవుతుంది

చైనాలోని త్రీ గోర్జెస్ కంటే పోలవరం మెరుగైన ప్రాజెక్టు

పోలవరం ప్రాజెక్టును సందర్శించిన సీఎం చంద్రబాబు

అధికారులు, ఇంజినీర్లతో సమీక్ష



అమరావతి: ఏపీ సీఎం చంద్రబాబు నేడు పోలవరం ప్రాజెక్టును సందర్శించారు. ఏరియల్ వ్యూ ద్వారా పోలవరం ప్రాజెక్టు పరిశీలించారు. హిల్ వ్యూ పాయింట్ నుంచి కూడా పోలవరం డ్యామ్ ను పరిశీలించారు. గ్యాప్-1, గ్యాప్-2 పనులతో పాటు డయాఫ్రం వాల్ నిర్మాణ పనులను కూడా చంద్రబాబు పరిశీలించారు. తన పర్యటన సందర్భంగా ప్రాజెక్టు వద్ద ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్ ను తిలకించారు. ఇక, పనులు జరుగుతున్న తీరుపై అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. అధికారులు, పోలవరం ప్రాజెక్టు ఇంజినీర్లతో చంద్రబాబు సమీక్ష నిర్వహించారు. పోలవరం ప్రాజెక్టు రాష్ట్ర ప్రభుత్వానికి ఎంతటి ప్రాధాన్యతా అంశమో వారికి వివరించారు. పోలవరం ప్రాజెక్టు భవిష్యత్ నిర్మాణాల షెడ్యూల్ ను చంద్రబాబు విడుదల చేయనున్నారు. కాగా, పోలవరం పర్యటనలో చంద్రబాబు వెంట రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు కూడా ఉన్నారు. ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు పోలవరం ప్రాజెక్టును సందర్శించిన అనంతరం అధికారులు, ఇంజినీర్లతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, చైనాలోని త్రీ గోర్జెస్ డ్యామ్ కంటే పోలవరం మెరుగైన ప్రాజెక్టు అని పేర్కొన్నారు. పోలవరం ప్రాజెక్టు కోసం 2014-19 మధ్య మిగతా..2లో

## ఏపీలో సాహితీ పర్యాటకం కూడా రావాలి



ఉప ముఖ్యమంత్రి పవన్‌ను కలిసిన విజయవాడ బుక్ ఫెయిర్ కమిటీ ప్రతినిధులు

పుస్తక మహోత్సవ నిర్వహణకు అవసరమైన మైదానం లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామన్న కమిటీ ప్రతినిధులు

సమస్య పరిష్కరిస్తానని హామీ ఇచ్చిన పవన్ కల్యాణ్

అమరావతి: ఆధ్యాత్మిక పర్యాటకం, సాహస క్రీడలతో కూడిన పర్యాటకం, చారిత్రక పర్యాటకం ఉన్న విధంగానే సాహితీ పర్యాటకం కూడా రావాలని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆకాంక్షించారు. మిగతా..2లో

రాజ్యసభలో రాజ్యాంగంపై
## వాడీవేడి చర్చ

మీరు జేఎన్ యూలో చదివి ఉండవచ్చు.. కానీ!

నిర్మలా సీతారామనక్కు ఖర్గే కౌంటర్



- ప్రియాంకా గాంధీ "భాజపా విభజన సూత్రాన్ని నమ్ముతోంది
- ప్రజలకు స్వేచ్ఛ, సమానత్వం కావాలి
- భాజపా పాలనలో ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడింది. మిగతా..2లో

అవి మీ ఐదేళ్ల అవసరాలు తీర్చలేవు..
# అందుకే బీజేపీకి ఓటేయొద్దు

సల్వార్ కమీజ్ , శాలువా, రూ.500 మీ ఐదేళ్ల అవసరాలను తీర్చలేవు

ఢిల్లీలో పేదల కోసం పనిచేసే నాయకుడు అర్వింద్ కేజ్రీవాల్ ఒక్కరే

వచ్చే ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీకి ఓటేయొద్దని అక్కడి ఓటర్లకు పిలుపునిచ్చారు




ఢిల్లీ: కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ పై ఢిల్లీ ముఖ్యమంత్రి అతిషి మరోసారి విమర్శలు గుప్పించారు. వచ్చే ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీకి ఓటేయొద్దని అక్కడి ఓటర్లకు పిలుపునిచ్చారు. ఢిల్లీలో జరిగిన ఓ కార్యక్రమంలో పాల్గొన్న అతిషి.. సల్వార్ కమీజ్ , శాలువా, రూ.500 మీ ఐదేళ్ల అవసరాలను తీర్చలేవని ప్రజలను ఉద్దేశించి వ్యాఖ్యానించారు. ఎన్నికలప్పుడు బీజేపీ ఇచ్చే వాటి కోసం మిగతా..2లో


నక్సల్స్ జనజీవన స్రవంతిలో కలిసిపోయి
# అభివృద్ధికి సహకరించాలి

31 మార్చి 2026 నాటికి దేశం నుంచి నక్సలిజాన్ని పూర్తిగా తరిమేస్తాం

దేశంలో నక్సలైట్ల శకం ముగిసింది

జగదల్‌పూర్‌లో మాజీ నక్సల్స్‌తో అమిత్ షా సమావేశం

ఏడాది కాలంలో 287 మంది నక్సల్స్‌ను భద్రతా బలగాలు హతమార్చాయన్న షా



ఢిల్లీ: దేశంలో నక్సలిజం చివరి అంకంలో ఉందని, మార్చి 2026 నాటికి దానిని పూర్తిగా తుడిచిపెట్టేస్తామని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా పేర్కొన్నారు. చత్తీస్‌గఢ్‌లోని బస్తర్, మహారాష్ట్ర, ఒడిశా, ఆంధ్రప్రదేశ్, తెలంగాణకు చెందిన దాదాపు 30 మంది మాజీ నక్సల్స్‌తో చత్తీస్‌గఢ్‌లోని జగదల్‌పూర్‌లో అమిత్ షా నిన్న సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మిగతా..2లో

## చారిత్రక నేపథ్యం ఉన్న లేఖలను
# తిరిగి పొందేందుకు సాయం చేయాలి

ఢిల్లీ: భారతదేశ తొలి ప్రధానమంత్రి జనహర్‌లాల్ నెహ్రూ రాసిన వ్యక్తిగత లేఖలను సోనియా గాంధీ తీసుకున్నారని, వాటిని తిరిగి ఇచ్చేయాలంటూ లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీకి 'ప్రైమ్ మినిస్టర్స్ మ్యూజియం అండ్ లైబ్రరీ(పీఎంఎంఎల్)' అధికారికంగా లేఖ రాసింది. యూపీఏ ప్రభుత్వ హయాంలో 2008లో సోనియా ఈ లేఖలను తీసుకున్నారని పేర్కొంది. సెప్టెంబరులో సోనియా గాంధీకి ఇదే విషయమై 'ప్రైమ్ మినిస్టర్స్ మ్యూజియం' ఒక లేఖ రాసింది. తాజాగా డిసెంబర్ 10న రాహుల్ గాంధీకి లేఖ రాయడం గమనార్హం. లేఖలను అసలు రూపంలో తిరిగి ఇచ్చినా లేదా డిజిటల్ కాపీల రూపంలో అందించినా ఫర్వాలేదని పీఎంఎంఎల్ సభ్యుడు రిజ్వాన్ కద్రీ కోరారు. అత్యంత చారిత్రక ప్రాముఖ్యత కలిగిన ఈ లేఖలను 1971లో మ్యూజియానికి అప్పగించారు. అయితే, 2008లో వాటిని 51 పెట్టెల్లో ప్యాక్ చేసి సోనియా గాంధీకి పంపినట్లు తెలుస్తోంది. కాగా, ఆల్బర్ట్ ఐన్‌స్టీన్, మౌంట్ బాటన్, పద్మజా నాయుడు, జయప్రకాశ్ నారాయణ్, అరుణ అసఫ్ అలీ, విజయ లక్ష్మీ పండిట్, బాబూ జగ్జీవన్ రామ్, గోవింద్ బల్లబ్ పంత్ వంటి ప్రముఖులకు, జవహర్ లాల్ నెహ్రూకు మధ్య జరిగిన ఈ ఉత్తర ప్రత్యుత్తరాలు చారిత్రక ప్రాముఖ్యత కలిగివున్నాయని ప్రైమ్ మినిస్టర్స్ మ్యూజియం పేర్కొంది. ఈ లేఖలను తిరిగి పొందడంలో లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ సాయం చేయాలని రిజ్వాన్ కద్రీ కోరుతున్నారు.

## ఫ్రాన్స్‌ను అతలాకుతలం చేసిన
# 'చిడో' తుపాను.. వేలాదిమంది మృతి..

ఫ్రాన్స్: హిందూ మహాసముద్ర ద్వీప సమూహంలోని మయోట్‌ను తాకిన అత్యంత శక్తిమంతమైన తుపాను 'చిడో' వేలాదిమంది ప్రాణాలు బలిగొంది. గత శతాబ్ద కాలంలోనే ఇది అత్యంత బలమైన తుపాను అని ఫ్రెంచ్ అధికారులు చెబుతున్నారు. తనకు తెలిసినంత వరకు ఈ తుపాను కారణంగా కొన్ని వేలమంది మృతి చెంది ఉంటారని ఆయన పేర్కొన్నారు. క్షతగాత్రులు కూడా వేలల్లో ఉండొచ్చని తెలిపారు. ఇప్పుడున్న పరిస్థితుల్లో మృతుల సంఖ్యను కచ్చితంగా చెప్పడం సాధ్యం కాదని ఫ్రెంచ్ అంతర్గతశాఖ మంత్రి పేర్కొన్నారు. చిడో తుపాను రాత్రికి రాత్రే మయోట్‌ను తాకినట్లు చెప్పారు. గంటకు 200 కిలోమీటర్ల వేగంతో వీచిన గాలుల కారణంగా ఇళ్లు, ప్రభుత్వ భవనాలు, ఆసుపత్రులు దెబ్బతిన్నట్టు వివరించారు. గత 100 ఏళ్లలో ఇంత బలమైన తుపాను ద్వీపాన్ని ఎన్నడూ తాకలేదని స్థానిక వాతావరణశాఖ తెలిపింది. నిజం చెప్పాలంటే తాము విషాదాన్ని అనుభవిస్తున్నామని, అణుయుద్ధం తర్వాత ఉండే పరిస్థితులు ఇక్కడ ఉన్నాయని మయోట్ రాజధాని మమౌద్జౌ నివాసి ఒకరు తెలిపారు. తమ పొరుగు ప్రాంతం మొత్తం అదృశ్యమైందని చెప్పుకొచ్చారు. వేలాది గృహాలు శిథిలమైన ఏరియల్ వ్యూ దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్నాయి. ఈ విషాదంపై ఫ్రాన్స్ అధ్యక్షుడు ఎమ్మాన్యుయేల్ మాక్రాన్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

## తిరుమలలో జనవరి 14 వరకు
# సుప్రభాత సేవల రద్దు..

తిరుపతి: నేటిటి నుంచి జనవరి 14 వరకు సుప్రభాత సేవలను టీటీడీ రద్దు చేసింది. తిరుమల శ్రీవారి మాసోత్సవాల్లో ధనుర్మాసాన్ని అత్యంత ప్రధానమైనదిగా భావిస్తారు. ధనుర్మాస ఘడియలు ఈ ఉదయం 6.57 గంటలకు ప్రారంభమయ్యాయి. ధనుర్మాసం నేపథ్యంలో సుప్రభాత సేవలను రద్దు చేయాలని అధికారులు నిర్ణయం తీసుకున్నారు. తిరుమల వేంకటేశ్వరస్వామి వారికి నిర్వహించే సుప్రభాత సేవ స్థానంలో తిరుప్పావై నివేదిస్తారు. తిరుప్పావైతో నెల రోజుల పాటు శ్రీవారి మేల్కొలుపు ఉంటుంది. దీంతోపాటు, ఈ నెల రోజుల పాటు శ్రీకృష్ణ స్వామి వారికి ఏకాంత సేవ నిర్వహిస్తారు. మరోవైపు జనవరి 10 నుంచి 19వ తేదీ వరకు శ్రీవారి ఆలయంలో వైకుంఠ ద్వార దర్శనాలకు అవకాశం కల్పించనున్నారు. వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకుని టీటీడీ విస్తృత ఏర్పాట్లు చేస్తోంది. తిరుమలలో ఈరోజు భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూ కాంప్లెక్స్ లో 18 కంపార్ట్ మెంట్లలో భక్తులు ఉన్నారు. నిన్న అర్ధరాత్రి వరకు 66,160 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. 22,724 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామి వారికి కానుకల రూపంలో హుండీలో రూ. 3.47 కోట్లను భక్తులు సమర్పించారని టీటీడీ వెల్లడించింది.

# ఏపీలో సాహితీ పర్యాటకం కూడా రావాలి

మొదటి పేజి తరువాయి

మంగళగిరిలోని క్యాంప్ కార్యాలయంలో పవన్ కల్యాణ్‌ను ఆదివారం విజయవాడ బుక్ ఫెయిర్ కమిటీ ప్రతినిధులు కలిసి పలు సమస్యలను వివరించారు. 35 ఏళ్లుగా విజయవాడలో దిగ్విజయంగా పుస్తక మహోత్సవాన్ని నిర్వహిస్తున్నామని, అయితే పుస్తక మహోత్సవ నిర్వహణకు అవసరమైన మైదానం అందుబాటులో లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. దీంతో సమస్య పరిష్కరిస్తామని పవన్ హామీ ఇచ్చారు. మన కవులు, రచయితల గొప్పతనాన్ని తెలియజేసేలా తెలుగు సాహితీ యాత్రలు నిర్వహించే దిశగా ప్రభుత్వం ఆలోచన చేస్తోందని తెలిపారు. శ్రీశ్రీ, గురజాడ, చలం, గుర్రం జాషువా, విశ్వనాథ సత్యనారాయణ, తిలక్, దేవులపల్లి కృష్ణశాస్త్రి వంటి గొప్ప కవులు, రచయితల స్వస్థలాలు, వారి జ్ఞాపకాలను కాపాడటం ద్వారా వారి సాహిత్య సేవలు తెలిపేలా స్మారక కేంద్రాల ఏర్పాటుతో ఆ ప్రాంతాలను అభివృద్ధి చేయవచ్చన్నారు. వేటపాలెం గ్రంథాలయం, రాజమహేంద్రవరం గౌతమి గ్రంథాలయం, కడప సీపీ బ్రౌన్ గ్రంథాలయం లాంటి ప్రముఖమైనవి రాష్ట్రంలో ఉన్నాయని, వీటిని కవులు, రచయితల నివాసాలను కలుపుతూ టూరిజం సర్క్యూట్స్ ఏర్పాటు చేయవచ్చని అన్నారు. ఇది తెలుగు భాష అభివృద్ధితో పాటు పర్యాటక రంగం విస్తరణకు దోహదపడుతుందని పవన్ పేర్కొన్నారు. పవన్‌ను కలిసిన వారిలో విజయవాడ బుక్ ఫెయిర్ ప్రతినిధులు టి. మనోహర్ నాయుడు, కె లక్ష్మయ్య, గొల్ల నారాయణరావు, సందీపని ఉన్నారు.

# ఏ జిల్లానూ రద్దు చేయబోవడం లేదు


హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఏ జిల్లాను కూడా రద్దు చేయబోదని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు. శాసనమండలిలో ఆయన మాట్లాడుతూ... ఏ జిల్లాను రద్దు చేయబోమని, అసలు పాత జిల్లాలను రద్దు చేసే ఆలోచనే తమ ప్రభుత్వానికి లేదని వెల్లడించారు. ముఖ్యమంత్రి పలుమార్లు ఢిల్లీకి వెళుతున్నారని, కానీ నిధులు తెచ్చారా? అని బీఆర్ఎస్ నేతలు చేస్తోన్న విమర్శలపై కూడా మంత్రి స్పందించారు. ఏ రాష్ట్ర ప్రభుత్వమైనా కేంద్రం వద్దకు తరచూ నిధుల కోసం వెళ్లడం సాధారణ విషయమేనని, కానీ వెళ్లిన ప్రతిసారీ నిధులు రావని గుర్తించాలన్నారు. తెలంగాణ వచ్చాక పదేళ్లు బీఆర్ఎస్ పాలించిందని, వారి హయాంలో కేంద్రం నుంచి తెలంగాణకు ఎన్ని నిధులు తీసుకువచ్చారో అందరికీ తెలుసని విమర్శించారు. తమది పేదల ప్రభుత్వమన్నారు. పేదల కోసం అనునిత్యం పని చేస్తామన్నారు.

# ప్రధాని మోదీతో శ్రీలంక అధ్యక్షుడు దిసనాయకే భేటీ..!

ఢిల్లీ: శ్రీలంక అధ్యక్షుడు అనుర కుమార దిసనాయకే మూడురోజుల పర్యటన కోసం ఆదివారం భారత్‌కు చేరుకున్నారు. ఈ సందర్భంగా ద్వైపాక్షిక సంబంధాల బలోపేతం, రక్షణ, వాణిజ్యం, పెట్టుబడుల అంశంపై ప్రధాని నరేంద్ర మోదీతో విస్తృత చర్చలు జరిపారు. శ్రీలంక అధ్యక్షుడిగా ఎన్నికైన తర్వాత దిసనాయకే తొలి విదేశ పర్యటన ఇదే. చర్చలకు ముందు ఆయన రాష్ట్రపతి ద్రౌపది ముర్ముతోనూ భేటీ అయ్యారు. ప్రధాని మోదీ, అనుర దిసానాయక్ మధ్య జరిగిన చర్చలకు సంబంధించిన వివరాలను విదేశాంగ మంత్రిత్వశాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ వివరించారు. ఇరుదేశాల మధ్య వాణిజ్యం, పెట్టుబడులు, భద్రతా సహకారంపై జరిగినట్లు తెలిపారు. విదేశాంగ మంత్రి జైశంకర్ సైతం సోషల్ మీడియా వేదికగా పోస్ట్ పెట్టారు. భారత్‌లో తొలిసారిగా పర్యటిస్తున్న దిసనాయకేను కలవడం ఆనందంగా ఉందన్నారు. నైబర్‌హుడ్ ఫస్ట్ విధానం, సాగర్ ఔట్‌లుక్‌కి శ్రీలంక కీలకమైందని.. ప్రధాని మోదీ, దిసనాయక మధ్య చర్చలు విశ్వాసం, సహకారాన్ని పొందిస్తాయని ఆశిస్తున్నానన్నారు. విదేశాంగ మంత్రి జైశంకర్, జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్ జరిపిన చర్చల్లో పరస్పర ప్రయోజనాలకు సంబంధించిన విషయాలపై చర్చించినట్లు దిసనాయకే పేర్కొన్నారు. ఆదివారం సాయంత్రం ఢిల్లీకి చేరుకోగా.. కేంద్ర మంత్రి ఎల్ మురుగన్‌తో పాటు అధికారులు స్వాగతం పలికారని సోషల్ మీడియా పోస్ట్‌లో తెలిపారు.

## నక్సల్స్ జనజీవన స్రవంతిలో కలిసిపోయి
# అభివృద్ధికి సహకరించాలి

మొదటి పేజి తరువాయి



ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రధానమంత్రి నరేంద్రమోదీ సారథ్యంలో 31 మార్చి 2026 నాటికి దేశంలో నక్సలిజాన్ని పూర్తిగా రూపుమాపుతామని నొక్కి వక్కాణించారు. గత ఏడాది కాలంలో 287 మంది నక్సల్స్‌ను భద్రతా దళాలు హతమార్చాయని, 1000 మందిని అరెస్ట్ చేయగా, 837 మంది లొంగిపోయారని అమిత్ షా తెలిపారు. నక్సలిజంపై మోదీ ప్రభుత్వం అవలంబిస్తున్న కఠిన వైఖరి కారణంగా గత నాలుగు దశాబ్దాల్లో తొలిసారి పౌరులు, భద్రతా బలగాల మరణాల సంఖ్య 100 లోపునకు పడిపోయిందని వివరించారు. 'నక్సల్ రహిత.. డ్రగ్ రహిత ఇండియా' కలను సాకారం చేయడంలో చత్తీస్‌గఢ్ పోలీసుల కృషిపై హెూంమంత్రి ప్రశ్నంసలు కురిపించారు. వారి సహకారాన్ని సువర్ణాక్షరాలతో లిఖించాలని కొనియాడారు. మిగిలిన నక్సలైట్లు కూడా హింసా మార్గాన్ని విడిచిపెట్టి జనజీవన స్రవంతిలో కలసి అభివృద్ధికి సహకరించాలని కోరారు. మీరు లొంగిపోవాలని, జనజీవన స్రవంతిలో కలవాలని చేసిన ప్రయత్నాలు ఫలించినందుకు తాను ఈ రోజు చాలా సంతోషంగా ఉన్నానని అమిత్ షా పేర్కొన్నారు

# తెలంగాణలో హరిత విప్లవం దిశగా కీలక అడుగులు..



మొదటి పేజి తరువాయి

వాతావరణ మార్పులను అధిగమించేందుకు రేవంత్ రెడ్డి ఈ దిశగా అడుగులు వేస్తున్నారు. ఇందులో భాగంగానే పర్యావరణ పరిరక్షణపై దృష్టి సారించారు. కాలుష్య నియంత్రణ, పర్యావరణ పునరుద్ధరణ, పునరుత్పాదక ఇంధనం తోపాటు తెలంగాణకు పచ్చదనం భవిష్యత్ తరాలకు అందించేందుకు కీలక ముందడుగు వేశారు. పర్యావరణ పునరుద్ధరణలో భాగంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీసుకున్న ముఖ్యమైన ప్రాజెక్టుల్లో సరస్సులు, చెరువుల పునరుద్ధరణ ప్రధానమైంది. ఒకప్పుడు చెరువులకు, సరస్సులకు పెట్టింది పేరైన భాగ్యనగరంలో కబ్జాల కారణంగా చెరువులు, కుంటలు కుదించుకుపోయి, ఉనికిని కోల్పోతున్నాయి. ఈ నేపథ్యంలో రేవంత్ రెడ్డి అధికారంలోకి రాగానే హైడ్రా పేరుతో ప్రత్యేక వ్యవస్థను ప్రవేశపెట్టారు. దీంతో చెరువుల్లోని అక్రమ కట్టడాలను పని పడుతున్నారు. ఇందులో భాగంగా ఇప్పటి వరు 75 చెరువుల పునరుద్ధరణకు శ్రీకారం చుట్టారు. హైదరాబాద్ మహానగరం పరిధిలోని మొత్తం 2000 చెరువుల రూపురేఖలు మార్చేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారు. ఇందులో భాగంగా నిర్జీవమైన నీటి వనరులను పునరుద్ధరించనున్నారు. జీవవైవిధ్యాన్ని మెరుగుపరచడంతో పాటు భూగర్భ జలాలు నిండేలా ప్రణాళికలు చేస్తున్నారు. వలస పక్షులను తిరిగి తెలంగాణ గడ్డపై విహరించేలా ప్లాన చేస్తున్నారు. చెరువులకు కొత్త శోభ తీసుకురావడంతో ఫ్లెమింగోలు, రెడ్ బ్రెస్టెడ్ ఫ్లైక్యాచర్ వంటి జాతులకు చెందిన పక్షులు తిరిగిరావాలని భావిస్తున్నారు. పర్యావరణ పునరుద్ధరణతో పాటు మానవాళికి ఎంతో ప్రయోజనం చేకూర్చనుందని ప్రకృతి ప్రేమికులు అభిప్రాయపడుతున్నారు. జీవ వైవిధ్యానికి సరైన చిరునామా అమీన్‌పూర్ చెరువు. రకరకాల పక్షులు, జంతువులకు నిలయం ఇది. ఏకంగా 350 ఎకరాల్లో విస్తరించిన అమీన్‌పూర్ చెరువు.. పెద్దచెరువు, కొత్తచెరువు, కొమ్ముచెరువు అనే మూడు చెరువుల గొలుసుకట్టు. ఇంత పెద్ద చెరువును కబ్జాలకు గురైంది. పెద్ద చెరువు నుంచి తూముల ద్వారా వచ్చే నీటిని సైతం కబ్జాదారులు మూసివేశారు. కొత్త చెరువును దాదాపు ఆనవాళ్లు లేకుండా చేశారు. ఈ మధ్య పెద్ద చెరువుకు సబంధించిన అలుగు, తూములు మూసివేయడంతో వర్షం వచ్చినప్పుడు ఇళ్లలోకి నీరు చేరి ఇబ్బందిపడుతున్నారు అమీన్‌పూర్ వాసులు. దీనికితోడు పశు పక్షాదులకు నిలయమైన అమీన్‌పూర్ వలస పక్షులు అంతరించిపోతున్నాయి. చెరువు వద్దకు రావడమే మానేశాయి. ఈ నేపథ్యంలో చెరువుల పరిరక్షణకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శ్రీకారం చుట్టారు. పర్యావరణాన్ని కాపాడి భవిష్యత్ తరాలకు అందించాలని సంకల్పించారు. ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అమీన్‌పూర్ చెరువు వద్ద కనిపించిన అరుదైన రెడ్ ఫ్లైక్యాచర్‌కు సంబంధించిన చిత్రాన్ని సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా పంచుకున్నారు. పర్యావరణ పునరుద్ధరణ కోసం సాగుతోన్న కార్యక్రమాలకు ఇది సాక్ష్యమని సీఎం ఈ సందర్భంగా అభిప్రాయపడ్డారు. అమీన్ పూర్ చెరువుకు పూర్వవైభవం రావటమే కాకుండా.. జీవ వైవిధ్యం కూడా తిరిగి సంతరించుకుంది. ఇందుకు నిదర్శనమే.. ఫ్లైక్యాచర్ లాంటి అరుదైన జాతి పక్షులు ఇక్కడికి విచ్చేయటమే అని సీఎం రేవంత్ పేర్కొన్నారు. కాగా.. అమీన్‌పూర్ చెరువు ఒకప్పుడు ఫ్లెమింగో పక్షులతో పాటు ఇతర జాతి పక్షులకు ఆవాసంగా ఉండేది. మారిన వాతావరణ పరిస్థితులు, ఆక్రమణలు, ఇలా రకరకాల కారణాలతో కొన్నేళ్లుగా పర్యావరణ సవాళ్లను ఎదుర్కొంటోంది అమీన్ పూర్ చెరువు. సీఎం రేవంత్ రెడ్డి హయాంలో వచ్చిన హైడ్రాతో ఈ చెరువుకు మరోసారి పునరుజ్జీవం వచ్చినట్లైంది.

# రాష్ట్రానికి పోలవరం గేమ్ చేంజర్ అవుతుంది



మొదటి పేజి తరువాయి

పోలవరం ప్రాజెక్టు కోసం 2014-19 మధ్య రాత్రింబవళ్లు శ్రమించామని తెలిపారు. ఒకేసారి 32 వేల క్యూబిక్ మీటర్ల కాంక్రీట్ వేసి వరల్డ్ రికార్డు సృష్టించామని చంద్రబాబు వెల్లడించారు. గతంలో డయాఫ్రం వాల్ ను 414 రోజుల్లో పూర్తి చేశామని అన్నారు. జర్మనీకి చెందిన బాయర్ సంస్థ డయాఫ్రం వాల్ నిర్మించిందని వివరించారు. 2014-19 మధ్య 72 శాతం పనులు పూర్తి చేశామని చెప్పారు. కానీ వైసీపీ అధికారంలోకి వచ్చాక కాంట్రాక్టర్ ను మార్చేసి, ప్రాజెక్టును నాశనం చేశారని విమర్శించారు. రివర్స్ టెండరింగ్ తో పోలవరం డ్యామ్ ను గోదాట్లో కలిపేశారని మండిపడ్డారు. పోలవరం, అమరావతి రాష్ట్రానికి రెండు కళ్ల వంటివని చంద్రబాబు అభివర్ణించారు. పోలవరం పూర్తయితే రాష్ట్రానికి గేమ్ చేంజర్ అవుతుందని స్పష్టం చేశారు. పోలవరం ప్రాజెక్టు పూర్తయితే 7 లక్షల ఎకరాలతో కొత్త ఆయకట్టు వస్తుందని తెలిపారు. 23 లక్షల ఎకరాల భూమి స్థిరీకరణ చెందుతుందని పేర్కొన్నారు. పోలవరం ద్వారా విశాఖ పారిశ్రామిక అవసరాలు కూడా తీరతాయని చెప్పారు.

# హైదరాబాద్ గజగజ..
## ఆరేళ్ల తర్వాత మళ్లీ విజృంభిస్తున్న చలిపులి!

హైదరాబాద్, : హైదరాబాద్‌లో ఉష్ణోగ్రతలు భారీగా పడిపోయాయి. అల్పపీడన ప్రభావంతో ఉదయం, రాత్రి వేళల్లో చలిపంజా విసురుతోంది. గత ఆరేళ్లలో ఎన్నడూ లేనంతంగా కనిష్టానికి ఉష్ణోగ్రతలు పడిపోతున్నాయి. దీంతో ప్రజలు గజగజ వణికిపోతున్నారు. చలితీవ్ర వల్ల రాత్రి 9 గంటల తర్వాత హైదరాబాద్ నగరంలో చాలా వరకు రోడ్లు నిర్మానుష్యంగా మారుతున్నాయి. ఉదయం 7 గంటల తర్వాతగానీ ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రావడం లేదు. ముఖ్యంగా ఉత్తర తెలంగాణ జిల్లాల్లో 10 డిగ్రీల లోపు ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా భీంపూర్‌లో అత్యల్పంగా 6.3 డిగ్రీల సెల్సియస్ నమోదైంది. ఆ తర్వాత స్థానంలో నిర్మల్ జిల్లా తాంద్రలో 6.6, కుమ్రంభీం ఆసిఫాబాద్‌లో 6.7, సంగారెడ్డి 6.8, కామారెడ్డి 7.6, నిజామాబాద్ 7.7, మెదక్ 8, జగిత్యాల 8, వికారాబాద్ 8.2, రాజన్నసిరిసిల్ల 8.6, సిద్దిపేట 8.6, రంగారెడ్డి 8.9, పెద్దపల్లిలో 9.5 డిగ్రీల చొప్పున ఉష్ణోగ్రతలు నమోదైనట్టు వాతావరణశాఖ వెల్లడించింది. ఇలా పలు జిల్లాల్లో 15 డిగ్రీల లోపే ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఇక హైదరాబాద్ నగరంలోనూ పలు చోట్ల కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. హెచ్‌సీయూ, మౌలాలీలో అత్యల్పంగా 7.1 డిగ్రీలు నమోదవగా ఉప్పల్ 13.4, మల్లాపూర్ 13.5, ఆదర్శనగర్ 13.5, తిరుమలగిరి, చర్లపల్లి 13.6 డిగ్రీల చొప్పున ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. బీహెచ్‌ఈఎల్‌లో 7.4, గచ్చిబౌలి 9.3, శివరాంపల్లి 10.3, జీడిమెట్ల 11.4, బాలానగర్ 11.5, పటాన్‌చెరు 11.7, లింగంపల్లి 11.8, బోయిన్‌పల్లి 11.9, బేగంపేట 12, ఆసిఫ్‌నగర్ 12, నేరెడ్‌మెట్ 12.1, లంగర్‌హౌస్ 12.2, మోండా మార్కెట్ 12.4, చందానగర్ 12.7, షేక్‌పేట 12.8, మాదాపూర్ 12.8, కూకట్‌పల్లి 13.1, గోల్కొండ 13.2, సఫిల్‌గూడ, హయత్‌నగర్ 13.3 చొప్పున ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. మరోవైపు బంగాళాఖాతంలో అల్పపీడనం ప్రభావతంతో చలిగాలులు విజృంభిస్తున్నాయి. దీంతో గత ఆరేళ్లలో ఎన్నడూలేని విధంగా ఉష్ణోగ్రతలు గరిష్టంగా నమోదవుతున్నాయి. ఉత్తరాది నుంచి ఈదురుగాలులు, శీతల పవనాలు వీస్తుండటంతో ఉష్ణోగ్రతలు మరింత పడిపోతున్నాయి. దీంతో ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రావడానికి జంకుతున్నారు.

## రాజ్యసభలో రాజ్యాంగంపై
# వాడీవేడి చర్చ



దిల్లీ: రాజ్యసభలో రాజ్యాంగంపై వాడీవేడి చర్చ కొనసాగింది. ఈ నేపథ్యంలో మాజీ ప్రధాని జవహర్లాల్ నెహ్రూపై విమర్శలు చేసిన కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్, భాజపా పై కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున్ ఖర్గే విరుచుకుపడ్డారు. నిర్మలా సీతారామన్ జేఎన్‌యూ నుంచి పట్టభద్రురాలు, ఆర్థిక నిపుణురాలు కావొచ్చు గానీ.. ఆమె చర్యలు మాత్రం బాగాలేవంటూ విమర్శించారు. ప్రియాంకా గాంధీ "భాజపా విభజన సూత్రాన్ని నమ్ముతోంది. ప్రజలకు స్వేచ్ఛ, సమానత్వం కావాలి. భాజపా పాలనలో ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడింది. నెహ్రూ, ఇందిరాగాంధీలను భాజపా కించపరుస్తోంది. దేశం కోసం భాజపా ఎప్పుడూ పోరాటం చేయలేదు. అలాంటి వ్యక్తులు నెహ్రూ గురించి మాట్లాడటం విడ్డూరం. రాజ్యాంగానికి భాజపా అనుకూలమా? వ్యతిరేకమా? ప్రాథమిక సమస్యల పరిష్కారానికి భాజపాకు ఆసక్తిలేదు. జాతీయ జెండా, రాజ్యాంగాన్ని ఎప్పుడూ గౌరవించని వారు.. రాజ్యాంగంపై మాకు పాఠాలు చెబుతున్నారు. అవాస్తవాలతో దేశాన్ని తప్పుదోవపట్టిస్తున్నారు. గోబెల్స్ కంటే కూడా అవాస్తవాలను ప్రచారం చేస్తున్నారు. కాంగ్రెస్ తెచ్చిన ఆహార భద్రత చట్టం కొవిడ్ సమయంలో పేదలను ఆదుకొంది. రాజ్యాంగం బలోపేతానికి ప్రధాని ఏం చర్యలు తీసుకున్నారు? ఏం సాధించామో ఎవరికి వారు ఆత్మ పరిశీలన చేసుకోవాలి" అన్నారు. "మనుస్మృతి ఆధారంగా లేదని రాజ్యాంగాన్ని ఆరెస్సెస్ వ్యతిరేకించింది. రాజ్యాంగాన్ని, జాతీయ జెండాను వారు అంగీకరించలేదు. 2002 జనవరి 26న తొలిసారి ఆరెస్సెస్ హెడ్క్వార్టర్స్ ఎగురవేయాల్సిన తప్పనిపరిస్థితి ఎదురైంది. ప్రధాని నరేంద్ర మోదీ అవాస్తవాలు చెబుతున్నారు. ప్రజలకు రూ.15లక్షలు చొప్పున వేస్తానని అవాస్తవాలు చెప్పారు. రాజ్యాంగాన్ని బలోపేతం చేసేందుకు గత 11 ఏళ్లలో ప్రధాని నరేంద్ర మోదీ ఏం చేశారు? 1971లో పాకిస్థాన్ ను భారత్ ఓడించి తూర్పుపాకిస్థాన్కు (నేటి బంగ్లాదేశ్) విముక్తి కల్పించిన రోజు (డిసెంబర్ 16న)ను విజయ్ దివస్ చేసుకొంటున్నాం. బంగ్లాదేశ్లో మైనార్టీలను ఆదుకోవడంలో ఇందిరా గాంధీని భాజపా నేతలు స్ఫూర్తిగా తీసుకోవాలి" అని సూచించారు.

## అవి మీ ఐదేళ్ల అవసరాలు తీర్చలేవు..
# అందుకే బీజేపీకి ఓటేయొద్దు

ఎన్నికలప్పుడు బీజేపీ ఇచ్చే వాటి కోసం ఆశపడొద్దని అతిషి సూచించారు. అర్వింద్ కేజ్రీవాల్ ఆలోచనల నుంచి వచ్చిన ఉచిత కరెంట్, ఉచిత తాగునీరు, ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య, మొహల్లా క్లినిక్‌లలో ఉచిత వైద్యం లాంటి మీ ఐదేళ్ల అవసరాలను తీర్చగలుగుతాయని చెప్పారు. ఢిల్లీలో పేదల కోసం పనిచేసే నాయకుడు అర్వింద్ కేజ్రీవాల్ ఒక్కరేనని అతిషి అన్నారు. కాబట్టి పేదలు బీజేపీ నాయకులతో చాలా జాగ్రత్తగా ఉండాలని అతిషి చెప్పారు. ఎందుకంటే బీజేపీ నాయకులు అభివృద్ధి పేరుతో పేదల ఆవాసాలను ధ్వంసం చేస్తారని, పేదల ఓట్లను తొలగిస్తారని వ్యాఖ్యానించారు. ఢిల్లీలో వచ్చే ఏడాది అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో అధికార ఆప్, ప్రతిపక్ష బీజేపీ నేతలు ఇప్పటి నుంచే వ్యూహాలకు పదును పెడుతున్నారు.

## 'పాలస్తీనా' బ్యాగ్‌తో ప్రియాంకగాంధీ... బీజేపీ నేతల చురకలు



ఢిల్లీ: వయనాడ్ ఎంపీ ప్రియాంక గాంధీ సోమవారం పాలస్తీనా అని రాసి ఉన్న బ్యాగ్‌తో లోక్ సభకు హాజరయ్యారు. పాలస్తీనా సంఘీభావానికి చిహ్నంగా భావించే పుచ్చకాయ, శాంతి చిహ్నాలు ఆ బ్యాగ్‌పై ఉన్నాయి. పార్లమెంట్ ఆవరణలో ప్రియాంక గాంధీ ఆ బ్యాగ్‌తో దిగిన ఫొటో నెట్టింట వైరల్‌గా మారింది. ఈ ఫొటోను కాంగ్రెస్ అధికార ప్రతినిధి షామా మహమ్మద్ సోషల్ మీడియా వేదికపై పోస్ట్ చేశారు. ప్రియాంక గాంధీ తీసుకెళ్లిన ప్రత్యేక బ్యాగ్... పాలస్తీనాకు ఆమె మద్దతు, సంఘీభావాన్ని చూపుతోందని, కరుణ, న్యాయం, మానవత్వం పట్ల నిబద్ధతకు ఇది చిహ్నం అని షామా పేర్కొన్నారు. తద్వారా జెనీవా ఒప్పందాన్ని ఎవరూ ఉల్లంఘించలేరని ఆమె స్పష్టం చేశారని రాసుకొచ్చారు. ప్రియాంక గాంధీ ఆ బ్యాగ్‌తో కనిపించడంపై బీజేపీ నేతలు విమర్శలు గుప్పించారు. వార్తల్లో నిలిచేందుకు కొందరు ఇలాంటి పనులు చేస్తుంటారని ఎద్దేవా చేశారు. ఎన్నికల్లో ప్రజలు తిరస్కరించినప్పుడు, వారు అలాంటి చర్యలను ఆశ్రయిస్తారని విమర్శించారు. గాంధీ కుటుంబం ఎప్పుడూ బుజ్జగింపుల సంచిని మోస్తుంటుందని బీజేపీ నేత సంబిత్ పాత్ర విమర్శించారు. ఎన్నికల్లో వారి ఓటమికి బుజ్జగింపుల సంచే కారణమని చురక అంటించారు.

## రేవంత్ రెడ్డి అన్న తిరుపతి రెడ్డి
## రాజ్యాంగేతర శక్తిగా వ్యవహరిస్తున్నారు: కేటీఆర్

హైదరాబాద్: తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్న తిరుపతి రెడ్డి రాజ్యాంగేతర శక్తిగా వ్యవహరిస్తున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ దుయ్యబట్టారు. అసెంబ్లీలో కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరును ప్రజలంతా గమనిస్తున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. లగచర్ల రైతులపై ప్రభుత్వం వ్యవహరించిన తీరును శాసనసభలో చర్చించాలని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు పట్టుబట్టారు. ఈ క్రమంలో సభ రేపటికి వాయిదా పడింది. దీంతో, శాసనసభ లోపలికి వెళ్లే దారిలో కూర్చొని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ... ముగ్గురు లగచర్ల రైతులు తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఒక రైతుకు గుండెపోటు వస్తే బేడీలతో ఆసుపత్రికి తీసుకెళ్లారని మండిపడ్డారు. కొడంగల్ నీ జాగీరా? అని రేవంత్ ను ఉద్దేశించి ప్రశ్నించారు. రైతుల తరపున పోరాటం చేస్తామని చెప్పారు. అదానీతో రేవంత్ దోస్తీని నిలదీయాలనే ఉద్దేశంతో వారి ఫొటోలు ఉన్న టీషర్టులతో వస్తే అసెంబ్లీలోకి వెళ్లనీయలేదని కేటీఆర్ అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ అరాచకాలను సభలో నిలదీస్తామని చెప్పారు. రాష్ట్రంలో కొనసాగుతున్నది ప్రజాస్వామ్య ప్రభుత్వమా? అరాచక ప్రభుత్వమా? అని ప్రశ్నించారు.

## పవన్ ను కలిసేందుకు 760 కిలోమీటర్లు
# ఎడ్లబండిపై ప్రయాణం చేసిన యువ రైతు



అమరావతి: ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ను కలిసేందుకు ఓ యువ రైతు 760 కిలోమీటర్లు ఎడ్లబండిపై ప్రయాణం చేసి మంగళగిరి చేరుకోవడం అందరి దృష్టిని ఆకర్షించింది. నవీన్ అనే రైతు హిందూపురం నుంచి ఎడ్లబండిపై 28 రోజుల పాటు ప్రయాణించి ఇటీవల మంగళగిరిలోని జనసేన కార్యాలయానికి చేరుకున్నాడు. రైతులు ఎదుర్కొంటున్న కష్టాలను పవన్ కు చెప్పాలని ఆ రైతు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల మీదుగా వందలాది కిలోమీటర్లు ఎడ్లబండిపై ప్రయాణించాడు. ఆయా ప్రాంతాల్లోని రైతులతో మాట్లాడుతూ వారి సమస్యలు కూడా తెలుసుకున్నాడు. గత మూడు రోజులుగా తాను పవన్ కోసం ఎదురుచూస్తున్నట్టు చెప్పాడు. రైతుల కష్టాలపై డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ను కలిసేందుకు అనుమతించాలని ఆ రైతు అభ్యర్థించాడు.

# మాజీ ఎమ్మెల్యే ఇంట్లో చోరీ



**(నేటి శుభోదయ):** డిసెంబర్-16 ఆమనగల్లు: జూబ్లీహిల్స్ లోని భరణి లేఅవుట్ లో నివాసముంటున్న బిఆర్ఎస్ పార్టీ కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే గుర్క జైపాల్ యాదవ్ ఇంట్లో చోరీ జరిగింది.ఆయన ఇంట్లో దాదాపు7.5 లక్షల నగదును దుండగులుఎత్తుకెళ్లారని దీంతో ఆయన ఫిల్మ్ నగర్ పోలీస్ లకు ఫిర్యాదు చేయడం జరిగింది. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. దొంగతనం జరిగిన సమయంలో జైపాల్ యాదవ్ ఇంట్లో లేదని తెలుస్తోంది.

# ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల సర్వే



**(నేటి శుభోదయ):** డిసెంబర్-16 ఆమనగల్లు:ఆమనగల్ మున్సిపాలిటీ పరిధిలోని 3వార్డు నుచ్చుగుట్ట తండా లో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల సర్వే భాగంగా ఇంటింటికీ వెళ్లి దరఖాస్తుదారులు సర్వే అధికారులను సహకరించాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వం హామీ ఇచ్చిన 6 గ్యారెంటీ పథకాల్లో భాగంగా ఇందిరమ్మ ఇళ్ల పథకానికి వచ్చిన దరఖాస్తులను పరిశీలించి లబ్ధిదారులను ఎంపిక చేయడం జరుగుతుందని మున్సిపల్ కమిషనర్ వసంత తెలిపారు.ఈ కార్యక్రమంలో చైర్మన్ రాంపాల్ నాయక్,వైస్ చైర్మన్ బీమనపల్లి దుర్గయ్య,కాంగ్రెస్ జిల్లా నాయకుడు కృష్ణ నాయక్,ఆఫీసర్ శంకర్,ఇందిరమ్మ కమిటి సభ్యులు,లక్ష్మి,చందు నాయక్,రఘు నాయక్,రజిత భాస్కర్,కుమార్,కిషన్,శాంతి,చిన్న,సురేష్, తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా ఆంజనేయ స్వాముల ఇరుముడి



**(నేటి శుభోదయ):** డిసెంబర్-16 ఆమనగల్లు:ఈరోజు కల్వకుర్తి నియోజకవర్గం అమనగల్లు మున్సిపాలిటీ శ్రీ శ్రీ వెంకటేశ్వర దేవాలయం సన్నిధిలో శ్రీ ఆంజనేయ స్వాముల ఇరుముడి కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ మరియు మాజీ జడ్పీటీసీ అనురాధ పత్య నాయక్ గురు స్వామి చుక్క నిరంజన్ ఆధ్వర్యంలో ఆంజనేయస్వాములు వారిని శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు గుత్తి బాలస్వామి,ఉప సర్పంచ్ ప్రశాంత్ నాయక్, బిఆర్ఎస్ ఎస్టీ సెల్ అధ్యక్షులు రమేష్ నాయక్, మద్దూరి ఆనంద్,మహేష్,రవి లతో పాటు స్వాములు పాల్గొన్నారు.

# కొండపర్వ లో ఎక్సైజ్ అధికారులు ఆకస్మిక దాడులు



విస్సన్నపేట:**(నేటి శుభోదయ):** (ప్రతినిధి కమలాకర్): తిరువూరు నియోజకవర్గ పరిధిలోని కొండపర్వలో ఆకస్మిక దాడులు నిర్వహించిన తిరువూరు ఎక్సైజ్ అధికారులు మూకుమ్మడిగా ఎన్ఫోర్స్మెంట్ ఆకస్మిక దాడులు ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ ఎన్ఫోర్స్మెంట్ విజయవాడ, వై.శ్రీనివాస చౌదరి,ఆదేశాల మేరకు కెవి.సుధాకర్ ఇన్స్పెక్టర్ ఆధ్వర్యంలో సిబ్బంది తిరువూరు ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని కొండపర్వలో ఆకస్మిక దాడులు నిర్వహించగా దాడుల్లో మూటము బాలమ్మ,ఆకుల ప్రభావతి ల వద్ద నుండి 72 తెలంగాణ మద్యం బాటిల్స్ స్వాధీన పరుచుకొని, వారిని అదుపులోకి తీసుకొని వారి మీద కేసు నమోదు చేసి స్టేషన్ కు అప్పగించారు.ఈ దాడుల్లో సబ్ ఇన్స్పెక్టర్ యం.రామ శేషయ్య, కె.మధు హెచ్,సిబ్బంది మొదలైన వారు దాడుల్లో పాల్గొన్నారు.

# ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ ఉచిత వైద్య శిబిరం



**(నేటి శుభోదయ):** డిసెంబర్-16 కడ్తాల్:కల్వకుర్తి నియోజకవర్గం కడ్తాల్ మండల పరిధిలోని అన్మాస్ పల్లి గ్రామంలో ఉప్పల చారిట్రబుల్ ట్రస్ట్ మరియు జర్పుల రాధాకృష్ణ మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిభిరాన్ని ఏర్పాటు చేయడం జరిగింది.డా,,ఉప్పల అఖిల్ బృందం కామినేని హాస్పిటల్ సహకారంతో దాదాపు 255 మంది గ్రామస్తులకు వైద్య పరీక్షలు నిర్వహించి వారికి తగిన మందులు ఇవ్వటం జరిగింది.ఈ ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించడం వల్ల ఈ సందర్భంగా నిర్వాహకులకు మరియు వైద్యులకు కృతజ్ఞతలు తెలియజేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో మాజీ మిషన్ భగీరథ వైస్ చైర్మన్,ఉప్పల చారి ట్రబుల్ ట్రస్ట్ చైర్మన్, తలకొండపల్లి మాజీ జెడ్పిటిసి ఉప్పల వెంకటేష్,పిఏసిఎస్ చైర్మన్ గంప వెంకటేష్,కడ్తాల్ మండల మాజీ జెడ్పిటిసి జర్పుల దశరథ్ నాయక్,వైస్ ఎంపీపీ బావండ్లపల్లి ఆనంద్,జోగు వీరయ్య,కృష్ణయ్య,గ్రామ కమిటీ బిఆర్ఎస్ అధ్యక్షుడు మహేష్ యాదవ్,కంబాల రమేష్,ప్రేమ్ కుమార్,శ్రీను,కొప్పు కృష్ణ,పాండు,వగ్గు మహేష్, కృష్ణ, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

# క్రీ.శే.శాసనాల నాగేశ్వరరావు ప్రథమ వర్ధంతి సభలో పాల్గొని నివాళులర్పించిన డివిజన్ ఎక్స్ కార్పొరేటర్ తోట రామారావు



కొదుమూరి జగన్నాదం ,ఖమ్మం**(నేటి శుభోదయ):** 48వ డివిజన్ గణేష్ నగర్ ప్రాంతంలో క్రీ.శే. శాసనాల నాగేశ్వరరావు ప్రథమ వర్ధంతి సభలో పాల్గొని నివాళులర్పించి వారి కుటుంబ సభ్యులతో మమేకమై వారి జ్ఞాపకాలను వారి సేవలను గుర్తు చేసుకొని మీ సమస్యలో నేను ఎల్లప్పుడూ అండగా ఉంటానని తెలియపరచి ఆ కుటుంబ సభ్యులకు మనో ధైర్యాన్ని కల్పించి ఓదార్చడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎక్స్ కౌన్సిల్ సభ్యులు వంగాల వెంకట్, డివిజన్ అధ్యక్షులు చేతి కృష్ణ, మైనారిటీ నాయకులు బాబా, డివిజన్ బాధ్యులు కిషన్ నాయక్ గణేష్ నగర్ ప్రాంత నాయకులు బుడిగం వెంకన్న తోకల ప్రభాకర్, రమణ, శివా లింగయ్య, వీరస్వామి, రాము తదితర మిత్రులు పాల్గొనడం జరిగింది.

# క్రిస్టియన్ పద్ధతిలో మళ్లీ పెళ్లి చేసుకున్న మహానటి కీర్తి సురేష్!


## ఈ మహానటి చాలా హాట్ గురూ!

విశాఖపట్నం జిల్లా **(నేటి శుభోదయ):** టాలీవుడ్ ఇండస్ట్రీలో చాలామంది హీరోయిన్లు ఉన్న సంగతి తెలిసిందే. అయితే ఇందులో చాలామంది హీరోయిన్లు పెళ్లి కూడా చేసేసుకుంటు న్నారు. ఇప్పటికే చాలా మంది హీరోయిన్లకు పెళ్లి కాగా...మరికొంతమంది పెళ్లికి సిద్ధమయ్యారు. ఇలాంటి నేపథ్యంలో తాజాగా స్టార్ హీరోయిన్ కీర్తి సురేష్ వివాహం చేసు కున్న సంగతి తెలిసిందే. తన చిన్ననాటి ఫ్రెండ్.. ఆంటోనీ తట్టిల్ ను ప్రేమించి పెళ్లి చేసుకుంది హీరోయిన్ కీర్తి సురేష్. దాదాపు 14 సంవత్సరాలు అతన్ని సీక్రెట్ గా లవ్ చేసిందట కీర్తి సురేష్. స్కూలుకు వెళ్లే వయసు నుండి వీరిద్దరూ ప్రేమలో ఉన్నట్లు చెబుతున్నారు. అయితే ఈ విషయాన్ని రహస్యంగా ఉంచిన హీరో యిన్ కీర్తి సురేష్... ఇద్దరు లైఫ్ లో సెటిల్ అయ్యాక.... కుటుంబ సభ్యులకు కూడా వివరించారు.

### ఇక ఇద్దరు సెటిల్ కావడం తో...

కీర్తి సురేష్ ప్రేమ వివాహానికి ఎవరు అడ్డు చెప్పలేదు. దీంతో నాలుగు రోజుల కిందట హిందూ సాంప్రదాయ పద్ధతిలో... హీరోయిన్ కీర్తి సురేష్ వివాహం జరిగింది. టాలీవుడ్ హీరోయిన్ కీర్తి సురేష్ వివాహం గోవాలోనే నిర్వహించారు. టాలీవుడ్ హీరోయిన్ కీర్తి సురేష్ వివాహానికి సెలబ్రి టీలు అందరూ వెళ్లారు. దానికి సంబంధించిన ఫోటోలు అలాగే వీడియో లు సోషల్ మీడియాలో వైరల్ గా మారాయి. ఇక ఈ ఫోటోలు వైరల్ కావడంతో అందరూ కీర్తి సురేష్ కు శుభాకాంక్షలు తెలపడం జరుగుతుంది. ఇది ఇలా ఉండగా... పెళ్లి అయిన వారం రోజులకే.. హీరోయిన్ కీర్తి సురేష్ మరోసారి పెళ్లి చేసుకుంది. అయితే ఈసారి క్రిస్టియన్ పద్ధతిలో ఆదివారం మరోసారి తన ప్రియుడ్ని పెళ్లి చేసుకుంది...క్రిస్టియన్ పద్ధతి ప్రకారం... రింగులు మార్చుకోవడం... కిస్సులు పెట్టుకోవడం అనే సాంప్రదాయం ఉంటుందట అచ్చం అదే పద్ధతి అవలం బించిన ఈ ఇద్దరు.... క్రిస్టి యన్ పద్ధతిలో వివాహం చేసుకున్నారు. అయితే తన ప్రియుడికి కిస్ పెట్టిన కీర్తి సురేష్ ఫోటో ఇప్పుడు సోషల్ మీడియా లో వైరల్ గా మారింది. ఈ ఫోటోను చూసిన నేటిజెన్స్ రకరకాలుగా స్పందిస్తు న్నారు. కీర్తి సురేష్ చాలా హాట్ గురు అంటున్నారు.





# పని గంటలు పెంచుతూ నిర్దేశించిన లక్ష్యాలను సాధించాలి ఎపిఎ జి.యం

( నేటి శుభోదయ):16 (సిహెచ్.స్వామి)పెద్దపల్లి.రామగిరి:- పని గంటలు పెంచుతూ నిర్దేశించిన లక్ష్యాలను సాధించాలని అడ్రియాల ప్రాజెక్ట్ ఏరియా జనరల్ మేనేజర్ కొప్పుల వేంకటేశ్వర్లు అన్నారు. సింగరేణి వ్యాప్తంగా నిర్వహిస్తు నటువంటి మల్టీ డిపార్ట్మెంటల్ సమావేశాలలో భాగంగా అడ్రియాల లాంగ్ వాల్ గని నందు సోమవారం నిర్వహించిన అవగాహణ కార్యక్రమాన్ని అడ్రియాల ప్రాజెక్ట్ ఏరియా జనరల్ మేనేజర్ కొప్పుల వేంకటేశ్వర్లు ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రారంభించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ ఆర్థిక సంవత్సరానికి నిర్దేశించుకున్న 72 మిలియన్





టన్నుల బొగ్గు ఉత్పత్తి లక్ష్యాలను అధిగమించడానికి, పని గంటలు పెంచుతూ భద్రతతో కూడిన ఉత్పత్తిని సాధించాలని అన్నారు. ఉత్పత్తి వ్యయాన్ని తగ్గించుకోవాల్సిన బాధ్యత అందరి పైన ఉందని, కావున ఎవరి స్థాయిలో వారు సాధ్యమైనంత వరకు వ్యయాన్ని తగ్గించుకోవాలని కోరారు. అంతే కాకుండా నాణ్యత ప్రమాణాలు తప్పనిసరిగా పాటిస్తూ, అంకిత భావంతో పని చేయాలని అన్నారు. భద్రత పట్ల అశ్రద్ధ వహించకుండా అధికారులు, సూపర్వైజర్లు సంబంధిత ఉద్యోగులకు భద్రతపై అవగాహన కల్పించాలని సూచించారు. ప్రతి ఉద్యోగి సక్రమంగా పని చేస్తూ వ్యక్తిగతంగా అభివృద్ధి చెందుతూ, సంస్థ అభివృద్ధికి తోడ్పడాలన్నారు. ఏ ఇతర ప్రభుత్వ సంస్థలో లేని విధంగా సింగరేణి సంస్థలో ఉద్యోగుల కోసం అనేక సంక్షేమ కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని, కావున ఉద్యోగులందరూ దీనిని గమనించి, సమిష్టి కృషితో నాణ్యత, ఉత్పత్తి, ఉత్పాదకత పెంచుతూ సంస్థను మరింత ముందుకు తీసుకువెళ్లాలని కోరారు. ఈ సమావేశంలో భాగంగా నిర్దేశించిన లక్ష్యాలను అధిగమించడానికి రూపొందించిన ప్రణాళికల గురించి సంబంధిత అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. దీనిలో భాగంగా సంస్థ అభివృద్ధికి సంబంధించి పలువురు ఉద్యోగులు ఇచ్చినటువంటి సలహాలు, సూచనలను సంబంధిత అధికారులు స్వీకరించారు. కార్యక్రమంలో ప్రాజెక్ట్ ఆఫీసర్ కొలిపాక నాగేశ్వరరావు,ఎస్వోటుజియం బండి సత్యనారాయణ, ఫైనాన్స్ ఎజియం పి.శ్రీనివాసులు, ఐఈ డిజియం కె.చంద్రశేఖర్, ఇంచార్జ్ పర్సనల్ విభాగాధిపతి గుర్రం శ్రీహరి, ఇంచార్జ్ మేనేజర్ యం.రమేష్, సీనియర్ పి.ఓ మతీన్ హుస్సేన్, అధికారులు ఎల్.రవిచంద్ర, విక్రమ్, పిట్ సెక్రెటరిలు గంగాధర్, కొమురయ్య, ఇతర అధికారులు, కార్మిక సంఘాల నాయకులు, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

# రుణమాఫీపై ప్రభుత్వం తప్పుడు ప్రచారం

**రైతు బరోసా తక్షణం అమలు చేయాలి**
**పేదలందరికీ రూ.12వేలు ఇవ్వాలి**
**రైతాంగ ఆందోళనలపై నిర్భందం ఎత్తివేయాలి**
**రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు బాగం హేమంతరావు**
**తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో జిల్లా వ్యాపితంగా ధర్నాలు**




కొదుమూరి జగన్నాదం ,ఖమ్మం**(నేటి శుభోదయ):** రైతు రుణమాఫీకి సంబంధించి ప్రభుత్వం తప్పుడు ప్రచారం చేస్తుందని



రూ.2 లక్షల లోపు రుణాలున్న రైతుల్లో ఎక్కువ మంది మాఫీ జరగలేదని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం అధ్యక్షులు బాగం హేమంతరావు ఆరోపిచారు. రాష్ట్ర వ్యాపితంగా 50 లక్షల మంది రైతులుంటే అందులో 50 శాతం మందికి మాత్రమే రుణమాఫీ జరిగిందని రూ.2 లక్షల లోపుఉన్న రైతులలో కూడా వివిధ కారణాలతో మాఫీని నిలుపుదల చేశారని ఆయన తెలిపారు. తెలంగాణ రైతు సంఘం పిలుపుమేరకు సోమవారం ఖమ్మం జిల్లా వ్యాపితంగా మండలకేంద్రాల వద్ద ధర్నాలు నిర్వహించారు. ఖమ్మం రూరల్ అర్బన్, రఘునాదం మండల కేంద్రాలవద్ద జరిగిన ఆందోళనలలో పాల్గొన్న హేమంతరావు మాట్లాడుతూ పాస్పుస్తకాలు లేవని, కుటుంబ సభ్య సంఖ్య సరిపోలేదని రుణమాఫీని నిలుపుదల చేశారని మరణించిన రైతులకు సంబంధించి రుణమాఫీ జరగలేదన్నారు. 4వ దఫా రూ.3 వేల కోట్ల రుణమాఫీ చేస్తున్నామని ప్రభుత్వం ప్రకటించినప్పటికీ ఇంకా రైతుల ఖాతాలలో జమకాలేదన్నారు. రైతు బరోసాపై కాంగ్రెస్ ప్రభుత్వం ఊరిస్తుందని అమలుకు వాయిదాలు పెడుతుందని ఆరోపించారు. సంవత్సర కాలంగా రైతు బరోసా లేదని నవంబర్, డిసెంబర్ అంటూ వాయిదాలు వేసి ఇప్పుడు సంక్రాంతి అంటున్నారని రైతుబరోసాను రైతుల ఖాతాలలో వెంటనే జమచేయాలన్నారు. రైతు బీమా అమలు చేయడంతో పాటు వ్యవసాయ ఉత్పత్తులకు గిట్టుబాటు ధరలు కల్పించాలని రైతు సంఘం డిమాండ్ చేస్తుందని హేమంతరావు తెలిపారు. ధాన్యం, పత్తి కొనుగోళ్లలో అధికార యంత్రాంగం నిర్లక్ష్యం వహిస్తున్నదని దీనిపై తగు చర్యలు తీసుకోవాలని తేమ పేరుతో కొర్రీలు పెడుతున్నారని వారు తెలిపారు. దేశవ్యాపితంగా రైతాంగ ఉద్యమాలపై ఉక్కుపాదం మోపుతున్నారని ఢిల్లీ సరిహద్దులలో జరుగుతున్న రైతాంగం పోరాటం బాష్పవాయు గోళాలు ప్రయోగించడం, లాఠీచార్జీలు చేయడం నిలిపివేయాలని హేమంతరావు డిమాండ్ చేశారు. నూతన సాగు చట్టాలను దొడ్డిదారిన అమలు చేసే ప్రయత్నాలను విరమించుకోవాలని రైతాంగ ఉ ద్యమాలకు సంబంధించి నమోదైన కేసులన్నింటినీ తక్షణం ఎత్తివేయాలని, ఆమరణ నిరాహారదీక్ష చేస్తున్న రైతులను తక్షణం ఉపసంహరింపచేయాలని హేమంతరావు కోరారు. రాష్ట్ర ప్రభుత్వం డిసెంబర్ 28 నుండి అమలు చేయనున్న ఆర్థిక చేయూత పథకాన్ని భూమిలేని ప్రతి పేదవానికి అందించే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పట్టణ, గ్రామీణ పేదలందరికీ ఈ పథకాన్ని వర్తింపచేయాలన్నారు. ఖమ్మం రూరల్, అర్బన్, రఘునాధపాలెం మండల రెవిన్యూ అధికార్లకు సమస్యలతో కూడిన వినతి పత్రాలను అందచేశారు. ఖమ్మం రూరల్ మండల కార్యాలయం ముందు జరిగిన ఆందోళనలో సి.పి.ఐ రాష్ట్ర కంట్రోల్ కమీషన్ ఛైర్మెన్ మహ్మద్ మౌలానా, రైతు సంఘం నాయకులు మిడికంటి చిన్న వెంకటరెడ్డి, పుచ్చకాయల సుధాకర్, పాసంగుల చంద్రావు, బానోత్ రామ్కోటి, మిడికంటే పెద్ద వెంకటరెడ్డి, మామిడి సుర్యన్రెడ్డి, వెన్నం భాస్కర్, శ్రీనాధరెడ్డి, వెంపటి రాము పాల్గొనగా అర్బన్ కార్యాలయం ముందు ధర్నాలో సి.పి.ఐ జిల్లా కార్యవర్గసభ్యులు ఎస్.కె. జానిమియా, మహ్మద్సలాం, పగడాల మల్లేష్, మేకలశ్రీనివాసరావు, నాయకులు యానాలి సాంబశివరెడ్డి, నూనెశశిధర్, ఎస్.కె. సైదా, పోటుపూర్ణచంద్రావు, జ్వాలా నర్సింహారావు, ప్రతాసపు రామనాథం తదితరులు పాల్గొన్నారు. రఘునాధపాలెం మండల కార్యాలయం ముందు జరిగిన ఆందోళనలో సి.పి.ఐ మండల కార్యదర్శి శాకమూరిశ్రీనివాసరావు, రైతు సంఘం నాయకులు బాగం ప్రసాద్, బానోత్ చీనా, బానోత్ రవి, సురభిశ్రీను తదితరులు పాల్గొన్నారు.

# సర్పంచుల తరపున అసెంబ్లీలో గళమెత్తిన హరీష్ రావుకు కృతజ్ఞతలు

**రాష్ట్ర సర్పంచుల సంఘం అధ్యక్షుడు గూడూరు లక్ష్మీ నరసింహారెడ్డి**

**(నేటి శుభోదయ):** డిసెంబర్-16 కడ్తాల్:సోమవారం రోజున అసెంబ్లీ సాక్షిగా సర్పంచుల సమస్యలపై గళమెత్తిన మాజీ ఆర్థిక శాఖ మంత్రివర్యులు హరీష్ రావుకు రాష్ట్ర సర్పంచుల సంఘం తరపున అధ్యక్షుడు గూడూరు లక్ష్మీ నర్సింహ్మా రెడ్డి మరియు ప్రధాన కార్యదర్శి ప్రణీల్ చందర్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.కరోనా క్లిష్ట సమయంలో ప్రాణాలను సైతం లెక్క చేయక ఎంతో కష్టపడి,గ్రామాలలో వివిధ అభివృద్ధి పనులు చేసి దేశవ్యాప్తంగా తెలంగాణ పల్లెలకు గుర్తింపు తీసుకొచ్చిన సర్పంచులకు పెండింగ్ బిల్లులు చెల్లించక,రాష్ట్ర వ్యాప్తంగా సర్పంచులను నానా ఇబ్బందులు పెడుతున్న ప్రభుత్వాన్ని అసెంబ్లీ సాక్షిగా నిలదీసి సర్పంచులకు అండగా నిలబడిన ప్రతిపక్షానికి మరియు నాయకులకు కృతజ్ఞతలు.



ఇప్పటికైనా ప్రభుత్వం మేల్కొని పెండింగ్ లో ఉన్న గ్రామ పంచాయతీల బకాయిలను వెంటనే విడుదల చేయాలి లేని పక్షంలో రాబోయే రోజులలో రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుంది.బిల్లులు అందక ఆత్మ హత్యలు చేసుకున్న సర్పంచుల కుటుంబాలను ఈ ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని డిమాండ్ చేస్తున్నాం. సర్పంచుల నిరసన కార్యక్రమాలకు ప్రభుత్వం భయపడి సర్పంచులను ఎక్కడికక్కడ అరెస్టు చేసి నిర్బంధించడం హేయమైన చర్య, వెంటనే వారిని విడుదల చేయాలని డిమాండ్ చేస్తున్నాం.

## సర్పంచులపై బీఆర్ఎస్ మొసలి కన్నీరు



**(నేటి శుభోదయ):** డిసెంబర్-16 ఆమనగల్లు:పెండింగ్ బిల్లుల పాపం ముమ్మాటికి బీఆర్ఎస్ దే.ఆమనగల్లు పట్టణంలో మండల పార్టీ అధ్యక్షుడు తెల్గమల్ల జగన్,పట్టణ అధ్యక్షులు వస్పుల మానయ్య ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశం లో మాట్లాడుతూ బీఆర్ఎస్ పార్టీ నాయకులు కాంగ్రెస్ పార్టీని బద్నానం చేయడానికి ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు.గత పది సంవత్సరాలు బిఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉండి సర్పంచులకు,ఉపసర్పంచ్ లకు బిల్లులు ఇవ్వకుండా వారి ఆత్మహత్యకు కారణమైన బిఆర్ఎస్ పార్టీ ఈరోజు కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే వారి సమస్యల గురించి మాట్లాడటం విడ్డురంగా ఉందన్నారు.అధికారంలో ఉన్నప్పుడు సర్పంచ్ ల పెండింగ్ బిల్లుల గురించి పట్టించుకోని అప్పటి ఆర్థిక మంత్రి హరీశ్ రావు,ఇప్పుడు అసెంబ్లీలో సర్పంచ్ ల పెండింగ్ బిల్లులపై మొసలి కన్నీరు కార్చడం,వాకౌట్ చేయడం హస్యాస్పదంగా ఉందని మండిపడ్డారు.సర్పంచ్ ల పెండింగ్ బిల్లుల పాపం ముమ్మాటికి బీఆర్ఎస్ దే నని,బీఆర్ఎస్ పాలనలో సర్పంచ్ లు చేసిన అభివృద్ధి పనులకు బిల్లులు చెల్లించకుండా, %శ్రీ%పెండింగ్ లో పెట్టి, %శ్రీ%సర్పంచ్ ల ఆత్మహత్యలకు కారణమైంది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని పేర్కొన్నారు.కేంద్ర ప్రభుత్వం నుండి గ్రామ పంచాయతీలకు వచ్చే నిధులను కూడా దారి మళ్లించి, సర్పంచ్లను ఇబ్బందులకు గురిచేసింది బీఆర్ఎస్ ప్రభుత్వం కాదా అని ప్రశ్నించారు.అధికారంలో ఉన్నప్పుడు సర్పంచ్ల సమస్యలు పట్టని బీఆర్ఎస్ నేతలు,అధికారం కోల్పోయాక మొసలి కన్నీరు కార్చడం,దయ్యాలు వేదాలు వల్లించినట్లుగా ఉందని విమర్శించారు.కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంపై బీఆర్ఎస్ నాయకులు లేనిపోని ఆరోపణలు చేయడం,అవాకులు చెవాకులు పేలడం మానుకోవాలని హితవు పలికారు.కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం సర్పంచ్ల పెండింగ్ బిల్లుల సమస్యలను పరిష్కరిస్తుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ వస్పుల శ్రీశైలం,మాజీ సర్పంచ్ బలరాం,సీనియర్ నాయకులు ఖలీల్, ఖాదర్ ఖాద్రి,రామకృష్ణ,అబ్దుల్ ఆలీం,యూత్ కాంగ్రెస్ మండల ప్రెసిడెంట్ వస్పుల శ్రీకాంత్,కండె సాయి,మహ్మద్ రఫీ, సోషల్ మీడియా కన్వీనర్లు నాజర్,మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## నేడు జరిగే పెన్షనర్స్ డే కార్యక్రమాన్ని జయప్రదం చేయండి



కొదుమూరి జగన్నాదం ,ఖమ్మం**(నేటి శుభోదయ):** జాతీయ పెన్షనర్స్ డే సందర్భాన్ని పురస్కరించుకొని ఖమ్మం లోని భక్త రామదాసు కళాక్షేత్రంలో ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం జిల్లా శాఖ ఆధ్వర్యంలో జరిగే పెన్షనర్స్ డే లో జిల్లాలోని రిటైర్డ్ ఉద్యోగ మిత్రులంతా పాల్గొనాలని జిల్లా శాఖ అధ్యక్షులు కళ్యాణం కృష్ణయ్య , ప్రధాన కార్యదర్శి ఎం సుబ్బయ్య పిలుపునిచ్చారు . నెహ్రూ నగర్ లోని జిల్లా శాఖ కార్యాలయం లో జరిగిన కార్యవర్గ సమావేశం జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎం సాంబశివరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ రిటైర్డ్ ఉద్యోగి నకార పెన్షనర్ల హక్కుల కోసం సుప్రీంకోర్టులో కేసు దాఖలు చేసి పెన్షనర్లకు పెన్షన్ పొందే హక్కును సాధించిన రోజు డిసెంబర్ 17. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని జిల్లాలోని సీనియర్ మోస్ట్ పెన్షనర్లను అభినందించే కార్యక్రమం ఉంటుంది . ఈ కార్యక్రమమునకు ముఖ్యఅతిథిగా ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క , వ్యవసాయ శాఖ మాత్యులు తుమ్మల నాగేశ్వరరావు , రెవెన్యూ శాఖ మాత్యులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి , ఖమ్మం మున్సిపల్ మేయర్ శ్రీమతి పునుకులు నీరజ , జిల్లా కలెక్టర్ ముజామిల్ ఖాన్ , మున్సిపల్ కమిషనర్ అభిషేక్ అగస్త్య , జిల్లా పరిషత్ సీఈవో శ్రీమతి దీక్షారైన , రాష్ట్ర నాయకులు ఈ శరత్ బాబు , ట్రెజరీ కార్యాలయ డిప్యూటీ డైరెక్టర్ ఎస్వీఎస్ నరసింహం , డిఎంహెచ్వో కళావతి భాయ్ , స్తంభాద్రి బ్యాంక్ చైర్మన్ ఎర్నేని రామారావు తదితరులు ఈ పెన్షనర్ల సదస్సులో పాల్గొంటున్నట్లు వారు తెలిపారు . ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి తాళ్లూరి వేణు , ఎస్ పూర్ణచంద్రరావు , టీ జనార్ధన్ , డి కె శర్మ , వివిధ మండల నాయకులు రాధాకృష్ణ , హనుమంతరావు , వెంకటనారాయణ , ఆదినారాయణ , కృష్ణమూర్తి తదితరులు ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం ఖమ్మం జిల్లా శాఖ సభ్యులు పాల్గొన్నారు .

## అంగన్వాడీ కేంద్రం 51వ డివిజనలో పుట్టిన రోజు వేడుకలు బీరువ బహుకణ



కొదుమూరి జగన్నాదం ,ఖమ్మం,**(నేటి శుభోదయ):** నగరంలో 51 వ డివిజన్ బుర్హాన్ పురం 1 అంగన్వాడీ కేంద్రం నందు పుట్టిన రోజు వేడుకల కార్యక్రము సోమవారం నిర్వహించడం జరిగింది ఈ కార్య క్రమానికీ ముఖ్య అతిథిగా కార్పరేటర్ శీలంశెట్ట రమా వీరభద్రం గార్లు పాల్గొన్నారు అదేవిధంగా పిల్లలకు అన్నప్రసాద కార్యక్రమం నిర్వహించడం జరిగింది నరసింహారావు కవిత దంపతులు అంగన్వాడి కేంద్రానికి బీరువాను బహూకరించడం జరిగింది విలాసాగర్ కృష్ణ,పద్మ దంపతులు వేయింగ్ మిషన్ బకరించడం జరిగింది ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి శీలంశెట్టి రమా వీరభద్రం మాట్లాడుతూ ఈ సందర్భంగా వారు ఆరోగ్య లక్ష్మీ పథకం గురించి మాట్లాడినారు ఈ కార్యక్రమంలో అంగన్వాడి సూపర్డెంట్ రాధిక, అంగన్వాడీ టీచర్ కే శ్రీదేవి సుస్మిత సావిత్రి నాగమణి అంగన్వాడి ఆయా అరుణ మరియు అంగన్వాడి పిల్లలు వారి తల్లిదండ్రులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు

## ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులు అందజేత



**(నేటి శుభోదయ):** డిసెంబర్-16 ఆమనగల్లు: ఆమనగల్ పట్టణంలోని మార్కెట్ యార్డులో సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను సోమవారం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు తెల్గమళ్ళ జగన్ మరియు మున్సిపాలిటీ అధ్యక్షుడువస్పుల మానయ్య ఆధ్వర్యంలో బాధితులకు చెక్కులను అందించడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిరుపేదలకు కార్పొరేట్ వైద్యం అందించడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమన్నారు. ప్రజా ప్రభుత్వంలో నిరుపేదలకు ప్రభుత్వం ఎల్లప్పుడు అండగా ఉంటుందని ఈ సందర్భంగా తెలిపారు.స్థానిక ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి సహకారంతో బాధితులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేస్తున్నామన్నారు.ఈ కార్యక్రమంలో అలీమ్,ఖాదర్,తల్లోజు రామకృష్ణ,యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వస్పుల శ్రీకాంత్, సోషల్ మీడియా ఇంచార్జ్ లు దేవరశెట్టి మహేష్,నాజర్ పాల్గొన్నారు.

# రేపు సీపీఐ (ఎం) ఖమ్మం జిల్లా 22వ మహాసభలు

### 18, 19 తేదీల్లో సత్తుపల్లిలో నిర్వహణ
### 600 మందికి పైగా ప్రతినిధులు, పరిశీలకులు
### హాజరుకానున్న బీవీ రాఘవులు, తమ్మినేని
### సీపీఐ (ఎం) అంటేనే నిత్యం పోరాటాలు
### “ పార్టీ జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు




కొదుమూరి జగన్నాదం ,ఖమ్మం**(నేటి శుభోదయ):** సీపీఐ (ఎం) ఖమ్మం జిల్లా 22వ మహాసభలు సత్తుపల్లి పట్టణంలో ఈనెల 18, 19 తేదీల్లో నిర్వహించనున్నట్లు ఆ పార్టీ ఖమ్మం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు తెలిపారు. మొత్తం ఈ మహాసభలకు 600 మందికి పైగా ప్రతినిధులు, పరిశీలకులు హాజరవుతారని చెప్పారు. సీపీఐ (ఎం) అంటేనే నిత్యం పోరాటాలని తెలిపారు. భవిష్యత్తు ఉద్యమాలకు కార్యాచరణ రూపొందించుకునేందుకు ప్రతి మూడేళ్లకోసారి గ్రామం నుంచి జాతీయస్థాయి వరకు మహాసభలు నిర్వహించి, నూతన కార్యవర్గాన్ని ఎన్నుకునే సంస్కృతి ఒక్క సీపీఐ (ఎం) పార్టీకే ఉందని స్పష్టం చేశారు. ఖమ్మంలోని సుందరయ్య భవనంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నున్నా మాట్లాడారు. ఈ మహాసభలకు సీపీఐ (ఎం) పొలిట్ బ్యూరో సభ్యులు బీవీ రాఘవులు, రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, కేంద్ర కమిటీ సభ్యులు బి. వెంకట్, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పోతినేని సుదర్శన్, సాయిబాబు హాజరవుతారని వివరించారు. మహాసభల ప్రారంభానికి ముందు సత్తుపల్లి డివిజన్ కార్యాలయం నుంచి మహాసభల ప్రాంగణం వరకు ప్రదర్శన నిర్వహిస్తామని చెప్పారు.

### శాఖ నుంచి జాతీయస్థాయి వరకు కార్యవర్గం

సీపీఐ (ఎం) గ్రామ శాఖ నుంచి జాతీయ స్థాయి వరకు ప్రతి మూడేళ్లకోసారి మహాసభలు నిర్వహించి కార్యవర్గాన్ని ఎన్నుకునే ఆనవాయితీ దేశంలో సీపీఐ (ఎం) పార్టీకి మాత్రమే ఉందన్నారు. దీనిలో భాగంగా ఖమ్మం జిల్లాలో 516 శాఖ మహాసభలు, 28 మండల, పట్టణ మహాసభలు, ఐదు డివిజన్ మహాసభలు నిర్వహించి నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్లు చెప్పారు.

### నిత్యం ప్రజా సమస్యలపై పోరాటాలు

సీపీఐ (ఎం) అంటేనే పోరాటాలు.. ప్రతి మూడేళ్లకోసారి నిర్వహించే మహాసభల్లో ఉద్యమాల రూపకల్పన పై కార్యాచరణ రూపొందిస్తామని తెలిపారు. గడచిన మూడేళ్లలో సీపీఐ (ఎం) నిర్వహించిన ముఖ్యమైన పోరాటాల గురించి వివరించారు. 2022 అక్టోబర్ లో అశ్వారావుపేట - అదిలాబాద్ వరకు రోడ్లు దిగ్బంధించి నాటి బీఆర్ఎస్ ప్రభుత్వం మెడలు వంచి జిల్లాలో 8 వేల పోడు పట్టాలు సాధించుకున్నామని గుర్తు చేశారు. ల్యాండ్ పూలింగ్ లో భాగంగా ప్రజల నుంచి తీసుకున్న 820 ఎకరాల భూములను కాపాడగలిగామని చెప్పారు. 350 గ్రామాల్లో కూలి పోరాటాలు నిర్వహించామని తెలిపారు. నాగపూర్ టు అమరావతి, దేవరపల్లి - ఖమ్మం, సీతారామ ప్రాజెక్టుల కోసం ప్రభుత్వం జరిపిన భూసేకరణ ద్వారా నిర్వాసితులకు తగిన పరిహారం ఇప్పించడంలో సీపీఐ (ఎం) కృషి ఎనలేనిదని చెప్పారు. జిల్లాలో 3.78 లక్షల మంది రైతులకు గాను 1.20 లక్షల మందికి మాత్రమే రుణమాఫీ చేయడంపై పోరాటాలు నిర్వహించామని తెలిపారు. దేశంలో మతతత్వానికి వ్యతిరేకంగా సీసీఏ, ఎస్ఎఫ్ఐ పూర్వ విద్యార్థుల వేదిక ద్వారా 40 పైగా సెమినార్లు నిర్వహించామన్నారు. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట వార్షికోత్సవాల్లో భాగంగా 232 కేంద్రాల్లో సభలు నిర్వహించినట్లు చెప్పారు. 2022లో అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర మహాసభలు ఖమ్మంలో నిర్వహించినట్లు చెప్పారు. సభలకు లక్ష మందిని సమీకరించి, ఖమ్మానికి 5 వైపుల నుంచి 30 వేల మందితో ఎరుపు ర్యాలీ నిర్వహించామన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన బహిరంగ సభకు కేరళ ముఖ్యమంత్రి పినరయ్ విజయన్ ముఖ్యఅతిథిగా హాజరైనట్లు తెలిపారు. ఇవేకాక ధరల పెంపు, పన్నుల పెంపు, బడ్జెట్లో జిల్లాకు తగిన కేటాయింపులు లేకపోవడాన్ని నిరసిస్తూ ఉద్యమాలు నిర్వహించిన విషయాన్ని గుర్తు చేశారు. ఇళ్లు, ఇళ్ల స్థలాలు, జర్నలిస్టుల సమస్యలపైనా సీపీఐ (ఎం) పోరాటాలు నిర్వహించిందన్నారు. 400 కేంద్రాల్లో సీతారాం ఏచూరి సంస్మరణ సభలు నిర్వహించామని తెలిపారు. సీతారామ ప్రాజెక్టు నతనడకన సాగుతుండటం, రూ.2వేల కోట్ల అంచనా వ్యయంతో మొదలై నేడు రూ 20 వేల కోట్లకు చేరినా ప్రాజెక్టు అందుబాటులోకి రాకపోవడంపై ఉద్యమాలు నిర్వహించామన్నారు.

### ఆరుచోట్ల వైద్య శిబిరాలు

ప్రజా పోరాటాలే కాదు ప్రజలకు సర్వీస్ అందించే విషయంలోనూ సీపీఐ (ఎం) ముందుంటుందని ప్రస్తావించారు. గత ఎనిమిది తొమ్మిది సంవత్సరాలుగా జిల్లాలో ఆరు చోట్ల పార్టీ ఆధ్వర్యంలో వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నామని అన్నారు. వీటి ద్వారా ప్రతినెల 4,000 మంది వైద్యం పొందుతున్నారని పేర్కొన్నారు. వీరికి రూ.100కే రూ.2వేలకు పైగా విలువ చేసే మందులను పంపిణీ చేస్తున్నట్లు వివరించారు. ఇప్పటికీ రూ.20 లక్షల విలువ చేసే మందులను పంపిణీ చేశామన్నారు. వరదల్లో చిక్కుకున్న జనాన్ని తన పార్టీ కార్యకర్తలు రక్షించారని, వరద బాధితులకు భోజనాలు, తాగునీరు, దుస్తులు సమకూర్చినట్లు చెప్పారు. 7000 మందికి పాత దుస్తులు అందజేసినట్లు తెలిపారు. ఈ మహాసభల్లో భాగంగా భవిష్యత్ కార్యాచరణ రూపొందిస్తామని చెప్పారు. గ్రానైట్ పరిశ్రమ సంక్షోభంపై, వ్యవసాయ అనుబంధ పరిశ్రమల స్థాపన, ఖమ్మంలో విశ్వవిద్యాలయం ఏర్పాటు, నిమ్స్ తరహా వైద్య కళాశాల, ఆరు గ్యారంటీల అమలుపై తీర్మానం చేస్తామని వెల్లడించారు. విలేకరుల సమావేశంలో సీపీఐ (ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు యర్రా శ్రీకాంత్, కళ్యాణం వెంకటేశ్వరరావు, బండి రమేష్, వై. విక్రమ్ తదితరులు పాల్గొన్నారు.

## అయన ఊపదేశాలు ఆచరణీయం టి ఎన్ జి ఓస్ ఆధ్వర్యంలో ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుక..

## క్రీస్తు సంఘ సంఘ సంస్కర్త



కొదుమూరి జగన్నాదం ,ఖమ్మం**(నేటి శుభోదయ):** క్రైస్తవులు అత్యంత పవిత్రంగా ఆచరించే క్రిస్మస్ పర్వదినం సందర్భంగా స్థానిక టి ఎన్ జి ఓస్ ఫంక్షన్ హాల్లో సెమి క్రిస్మస్ వేడుక ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో క్రైస్తవ కుటుంబాలకు చెందిన ఉద్యోగులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ క్రిస్మస్ శాంతికి ప్రతీక అన్నారు. ఏసుక్రీస్తు ఎన్నో ఇబ్బందులకు గురైనప్పటికీ తన శాంతి సందేశాన్ని ప్రపంచానికి తెలియపర్చారన్నారు. అతను చూపిన క్షమాగుణం అలవార్చుకోవాలని హితావుపలికారు. పరిశుద్ధాత్మతో జన్మించి శాంతి కోసం, కమాగుణం, పాపులను క్షమిచలని, పేదలను అక్కున చేర్చుకునే అలవాటు అలవర్చుకోవాలని గొప్ప ఉద్దేశాన్ని ప్రపంచానికి చాటిచెప్పారని, దీనికోసం తన ప్రాణాన్ని సైతం తృణప్రాయంగా అర్పించారని కొనియాడారు. అయన ఉపదేశాలు సర్వదా ఆచరనీయం అని పేర్కొంటూ వాటిని అలవార్చుకోవాలని కోరారు. అనంతరం క్రిస్మస్ కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిధులుగా విచ్చేసిన టి జి ఓస్ రాష్ట్ర అధ్యక్షులు జె ఏ సి సెక్రటరీ జనరల్ ఏలూరి శ్రీనివాసరావు, జె ఏ సి కో కన్వీనర్ ఉపాధ్యాయ సంఘ నాయకులు. దేవరకొండ సైదులు, టి జి ఓస్ జిల్లా అధ్యక్షులు కాస్తాల సత్యనారాయణ, కార్యదర్శి మోదుగు వేలాద్రి , టి ఎన్ జి ఓస్ యూనియన్ నాయకులు కొణిదెల. శ్రీనివాస్, గుంటుపల్లి. శ్రీనివాస్, జడ్ ఎస్ జయపాల్, కొమరగిరి దుర్గప్రసాద్, ఎస్ లలిత కుమారిటి ఎన్ జి ఓస్ మాజీ జిల్లా అధ్యక్షులు రామయ్య, వల్లపు వెంకన్న, ఆయుష్. ప్రకాష్, యర్రా రమేష్, శ్రీధర్ సింగ్, హరికృష్ణ, తాల్లూరి శ్రీకాంత్, శ్రీధర్ సింగ్, చంద్రశేఖర్, బిట్టా ప్రవీణ్, గురుమూర్తి, గంగవరపు బాలకృష్ణ, రాధాకృష్ణ, పెద్దపుల్లయ్య, అవినాష్, ప్రవీణ్, అనంతరాములు, సి హెచ్ కృష్ణ, శ్రీనివాసరావు, కందుల విజయ్, మమత, అలాగే నాల్గవ తరగతి యూనియన్ అధ్యక్షులు బిక్కు, కార్యదర్శి వెంకటరమణ, నాలుగోతరగతి ఉద్యోగులు హౌస్ బిల్డింగ్ సొసైటీ అధ్యక్షులు కోడి లింగయ్య ,డ్రైవర్స్ యూనియన్ అధ్యక్షులు వెంకటేశ్వరావు, ఈ కార్యక్రమానికి పాస్టర్లు సత్యపాల్, నామా శ్యాంసుందర్ లు క్రిస్మస్ యొక్క గొప్పతనాన్ని తెలియజేసి కేక్ కట్ చేసి అందరికి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేసారు...

## తిరువూరు నియోజకవర్గంలో పర్యటన

### ఎన్టీఆర్ జిల్లా వైసిపి అధ్యక్షులు దేవినేని అవినాష్



విస్సన్నపేట**(నేటి శుభోదయ):** (ప్రతినిధి కమలాకర్): తిరువూరు నియోజకవర్గంలో వైఎస్ఆర్ సీపీ జిల్లా అధ్యక్షుడు దేవినేని అవినాష్ తన పర్యటనలో భాగంగా సోషల్ మీడియా ప్రతినిధిని కలిసిన సందర్భంలో మాట్లాడుతూ రాష్ట్రంలో తెలుగుదేశం కూటమి ప్రభుత్వం ఏర్పడి ఆరు నెలలు దాటినా వారు ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయకుండా కల్లబొల్లి మాటలతో కాలంక్షేపం చేస్తున్నదని ఎన్టీఆర్ జిల్లా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు దేవినేని అవినాష్ ధ్వజమెత్తారు. సోమవారం దేవినేని విస్సన్నపేట మండలం పుట్రాల గ్రామ పర్యటనలో



ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు.తొలుత సోషల్ మీడియా కార్యకర్త నానికి ఆర్థిక సహాయం రెండు లక్షల చెక్కు అందజేశారు.కూటమి ప్రభుత్వం అభివృద్ధి,ప్రజాపాలన పట్టించుకోకుండా కాలయాపన చేస్తున్నదని దండెత్తారు.ప్రజా సమస్యలు పట్టించుకోకుండా డైవర్షన్ పాలన చేస్తున్నారని దేవినేని ఆరోపించారు. వైయస్సార్ పార్టీ నాయకులు కార్యకర్తలపై పాల్స్ కేసులు బనాయించి జైళ్ల పాలు చేస్తున్నారని ఆవేదన చెందారు.వచ్చే 2029 ఎన్నికల్లో వైయస్సార్ కాంగ్రెస్ కంచుకోట తిరువూరు నియోజవర్గమును గెలుచుకోవడమే కాకుండా రాష్ట్రంలో తిరిగి జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి అవుతారని దేవినేని దృఢవిశ్వాసం వ్యక్తపరిచారు. ఈ పర్యటనలో సీనియర్ నాయకులు మద్ది రెడ్డి సూర్యనారాయణ రెడ్డి, వీరారెడ్డి, జడ్పిటిసి లోకేశ్వర్ రెడ్డి, ఎన్టీఆర్ జిల్లా వైఎస్ఆర్ కాంగ్రెస్ అధికార ప్రతినిధి ముంగా జయరాజు, పలువురు ఎంపీటీసీలు, సర్పంచులు నాయకులు పాల్గొన్నారు.

## మేయర్ కు వినతి పత్రం అందించిన 40వ డివిజన్ ఇందిరమ్మ ఇండ్ల కమిటీ సభ్యులు



కొదుమూరి జగన్నాదం**(నేటి శుభోదయ):** 40వ డివిజన్ లో ఇందిరమ్మ ఇండ్లు సర్వే సరిగా జరగటం లేదని ఇందిరమ్మ ఇండ్ల కమిటీ సభ్యులకు ఎటువంటి సమాచారం ఇవ్వకుండా స్థానిక కార్పొరేటర్ భర్త దాదే సతీష్ వచ్చిన సర్వే సిబ్బందితో కుమ్మక్కయి ప్రభుత్వాని తప్పుడు దోవ పట్టిస్తున్నారని 40వ డివిజన్ ఇందిరమ్మ ఇండ్ల కమిటీ సభ్యులు వాపోయారు . దాదే సతీష్ తనకు అనుకూలంగా ఉన్న వ్యక్తులకు సర్వే చేపిస్తున్నాడని మున్సిపాలిటీ కార్యాలయంలో నగర పాలక సంస్థ మేయర్ పూను కొల్లు నీరజ కు వినతి పత్రాన్ని అందించారు . అతను బిఆర్ఎస్ పార్టీ నాయకుడని , మున్సిపాలిటీ కార్యాలయంలో కాంట్రాక్టర్ వర్కింగ్ ఇన్స్పెక్టర్ గా పని చేస్తున్నాడని పేర్కొన్నారు . అతను పై విచారణ చేపట్టి తగు చర్యలు తీసుకోవాలని అలాగే సర్వే చేసే సిబ్బందిని మార్చాలని కోరారు . ఈ కార్యక్రమంలో 40వ డివిజన్ కాంటెస్ట్ కార్పొరేటర్ డివిజన్ ఇంచార్జి గడ్డికొప్పుల ఆనందరావు , డివిజన్ అధ్యక్షులు అబ్దుల్ ఆహాద్ , నాయకులు అజీమ్ , జావిద్ , గోపి , సమీర్ , సన్నీ , మధు , యాసిన్ , సంపత్ , జిలాని , రామకృష్ణ , రెహమాన్ , అబ్బాస్ తదితరులు పాల్గొన్నారు

## మంత్రి పొంగులేటి క్యాంప్ కార్యాలయంలో సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

కొదుమూరి జగన్నాదం ,ఖమ్మం**(నేటి శుభోదయ):** ఖమ్మం నగరం శ్రీనగర్ కాలనీలోని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి క్యాంప్ కార్యాలయంలో ఖమ్మం రూరల్ , తిరుమలాయపాలెం మండలాలకు చెందిన సీఎంఆర్ఎఫ్ లబ్ధిదారుల చెక్కులను మంగళవారం ఉదయం 11గంటలకు పంపిణీ చేస్తున్నట్లు మంత్రి పొంగులేటి క్యాంప్ కార్యాలయ ఇన్ చార్జ్ తుంబూరు దయాకర్ రెడ్డి తెలిపారు. ఈ మేరకు సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. లబ్ధిదారులతో పాటు ఆయా మండలాల ముఖ్య నాయకులు పాల్గొనాలని కోరారు.

# యేసుక్రీస్తు ప్రేమ త్యాగం గొప్పది

### ఐఎంఐ ప్రధాన కార్యదర్శి అంకరి కుమార్



మంథని, చేరాలరవీందర్, డిసెంబర్ -16 ( నేటి శుభోదయ): పెద్దపల్లి జిల్లా మంథని మండలం లోని ఎక్లాస్ పూర్, నెల్లిపల్లి, సూరయ్యపల్లి గ్రామాల్లో సోమవారం క్రిస్మస్ క్యారల్స్ నిర్వహించడం జరిగింది. ఇంటర్నేషనల్ మిషన్స్ ఇండియా ప్రధాన కార్యదర్శి అంకరి కుమార్ మాట్లాడుతూ.... కన్య మరియ గర్భంలో ఏసుక్రీస్తు జన్మించి తన పవిత్రతను చాటుకున్నాడని, నిన్ను వలె నీ పొరుగు వారిని ప్రేమించు అనే క్రీస్తు బోధనలు అందరూ ఆచరించ దాగినవన్నారు. యేసుక్రీస్తు మానవులపై చూపించిన ప్రేమ, త్యాగం వేల కట్టలేనిదని అయన అన్నారు. ఈ సందర్భంగా క్రిస్మస్ కేక్ లు కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు, అనంతరం సహపంక్తి భోజనాలు చేశారు. ఈ కార్యక్రమంలో సీయోను ప్రార్ధన మందిరం పాస్టర్లు దూడ మహేష్, మంథని మార్క్, అజ్మీరా దయరాజు, కలువల శామ్యూల్, గద్దల రాజేష్, సంఘ పెద్దలు ఎం కే జోసెఫ్, మంథని ప్రసాద్, చింతకుంట్ల ప్రేమ్ కుమార్, అందె రమేష్, ఈర్ల సదానందం, అడిచర్ల కరుణాకర్, నాగరాజు తో పాటు తదితరులు పాల్గొన్నారు.

# రహదారి నిర్మాణానికి ఎంపికైన భూములలో రైతులు పంటలు వేయవద్దు

### ఆర్బిటేషన్ పూర్తయిన భూములకు చెల్లింపులు ప్రారంభమయ్యాయి

### ముత్తారం మండల రెవెన్యూ అధికారి సుమన్



ముత్తారం మండల ప్రతినిధి(**నేటి శుభోదయ**): డిసెంబర్-16: జాతీయ రహదారి నిర్మాణంలో భాగంగా ముత్తారం (మంథని) మండలంలోని ముత్తారం, ఒడెడు, కేశనపల్లి, అడవిశ్రీరాంపూర్, పోతారం, సర్వారం, మైదంబండ, లక్కారం మరియు శుక్రవారంపేట గ్రామాలలో జాతీయ రహదారి నిర్మాణం కోసం భూ సేకరణ జరిగినది, ఇట్టి భూసేకరణకు గాను పరిహారం విషయంలో పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష సమక్షంలో ఆర్బీటేషన్ నిర్ణయించనైనది, ఇట్టి ఆర్బీటేషన్ పరిహారం చెల్లింపు పక్రియ ప్రారంబమైనది, కావున ఆయా (9) గ్రామాలలో రహదారి నిర్మాణానికి ఎంపిక చేసిన భూములలో రైతులు ఎలాంటి సాగు చేయవద్దని తెలుపుతు మరియు ఇట్టి భూసేకరణలో భాగంగా ఎన్ హెచ్ అథారిటీ వారు సంబందిత (9) గ్రామాలలో తదుపరి చర్యలు చేయబడునని, ఆయా భూములకు సంబంధించిన రైతులు సహకరించాలని ముత్తారం మండలం రెవెన్యూ అధికారి సుమన్ తెలిపారు.

# మానసిక ఆరోగ్యం బాగాలేక వ్యక్తి ఆత్మహత్య

### తలకొండపల్లి ఎస్ఐ ఏ.శ్రీకాంత్



**(నేటి శుభోదయ):** తలకొండపల్లి: మానసిక ఆరోగ్యం బాగాలేక వ్యక్తి అత్మహత్య చేసుకున్న సంఘటన చోటు చేసుకున్నది. తలకొండపల్లి ఎస్సై శ్రీకాంత్ తెలిపిన వివరాల మేరకు.. తలకొండపల్లి మండలం చంద్రదాన గ్రామానికి చెందిన బంగారిగల్ల యాదయ్య, వయసు (28) కి మూడు సంవత్సరాల క్రితం నిర్దవెల్లి గ్రామానికి చెందిన కావలి మమతతో వివాహం జరిగింది వారికి సంతానం లేదు. కొన్ని రోజుల నుండి యాదయ్యకు ఆరోగ్యం బాగాలేక బాధపడేవాడు. తేదీ 10-12-2024 రోజు యాదయ్య అతని భార్యను అత్తగారింట్లో ఉంచి ఒక్కడే ఇంటికి వచ్చాడు.అదే రోజు రాత్రి 8:00 గంటల సమయంలో ఇంట్లో ఎవరు లేని చూసి పెట్రోల్ పోసుకొని నిప్పు అంటించుకున్నాడు.వెంటనే కుటుంబ సభ్యులు యాదయ్యని కలకుర్తి హాస్పిటల్ కి తీసుకొని వెళ్ళినారు. అక్కడ ఉన్న వైద్యుల సూచన మేరకు హైదరాబాదులోని గాంధీ హాస్పిటల్ లో అడ్మిట్ చేసినారు. చికిత్స పొందుతూ తేదీ 15-12-2024 రోజు రాత్రి 08:30 గంటల సమయంలో చనిపోయాడు. మృతుని తమ్ముడు శ్రీకాంత్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేసినట్లు ఎస్సై తెలిపారు.

## రాంపూర్ శ్రీవెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలలో భజన పోటీలు



**(నేటి శుభోదయ):** ప్రతినిధి తలకొండపల్లి: రంగారెడ్డి జిల్లా తలకొండపల్లి మండలం రాంపూర్ గ్రామం శ్రీ వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా దేవాలయం కమిటీ సభ్యులు భజన కీర్తనల పోటీలు నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి చుట్టుపక్కల గ్రామాల భజన భక్తులు హాజరయ్యారు.నాయ నిర్నేతల మేరకు నిర్వహించిన భజన పోటీలలో మొదటి బహుమతి చంద్రధన గ్రామం సీతారామ భజన మండలి సొంతం చేసుకున్నారు. ద్వితీయ బహుమతి. కేశంపేట్ మండలం, లేమామిడి గ్రామం శ్రీ అమృత లింగేశ్వర భజన మండలి భజన భక్తులు సొంతం చేసుకోవడం జరిగింది.తృతీయ బహుమతి మిడ్జిల్ మండల ఈదమ్మ తల్లి భజన మండలి భక్త బృందం సభ్యులు సొంతం చేసుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు గ్రామ పెద్దలు,మహిళలు, యువకులు, తదితరులు పాల్గొన్నారు.

# 48వ డివిజన్ నివాసి

### షేక్ హుస్సేన్ మృతి పట్ల దిగ్భ్రాంతి

### నివాళులర్పించిన డివిజన్ ఎక్స్ కార్పొరేటర్ తోట రామారావు



కొదుమూరి జగన్నాదం ,ఖమ్మం **(నేటి శుభోదయ):** 48 డివిజన్ స్థిర నివాసి తెలుగుదేశం పార్టీ క్రియాశీల కార్యకర్త షేక్ హుస్సేన్ ఆకస్మిక మృతి పట్ల డివిజన్ ఎక్స్ కార్పొరేటర్ తోట రామారావు దిగ్భ్రాంతి వ్యక్తం చేసి మృతునికి నివాళులర్పించి ఆ కుటుంబ సభ్యులకు సానుభూతి తెలియజేస్తూ 10,000/-రూపాయల ఆర్థిక సహాయాన్ని అందించి శోకసముద్రంలో ఉన్న ఆ కుటుంబ సభ్యులకు అండగా ఈ డివిజన్ కార్పొరేటర్ గా మీకు అన్నివేళలా అందుబాటులో ఉంటానని మనోధైర్యాన్ని కలిగించడం జరిగింది. ఈ కార్యక్రమంలో డివిజన్ ఎక్స్ కౌన్సిల్ సభ్యులు వంగాల వెంకట్, సింగం అంజయ్య, కంకిపాటి శ్రీనివాసరావు డివిజన్ అధ్యక్షులు చేతి కృష్ణ మైనారిటీ నాయకులు షేక్ బాబా, డివిజన్ బాధ్యులు కిషన్ నాయక్, జహీర్, అబ్దుల్, ఆరిఫ్, గఫూర్, కృష్ణ ప్రసాద్, యూసఫ్, మహబూబ్ తదితర మిత్రులు పాల్గొనడం జరిగింది.

# తెలంగాణ అస్తిత్వాన్ని దెబ్బతీస్తున్న కాంగ్రెస్ సర్కార్...

- పేర్లు, రూపాలను మార్చడంపైనే సీఎం రేవంత్ దృష్టి
- రామగిరి గడ్డపైనే త్వరలో తెలంగాణ వీరవనిత విగ్రహం
- ఎమ్మెల్సీ కవితక్క చేతుల మీదుగా శంఖుస్థాపనకు ఏర్పాట్లు
- మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్
- పెద్దపల్లి జిల్లా మాజీ జడ్పీ చైర్మన్ పుట్ట మధుకర



మంథని / పెద్దపల్లి, రవీందర్, డిసెంబర్ -16 (నేటి శుభోదయ): నాలుగు కోట్ల తెలంగాణ ప్రజల ఆకాంక్షతో సాధించుకున్న తెలంగాణ అస్తిత్వాన్ని కాంగ్రెస్ సర్కార్ దెబ్బతీస్తోందని మంథని మాజీ ఎమ్మెల్యే, పెద్దపల్లి జిల్లా మాజీ జెడ్పి చైర్మన్, పుట్టమధూకర్ అన్నారు. సోమవారం పెద్దపల్లి జిల్లా రామగిరి మండలం సెంటనరీకాలనీలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ..... మలిదశ ఉద్యమాన్ని ముందుకు నడిపించిన గడ్డ రామగిరి గడ్డ అని, ఇక్కడి తెలంగాణ చౌక్ నుంచే సింగరేణి కార్మికులు ఉద్యమానికి శ్రీకారం చుట్టారని అన్నారు. ఎప్పుడు జేఏసీ పిలుపునిచ్చినా రామగిరి గడ్డ మీదనుంచే ఈ ప్రాంతానికి తెలంగాణ వాదాన్ని వినిపించారని ఆయన అన్నారు. అయితే తెలంగాణ రాష్ట్రంలో అదికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం, సీఎం రేవంత్‌రెడ్డి ప్రజా పాలనపై దృష్టి పెట్టకుండా పేర్లు,రూపాలను మార్చడంపైనే దృష్టి కేంద్రీకరిస్తున్నాడని ఆయన విమర్శించారు. ఈనాడు తెలంగాణ వీరవనిత తెలంగాణ తల్లి రూపు మార్చి తెలంగాణ ఆత్మగౌరవాన్ని దెబ్బతీస్తున్నారని అన్నారు. ఆనాడు తెలంగాణ ఉద్యమంలో రూపుదిద్దుతున్న తెలంగాణ తల్లి రూపాన్ని మార్చడం విడ్డూరంగా ఉందని, ఎవరైనా గొప్పగా తయారు చేయాలనే ఆలోచన చేస్తారే కానీ పాత పద్దతి అంటూ తల్లిని కూడా అలాగే చూపించడం సీఎం రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ సర్కార్‌కే సాధ్యమైందన్నారు. ఆనాడు మలిదశ ఉద్యమాన్ని ముందుకు నడిపించిన రామగిరి గడ్డపై తెలంగాణ వీర వనిత విగ్రహా ఆవిష్కరణకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని, మాజీ ఎంపీ, ఎమ్మెల్సీ కల్వకుంట కవిత చేతుల మీదుగా త్వరలో విగ్రహ ఆవిష్కరణకు శంఖుస్థాపన చేయనున్నట్లు ఆయన తెలిపారు.కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రానప్పుడు ఒక తీరు, అధికారంలోకి వచ్చిన తర్వాత ఒకతీరుగా వ్యవహరిస్తోందని, సింగరేణి కార్మికులనుసైతం వంచించి మోసం చేసిందన్నారు. సింగరేణి సంస్థను పూర్తిగా నిర్వీర్యం చేసి ముందుకు నడుస్తోందన్నారు. ఒకప్పుడు మంథని ప్రాంతంలో జై తెలంగాణ అనేందుకు భయపడే వాళ్లని, అలాంటి ప్రాంతంలోనే ఆనాడు ఉద్యమ సమయంలో రూపుదిద్దుకున్న తెలంగాణ వీరవనిత, తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఆవిష్కరించుకోవడం జరుగుతుందని, ఎమ్మెల్సీ కవితక్క చేతుల మీదుగా విగ్రహ ఏర్పాటుకు శంఖుస్థాపన కార్యక్రమానికి తెలంగాణవాదులు, సింగరేణి కార్మికులు, బీఆర్ఎస్ కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.ఈ సమావేశం లో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్



పూదరి సత్యనారాయణ గౌడ్,మండల బీ ఆర్ ఎస్ పార్టీ అధ్యక్షులు రవీందర్,తదితరులు పాల్గొన్నారు.

# సభ్యత్వ నమోదులో రికార్డ్ సృష్టించిన టీడీపీ

### 75 లక్షలకు చేరిన సభ్యులు...
### టీడీపీ వైపు చూస్తున్న యువత...
### టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి పాతర్ల రమేష్...



అమరావతి **(నేటి శుభోదయ):** డిసెంబర్ 16: సభ్యత్వ నమోదులో తెలుగుదేశం పార్టీ దూసుకుపోతూ, సరికొత్త రికార్డును సృష్టించిందని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి పాతర్ల రమేష్ ఆనందం వ్యక్తం చేశారు. అమరావతిలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా యువత ఎక్కువగా తెలుగుదేశం పార్టీవైపు చూస్తున్నట్లు ఆయన తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టాక తెలుగుదేశం పార్టీ చేపడుతున్న సంక్షేమ పథకాలు ప్రజల్లోకి దూసుకుపోతున్నాయని ఆయన తెలిపారు రోజురోజుకు పెరుగుతున్న పార్టీ కార్యకర్తలతో టీడీపీ ఆర్మీ తయారవుతుందన్నారు. పార్టీకి అతి ముఖ్యమైన బలం కార్యకర్తలేనని చెప్పారు వారి భవిష్యత్తు కోసం వారికి ఉపాధి అవకాశాలు మెరుగుపడటం కోసం తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర మంత్రి మంత్రి నారా లోకేష్ ఆధ్వర్యంలో పార్టీ అనేక కార్యక్రమాలు చేపడుతున్నట్లు ఆయన తెలిపారు. గత అక్టోబర్ 26 నుంచి తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం ప్రారంభమైనట్లు ఆయన తెలిపారు తెలిపారు. ఇప్పటికి 75 లక్షల మంది పార్టీ సభ్యత్వం తీసుకున్నట్లు ఆయన తెలిపారు. టీడీపీ అధినేత ముఖమంత్రి చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ నేతృత్వంలో సభ్యత్వ కార్యక్రమం దిగ్విజయంగా కొనసాగుతున్నట్లు తెలిపారు. ప్రతి నలుగురిలో ఒకరు తెలుగుదేశం సభ్యత్వం పొందే పరిస్థితి రావాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆకాంక్షని చెప్పారు. కష్టపడి పనిచేసిన వారికి తెలుగుదేశం పార్టీలో గుర్తింపు ఉంటుందన్నారు. పార్టీకి సేవచేసినవారికి ఎస్సీ ఎస్టీ బీసీలకు అత్యధిక ప్రాధాన్యత ఇచ్చి నామినేటెడ్ పోస్టులు భర్తీ చేసినట్లు రమేష్ తెలిపారు. అన్ని సామాజిక వర్గాలకు పార్టీ కోసం నిరంతరం పనిచేసిన వారందరికీ తెలుగుదేశం పార్టీ తగిన గుర్తింపు ఇస్తుందని ఆయన తెలిపారు

# ముత్తారం మండలంలో రెచ్చిపోతున్న బెల్టు మాఫియా

### గ్రామాలలో మద్యం ఏరులై పారుతున్న ఎక్సైజ్ పోలీసులు మాత్రం పట్టనట్టు వ్యవహరిస్తున్నారు

ముత్తారం మండల ప్రతినిది(**నేటి శుభోదయ**): డిసెంబర్-16: ముత్తారం మండలంలో రెచ్చిపోతున్న బెల్టు మాఫియా గ్రామాలలో మద్యం ఏరులై పారుతున్న ఎక్సైజ్ పోలీస్ మాత్రం పట్టి పట్టనట్టు వ్యవహరిస్తున్నారు. ఈ సందర్భంగా మాజీ ఎంపిటిసి మల్యాల రాజయ్య సిద్ధ శ్రీనివాస్ సోమవారం రోజు ముత్తారం కాసర్ల గడ్డ లోని ప్రెస్ క్లబ్ లో మాట్లాడుతూ మండల కేంద్రంలో ఉన్న రెండు వైన్ షాపులు నడిరోడ్డు మీద ఏర్పాటు చేయడంతో ప్రజల రాకపోకలకు ఇబ్బంది కలుగుతున్నాయని అదే కాకుండా వైన్ షాపులో ఓల్డ్ వాటర్ ప్యాకెట్లు గ్లాసులు అమ్ముతూ మద్యానికి బిల్లు చిట్టి ఇవ్వమని అడిగితే కొంటె కొనరా లేకపోతే లేదురా అని వైన్ షాపులో కౌంటర్ మీద ఉండే వారు కస్టమర్లతోని దురుసుగా ప్రవర్తిస్తూ దౌర్జన్యంగా కస్టమర్ల మీద గొడవకు దిగుతున్నారని, అసలు వైన్ షాపులో వాటర్ ప్యాకెట్లు గ్లాసులు అమ్మవచ్చునా అసలు వైన్ షాపు రోడ్డుకు ఎంత దూరంలో ఉండాలి పర్మిట్ రూములు ఉండంగా గ్రామంలో బేల్ట్ షాపులు ఎలా నడుపుతారని అన్నారు.ఎక్సైజ్ వారికి ఫోన్ చేస్తే షాపు వారికి చెప్పి వారికి సపోర్ట్ చేస్తున్నారు అదే కాకుండా గ్రామాలలో ఉన్న బెల్టు షాపులను విచ్చలవిడిగా నడుపుతూ ప్రతి గ్రామంలో గ్రామ ప్రజలకు గ్రామాలలో బెల్టు షాపులు బార్లలాగా నడిపిస్తూ దర్శనమిస్తున్నాయి ముత్తారం మండల కేంద్రంలోని రెండు వైన్ షాపుల నడిరోడ్డు మీదనే ఉండడంతో రహదారిపై ట్రాఫిక్ జామ్ అవుతున్న నడి రోడ్డు మీదనే టు వీలర్ బైక్స్ పెడుతున్న పట్టించుకునే వారే లేరు అసలు ప్రధాన రహదారికి వైన్ షాప్ ఎంత దూరంలో ఉండాలి అనే ఈ రూల్స్ మాత్రం పాటించకుండా వైన్ షాప్ యజమానులు మాత్రం సిండికేట్ గా ఏర్పడి రెండు షాపులను నిర్వహిస్తూనే మరోపక్క బెల్టుషాపులను భారీగా ప్రోత్సహిస్తున్నారు దాని ఫలితంగా ప్రతి గ్రామంలో బెల్ట్ షాపుల ద్వారా మందు ఏరులై పారుతుంది అలాగే ప్రభుత్వ నిబంధనలకు మద్యం పాలసీ అమ్మకాలు సాగిస్తున్నారు మద్యం షాపులో దొరకని మందు బెల్ట్ షాపుల్లో దొరుకుతుంది షాప్ నిర్వాహకులు బెల్టుకు సరఫరా చేస్తూ అన్ బ్రాండెడ్ లిక్కర్ విక్రయిస్తూ మద్యం దుకాణాలను ఇష్టారాజ్యంగా తెరుస్తున్నారని మందుబాబులు అంటున్నారు బెల్టుషాపుల నిర్వాహకుల నుంచి దుకాణాల రకాన్ని బట్టి అడ్వాన్సులు డిమాండ్ చేసినట్లు తెలుస్తోంది వీటన్నిటికీ ఎక్సైజ్ అధికారులు అనుమతులు ఇచ్చినట్టుగా ప్రవర్తిస్తున్నారు కనీసం చర్యలు తీసుకోకపోవడంతో వారికి నెలవారీగా మామూలు మూడు తున్నట్లు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి ముఖ్యంగా మద్యం దుకాణాల్లో జరిగే అక్రమాలు పూర్తిగా ఆ శాఖలో పనిచేస్తున్న అధికారుల కనుసన్నల్లోనే జరుగుతున్నట్లు ప్రజల్లో ప్రచారంగా కొనసాగుతుంది ఎక్సైజ్ అధికారులకు గ్రామాల్లో విచ్చలవిడిగా బెల్టు షాపులు అక్రమంగా నడుపుతున్నారనీ సమాచారం ఇచ్చినా కానీ పట్టించుకునే పరిస్థితి లేదు ఎందుకంటే ఎక్సైజ్ అధికారుల కనుసన్నల్లోనే మండలంలో రెండు మద్యం దుకాణాల నుండి జరిగే దందా మొత్తం అధికారుల కనుసన్నల్లో జరుగుతుందని మందుబాబులు అంటున్నారు




సాధారణంగా మద్యం షాప్ కు వచ్చే వారికి ఏ బ్రాండ్ అడిగినా ఇవ్వాలి ఇక్కడ మంచి మందు ఎక్కువ డబ్బులు తీసుకొని బెల్టు షాపులకు సరఫరా చేస్తూ వినియోగదారులకు మాత్రం ఉన్నది తీసుకోవాలంటూ షాపులో పనిచేసే వారి ద్వారా హుకుం జారీ చేస్తు వైన్ షాప్ కు వచ్చే ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నారు



ఎందుకంటే బెల్టు షాపులకు ఒక కోటరు పైన పది రూపాలు చొప్పున ఎక్కువగా అమ్ముతున్నారు కాబట్టి సదరు నిర్వాహకులు ఎప్పుడంటే అప్పుడు బ్రాండ్ మద్యం బెల్టు షాపులకు సరఫరా చేస్తున్నారు కాబట్టి 5000 వరకు అడ్వాన్స్ చెల్లించాలని లేదంటే ఎక్సైజ్ అధికారులు మీ దగ్గర ఉన్న మందు పట్టుకుంటే తమ బాధ్యత లేదని నిర్వాహకులకు చెబుతుండడంతో మాకెందుకులే ఈ గోస అని బెల్టు దుకాణాల నిర్వాహకులు షాప్ యజమానులకు అడిగినంత అడ్వాన్స్ చెల్లించేందుకు సిద్ధమవుతున్నారు మినీ బార్లను తలపిస్తున్న బెల్ట్ దుకాణాలు ముత్తారం మండల కేంద్రంలో రెండు దుకాణాల యజమానులు సిండికేట్ ఐ మండలంలో 100 పైగా బెల్టుషాపులను ప్రోత్సహిస్తున్నారని విమర్శలున్నాయి మద్యం దుకాణాల నిర్వాహకులకు సమయపాలన పాటించకపోవడం షాప్ లోకి వచ్చి కస్టమర్లకు మద్యాన్ని బ్లాక్ చేస్తూ బెల్టు షాపులకు మాత్రం సరఫరా చేస్తున్నట్లు తెలుస్తోంది.ఫలితంగా బెల్టుషాపుల నిర్వాహకులకు అడ్డూ అదుపు లేకుండా పోయింది ఇక్కడ మద్యం విక్రయాలకు ఓ సమయం అంటూ లేదు ఎప్పుడైనా మద్యం అమ్ముతారు ఇక్కడ బెల్ట్ షాపులు మినీ బార్లను తలపిస్తున్నాయి ఇక్కడ అన్ని సదుపాయాలు కల్పిస్తూ మందుబాబుల జేబులకు చిల్లులు పెడుతున్నారు.ఈ ఆటలో మందుబాబులను మత్తుగాళ్లను చేస్తూ ఆడుకుంటున్నారు అందుకే ప్రజలు చర్చించుకునే విషయం ఏమిటంటే ఎక్సైజ్ అధికారులు షాపు యజమానులకు సపోర్ట్ చేస్తున్నారు.ఓ పక్క గ్రామాలలో యువత మద్యం మత్తుకు బానిస కాకుండా ఉండాలని పోలీస్ శాఖ నుండి సీఐ ఎస్ఐల ద్వారా మత్తుకు యువత బానిస కాకుండా ఉండాలని యువతకు అవగాహన కల్పిస్తున్నారు కానీ గ్రామంలో వైన్ షాప్ యజమానులు మాత్రం బెల్టు షాపుల ద్వారా రాత్రి పగలు తేడా లేకుండా ఎప్పుడైనా మద్యం తాగండి తాగి ఊగండి తాగి ఇల్లు గొల్ల చేయండి అనే విధంగా బెల్టు షాపులు విపరీతంగా నడిపిస్తున్నారు దీనితో గ్రామాల్లో బెల్టులో యువత మద్యం ఎగబడి తాగుతున్నారు ఇప్పటికైనా దీన్ని కట్టడి చేయడానికి పై అధికారులు స్పందించి బెల్ట్ పై తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు ఈ కార్యక్రమంలో అనుము సమ్మయ్య మధురకవీ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. ఈ విషయంపై ఎక్సైజ్ సిఐని వివరణ కోరగా బెల్ట్ షాపుల విషయం మా దృష్టికి వచ్చిందని త్వరలోనే చర్యలు తీసుకుంటామని తెలిపారు.

## నేడు డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం....

### మాజీ ఎమ్మెల్యే పుట్ట మధుకర్




మంథని, చేరాల రవీందర్ డిసెంబర్ - 16 (నేటి శుభోదయ): లగచర్ల రైతులపై అక్రమంగా కేసులు పెట్టి, జైల్లో నిర్బంధించి థర్డ్ డిగ్రీ ప్రయోగించి, రైతన్నల చేతులకు బేడీలు వేసిన కాంగ్రెస్ ప్రభుత్వ నిరంకుశ అమానవీయ, అణిచివేత విధానాలకు నిరసనగా... రైతన్నలపై నమోదు చేసిన కేసులను ఎత్తివేసి, వారిని వెంటనే విడుదల చేయాలనీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ రాష్ట్రవ్యాప్తంగా బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటిఆర్ పిలుపు మేరకు నేడు (17.12.24) ఉదయం 10 గంటలకు మంథని పట్టణంలోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి మంథని మాజీ ఎమ్మెల్యే, పెద్దపల్లి మాజీ జెడ్పీ చైర్మన్ పుట్ట మధుకర్ వినతి పత్రం సమర్పిస్తారు.


## లగచర్ల రైతులపై అక్రమ కేసులను ఎత్తివేయాలి

### - మాజీ ఎమ్మెల్యే మెచ్చ



దమ్మపేట ప్రతి నిది **(నేటి శుభోదయ):** లగచర్ల రైతులపై పెట్టిన అక్రమ కేసులు వెంటనే ఎత్తి వేయాలని మాజీ ఎమ్మెల్యే మెచ్చ నాగేశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. భారత రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు అశ్వరావుపేట లో అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రాలు ఇచ్చే కార్యక్రమంలో పాల్గొవాలని భారత రాష్ట్ర సమితి నాయకులకు,పార్టీ శ్రేణులకు విజ్ఞప్తిచేశారు. లగచర్ల రైతులపై అక్రమంగా కేసులు పెట్టి,వారిపైన థర్డ్ డిగ్రీ ప్రయోగించి జైళ్లలో నిర్బంధించి,రైతన్నల చేతులకు బేడీలు వేసిన కాంగ్రెస్ ప్రభుత్వ నిరంకుశ, అమానవీయ, అణిచివేత విధానాలకు నిరసనగా. రైతన్నలపై నమోదు చేసిన అక్రమ కేసులను ఎత్తివేసి, వారిని వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ మంగళవారం నాడు మెచ్చా నాగేశ్వరరావు ఆధ్వర్యంలో అశ్వారావుపేట పట్టణం లోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రాన్ని సమర్పించడం జరుగుతుంద ని పిలుపునిచ్చారు. బి ఆర్ ఎస్ పార్టీ శ్రేణులను పార్టీ కార్యకర్తలు, మాజీ ప్రజా ప్రతినిధులు పార్టీ అభిమానులు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు.

## 8 గంటలు పగలు.. 16 గంటల పాటు రాత్రి!




విశాఖపట్నం జిల్లా**(నేటి శుభోదయ):** డిసెంబర్ నెలలో అరుదైన ఘటన జరగబోతుంది. ఈ నెల 21న సుదీర్ఘమైన రాత్రి ఉండనుంది. దాదాపు 16 గంటల పాటు రాత్రి సమయం మిగిలిన 8 గంటల పాటు పగలు ఉండనుంది. సాధారణంగా ఇలా జరగడాన్ని అయనాంతం అని పిలుస్తారు. అయితే అయనాంతం ఏర్పడిన రోజున భూమి ఉత్తరార్ధగోళం సూర్యునికి ఎక్కువ దూరం వెలుతుంది. ఆ సమయంలో చంద్రకాంతి భూమిపై చాలా సమయం ఉంటుంది. ఇది శీతాకాలంలో ఏర్పడుతున్నందున దీనిని 'శీతాకాలపు అయనాంతం' అని అంటారు.

## జిల్లాలో హత్యా రాజకీయాలకు తావు లేదు

### మంత్రి అచ్చెన్నాయుడు



విశాఖపట్నం జిల్లా**(నేటి శుభోదయ):** శ్రీకాకుళం జిల్లా పలాసలో టీడీపీ నేత హత్య కుట్రపై మంత్రి అచ్చెన్నాయుడు ఆగ్రహం వ్యక్తం చేశారు. కలెక్టర్, ఎస్పీతో ఫోన్లో మాట్లాడి పరిస్థితిని తెలుసుకున్నారు. వైసీపీ నేతలు ఐదేళ్లపాటు హత్యా రాజకీయాలు ప్రోత్సహించారని, అధికారం కోల్పోయిననా అదే పద్ధతి కొనసాగిస్తున్నారని ఆయన మండిపడ్డారు. ఈ హత్య కుట్ర వెనక ఎంతటి వారున్నా వారి పై చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. శ్రీకాకుళం జిల్లాలో హత్యా రాజకీయాలకు ఎప్పటికీ తావు లేదని మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు హెచ్చరిక జారీ చేశారు.

## తల్లిదండ్రులు లేని పిల్లలకు పెన్షన్ ఇవ్వడం అనేది గొప్ప విషయం


### తెలుగు రాష్ట్రాల రజక విద్యాసేవా సంక్షేమ సంఘ అధ్యక్షులు దేవలూటి శంకర్

### రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబుకు ధన్యవాదములు తెలిపిన శంకర్




విశాఖపట్నం జిల్లా **(నేటి శుభోదయ):** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో తల్లిదండ్రులు చనిపోయిన చిన్నారులకు పింఛన్లు ఇవ్వాలని నిర్ణయించడం హర్షించదగ్గ విషయమని రజక విద్యా సేవా సంక్షేమ సంఘం ఆంధ్రప్రదేశ్ - తెలంగాణ రాష్ట్రాల అధ్యక్షులు దేవలూటి శంకర్ ఒక ప్రకటనలో తెలిపారు.ప్రభుత్వం ఇచ్చే పింఛన్లు వారి పై చదువులకు ఉపయోగ పడతాయని ఆయన చెప్పారు. భవిష్యత్తులో విద్యార్థులు మంచిగా రాణించడానికి తోడ్పాటును అందిస్తాయని శంకర్ చెప్పారు. కుల మతాలకు అతీతంగా ఇస్తున్న ఈ పింఛన్లు వారి ఉన్నతికి సహకరిస్తాయని ఆయన చెప్పారు.

## పిఠాపురానికి 100 పడకల ఆసుపత్రి




విశాఖపట్నం జిల్లా **(నేటి శుభోదయ):** ఏపీలో డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ తన నియోజకవర్గం పిఠాపురానికి 100 పడకల ఆసుపత్రిని మంజూరు చేయించారు. 30 బెడ్ల కమ్యూనిటీ హెల్త్ సెంటర్ ను 100 బెడ్ల ఆస్పత్రికి అప్ గ్రేడ్ చేస్తున్నట్లు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దీనికోసం రూ.38కోట్లు వెచ్చించనుంది. ఇక్కడ అవసరమైన 66 పోస్టుల్ని త్వరలోనే సర్కారు భర్తీ చేస్తుందని, వారి జీతాలకు రూ.4.32 కోట్లు వెచ్చిస్తుందని జనసేన ఎక్స్‌లో తెలిపింది.

## యూపీఐ లో డబ్బులు పంపిస్తే ఛార్జీలు లేవు - కేంద్రం స్పష్టత




విశాఖపట్నం జిల్లా **(నేటి శుభోదయ):** యూపీఐ ట్రాన్సాక్షన్లపై ఛార్జీలు విధిస్తారనే ప్రచారాన్ని కేంద్రం ఖండించింది. రూ.2,000కు పైగా ట్రాన్సాక్షన్ చేస్తే 1.1% ఛార్జీలు కట్టాల్సి ఉంటుందని పలు టీవీ ఛానళ్లు, సైట్లు ప్రచారం చేస్తున్నాయని, ఇది పూర్తిగా అవాస్తవమని పి ఐ బి ఫ్యాక్ట్చెక్ స్పష్టం చేసింది. సాధారణ యూ పీఐ ట్రాన్సాక్షన్లపై ఎలాంటి ఛార్జీలు లేవని తెలిపింది. డిజిటల్ వ్యాలెట్లైన ప్రీపెయిడ్ పేమెంట్ ఇన్స్ట్రుమెంట్ల ( పి పి ఐ ) పైనే ఛార్జీలు ఉంటాయంది.

## సజ్జల భార్గవ్ కు ఊరట



విశాఖపట్నం జిల్లా**(నేటి శుభోదయ):** ఏపీలో వైసీపీ నేత సజ్జల భార్గవ్ రెడ్డికి హైకోర్టులో ఊరట లభించింది. ఆయన పై నమోదైన 13 కేసుల్లో 9 కేసులకు ఎలాంటి ముందస్తు చర్యలు తీసుకోవద్దని పోలీసులను కోర్టు ఆదేశించింది. తనపై నమోదైన కేసులను క్వాష్ చేయాలంటూ ఆయన దాఖలు చేసిన పిటిషన్ పై న్యాయస్థానం ఈ మేరకు తీర్పు ఇచ్చింది.రెండు వారాల పాటు రక్షణ కల్పిస్తూ ఆదేశాలు జారీ చేసిన కోర్టు ఈ కేసుల పై అఫిడవిట్ దాఖలు చేయాలని పోలీసులను ఆదేశించింది.

# సాగునీటి ఎన్నికల్లో కూటమి వైపు రైతులు....

### ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ ను రద్దు చేశాం.....

### పోలవరంలో ఒక యజ్ఞం లా చంద్రన్న పూర్తి చేస్తారు......

### అమరావతిలో అభివృద్ధి పనులు పరుగులు తీస్తున్నాయి....

### రైతులకు అండగా కూటమి ప్రభుత్వం.....

### టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి పాతర్ల రమేష్.......



అమరావతి**(నేటి శుభోదయ):** డిసెంబర్ 16: రాష్ట్రంలో సాగునీటి వ్యవస్థను జగన్ సర్వనాశనం చేశారని సాగునీటి ఎన్నికల్లో రైతులు ఏకపక్షంగా కూటమి వైపు నిలిచి కూటమి అభ్యర్థులను గెలిపించారని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి పాతర్ల రమేష్ అన్నారు అమరావతి లో అయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో వైసీపీని ప్రజలు ఛీకొట్టడంతో సాగునీటి ఎన్నికల్లో వైసిపి పోటీ నుంచి తప్పుకున్నారని ఆయన తెలిపారు జగన్ ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేశారని ల్యాండ్ టైటిలింగ్ యాక్టును పెడితే తమ కూటమి ప్రభుత్వం రద్దు చేసి రైతులకు భూములకు తమ ప్రభుత్వం రక్షణ కల్పించిందని అందుకే రైతులంతా కూటమి వైపు నిలబడి సహకార ఎన్నికల్లో తమ అభ్యర్థులను గెలిపించారని ఆయన తెలిపారు గత ఇదేళ్లలో జగన్ అరాచక పాలనలో వైసీపీ నేతలు ప్రజల ఆస్తులను భూములను లాక్కున్నారని ఆయన విమర్శించారు ఆంధ్రప్రదేశ్ కు రాష్ట్రానికి జీవనాడి అయిన పోలవరం ప్రాజెక్టును చంద్రబాబు 72 శాతం పూర్తి చేస్తే జగన్ ఒక్క శాతం కూడా పూర్తి చేయలేదని పోలవరం ప్రాజెక్టును మూలన పడేసాడని ఆయన విమర్శించారు చంద్రబాబు హయాంలో ప్రతి సోమవారం పోలవరం అనే కార్యక్రమాన్ని పెట్టుకొని ఒక యజ్ఞములా పోలవరం ప్రాజెక్టును చంద్రబాబు పూర్తి చేయాలని చూస్తే జగన్ సర్వనాశనం చేశాడని గత ఆరు నెలలుగా పోలవరం ప్రాజెక్టు పనులు ప్రారంభం అయ్యాయని ఒక యజ్ఞములా పోలవరం ప్రాజెక్టును చంద్రబాబు పూర్తి చేస్తానని ఆయన తెలిపారు గత ఆరు నెలలుగా అమరావతి లో రాజధాని పనులు పరుగులు తీస్తున్నాయని రాజధానిలో 11 వేల 475 కోట్లతో పనులు చేపట్టేందుకు రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలిపిందని ఆయన తెలిపారు రాష్ట్రంలో గత ఆరు నెలలుగా జరుగుతున్న అభివృద్ధిని చూసి జగన్ ఓర్వలేక తమ ప్రభుత్వంపై విమర్శలు చేస్తున్నారని ఆయన తెలిపారు గత ఐదు ఐదేళ్ల లో మహిళలపై ఎక్కువగా లైంగిక దాడులు జరిగాయని ఆయన విమర్శించారు అసత్య పోస్టులు పెట్టారని ప్రతిపక్ష నేతలను అరెస్టు చేయలేదా? జగన్ అని ఆయన ప్రశ్నించారు అమరావతిలో చంద్రబాబు సచివాలయాన్ని నిర్మించారని జగన్ దాన్ని తాకట్టు పెట్టారని ప్రజల ఆస్తులను తాకట్టు పెట్టే అధికారం జగన్ కు ఎవరు ఇచ్చారని ఆయన ప్రశ్నించారు కూటమి ప్రభుత్వంపై వైసీపీ పేటీఎం బ్యాచ్ అసత్య పోస్టులు పెట్టి ప్రచారం చేయడానికి ఆయన తీవ్రంగా ఖండించారు ఆంధ్రప్రదేశ్లో రోడ్లపై పైసలు వసూలు చేస్తున్నారంటూ వైసీపీ నేతలు కొందరు విష ప్రచారం చేయడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు రాష్ట్రంలో వైసీపీని ప్రజలు ఛీ కొట్టి 11 సీట్లకు పరిమితం చేసిన జగన్ ఇంకా సిగ్గు రాలేదని ఆయన విమర్శించారు చంద్రబాబు సంపదను సృష్టించి రాష్ట్రాన్ని అభివృద్ధి చేయగలిగిన ఏకైక నాయకుడు "చంద్రన్న " అని ఆయన కొనియాడారు చంద్రబాబు లోకేష్ లను అనవసరంగా వైసీపీ నేతలు విమర్శిస్తూ చూస్తూ ఊరుకోమన్నారు

## కొత్తూరు ఎస్సై అమీర్ అలీ ఆధ్వర్యంలో అక్రమ మద్యం సీజ్

### నివగాం గ్రామంలో బెల్ట్ షాపుల పై దాడులు

### ఈ దాడుల్లో 17 మద్యం సీసాలు సీజ్



విశాఖపట్నం జిల్లా **(నేటి శుభోదయ):** శ్రీకాకుళం జిల్లా కొత్తూరు మండలం :నివగాం గ్రామం : కొత్తూరు ఎస్సై ఎండి అమీర్ అలీ సోమవారం బెల్ట్ షాపుల పై దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో భాగంగా 17 మద్యం సీసాలను పట్టుకొని సీజ్ చేశారు. కొత్తూరు మండలం నివగాం గ్రామంలో నల్లాన హరిశ్చంద్ర రావు వద్ద 17 మద్యం సీసాలును ఎస్సై అమీర్ అలీ సిబ్బందితో కలిసి వెళ్లి పట్టుకొని అదుపులోకి తీసుకున్నారు. సదరు వ్యక్తి ఇంతకుముందు కూడా ఇటువంటి కేసులో ముద్దాయిగా ఉన్నందున ఆయనను రిమాండ్ కి పంపినట్లుగా కొత్తూరు ఎస్సై అమీర్ అలీ తెలిపారు.

## నేడు భూమి సమీపం నుంచి గ్రహశకలాలు



విశాఖపట్నం జిల్లా ( నేటి శుభోదయ ): రెండు భారీ గ్రహశకలాలు భూమికి సమీపం నుంచి ఇవాళ ప్రయాణించ నున్నాయి. ఒకదాని పేరు '2024 ఎక్స్‌వై 5 ' కాగా, రెండవది '2024 క్స‌బీ 6' అని అమెరికా అంతరిక్ష పరిశోధనా సంస్థ నాసా నిర్ధారించింది. ఈ రెండు డిసెంబర్ 16న భూమి వైపు దూసుకురానున్నాయని తెలిపింది. అయితే, భూమికి ఎలాంటి ముప్పులేదని నాసా శాస్త్రవేత్తలు వెల్లడించారు. గ్రహశకలాల ట్రాకింగ్, అప్రమత్తత విషయంలో అవగాహన పొందవచ్చని వివరించారు.

## ఏపీలో రేపటి నుంచి అంగన్వాడీల్లో ఆధార్ క్యాంపులు



విశాఖపట్నం జిల్లా ( నేటి శుభోదయ ): ఏపీలో రాష్ట్ర వ్యాప్తంగా అంగన్వాడీ కేంద్రాల్లో ప్రత్యేక క్యాంపుల్ని నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. గ్రామ, వార్డు సచివాలయ సిబ్బందితో డిసెంబర్ 3, 4వారాల్లో ఇందుకోసం స్పెషల్ క్యాంపులు నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. మంగళవారం నుంచి 20వ తేదీ వరకు నాలుగు రోజుల పాటు ప్రత్యేక క్యాంపుల్ని నిర్వహించనున్నారు. డిసెంబర్ 26 నుంచి 28 వరకు మరోసారి అంగన్వాడీ కేంద్రాల్లో ఆధార్ నమోదు కార్యక్రమాలను నిర్వహిస్తారు.

## తీవ్ర విషాదం ..

### ప్రముఖ సంగీత విద్వాంసుడు మృతి .....



విశాఖపట్నం జిల్లా ( నేటి శుభోదయ ): ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన తబలా విద్వాంసుడు జాకీర్ హుస్సేన్ (73) కన్నుమూశారు. గుండె సంబంధిత సమస్యతో అమెరికాలోని ఓ ఆస్పత్రిలో చేరిన ఆయన చికిత్స పొందుతూ తుది శ్వాస విడిచారు. ఆయన మృతితో భారతీయ చలన చిత్ర రంగం, ప్రపంచ సంగీత అభిమానులు తీవ్ర శోక సంద్రంలో మునిగిపోయారు. ముంబైలో పుట్టిన జాకీర్ హుస్సేన్ పద్మశ్రీ, పద్మభూషణ్ సహా పలు అవార్డులు అందుకున్నారు.

## ఢిల్లీ, ఎన్‌సిఆర్‌లో తిరిగి గ్రాప్ -3 నిబంధనలు



న్యూఢిల్లీ : వాయు కాలుష్య తీవ్రత అధికం కావడంతో ఢిల్లీ, ఎన్‌సిఆర్ పరిధిలో గ్రాప్ (జిఆర్‌ఎపి)-3 దశ నిబంధనలను తిరిగి అమలు చేయనున్నట్లు కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి సోమవారం ప్రకటించింది. ఢిల్లీలో సోమవారం ఉదయం వాయు నాణ్యతా ప్రమాణ (ఎక్యూఐ) సూచీ 351 (చాలా పేలవమైన ) కేటగిరీకి పడిపోయిన సంగతి తెలిసిందే. ఉదయం 9.00 గంటలకు ఉష్ణోగ్రత 4.5 డిగ్రీలుగా నమోదైంది. సాధారణ ఉష్ణోగ్రతల కంటే నాలుగు డిగ్రీలు తక్కువగా నమోదైనట్లు వాతావరణ శాఖ తెలిపింది. కనిష్ఠ ఉష్ణోగ్రతలు, పేలవమైన వాయు నాణ్యతలతో ఢిల్లీలో ఇప్పటికే సవాలుగా నిలిచిన కాలుష్య స్థాయిలను మరింత దిగజార్చినట్లు నిపుణులు హెచ్చరిస్తున్నారు. దీంతో వాయు కాలుష్యాన్ని అరికట్టడానికి కేంద్రం గ్రాప్ 3 కింద కఠినమైన ఆంక్షలు అమలులోకి రానున్నాయి. అత్యవసరం కాని నిర్మాణాలపై నిషేధం, కూల్చివేత కార్యకలాపాలపై పూర్తి నిషేధం విధించింది. కఠిన వాహన నిబంధనలు అమలుకానున్నాయి.

## నిర్భయ కేసు వార్షికోత్సవం

## మహిళల భద్రతపై కేంద్రానికి సుప్రీం నోటీసులు



న్యూఢిల్లీ : నిర్భయ 12వ వార్షికోతవ్సం సందర్భంగా మహిళలు, పిల్లలు, లింగమార్పిడి వ్యక్తులకు సురక్షితమైన వాతావరణాన్ని అందించడానికి పాన్ ఇండియా మార్గదర్శకాలను రూపొందించడానికి దిశానిర్దేశం చేయాలని కోరుతూ దాఖలైన పిల్‌పై కేంద్రం, వివిధ మంత్రిత్వశాఖలకు సుప్రీంకోర్టు నోటీసు జారీ చేసింది. సుప్రీంకోర్టు మహిళా న్యాయవాదుల సంఘం దాఖలు చేసిన పిల్‌ను పరిశీలించేందుకు కోర్టు అంగీకరించింది. జస్టిస్ సూర్యకాంత్, ఉజ్జల్, భుయాన్‌లతో కూడిన ధర్మాసనం తదుపరి విచారణను జనవరికి వాయిదా వేసింది. ఈ నేపథ్యంలో అటార్నీ జనరల్ కార్యాలయం ద్వారా సంబంధిత మంత్రిత్వశాఖలకు, ఆర్గనైజేషన్‌లకు నోటీసులు జారీ చేయాలని ఆదేశించింది. కాగా, పిటిషనర్ తరపున సీనియర్ న్యాయవాది మహాలక్ష్మీ పావని మాట్లాడుతూ.. 'చిన్న చిన్న నగరాల్లో మహిళలపై లైంగిక వేధింపులకు సంబంధించిన అనేక సంఘటనలు చోటుచేసుకున్నాయని, వాటిని నివేదించలేదు. ఇటీవల కలంలో కలకత్తాలోని ఆర్‌జికర్ మెడికల్ కాలేజ్ అండ్ హాస్పిటల్‌లో ట్రైనీ విద్యార్థినీ హత్యాచారానికి గురైంది. ఈ ఘటన తర్వాత దాదాపు 95 లైంగిక హింస సంఘటనలు జరిగాయి. కానీ అవేవీ హైలెట్ కాలేదు. నేరస్తులకు స్కాండినేవియన్ (ఉత్తర ఐరోపా) దేశాల్లో చేసిన విధంగా కెమికల్ క్యాస్ట్రేషన్ (సెక్స్ హార్మోన్ ఉత్పత్తి ఆపడానికి రసాయనాలు లేదా మందులు వాడకం) వంటి శిక్షలు విధించాలి' అని ఆమె డిమాండ్ చేశారు. రోజూ ఏదో ఒక విధంగా సామాన్య మహిళ ఎదుర్కొనే వేధింపులకు ఉపశమనం కలిగించేలా ప్రయత్నిస్తున్నందుకు జస్టిస్ సూర్యకాంత్ పావనిని అభినందించారు. ఈ సందర్భంగా పిటిషన్‌లో పేర్కొన్న 'అనాగరికం', 'కఠినం' అన్న పదాలని, లేవనెత్తిన అంశాలు వినూత్నంగా ఉన్నాయని, వాటిని పరిశీలించాల్సిన అవసరం ఉందని జస్టిస్ కాంత్ అన్నారు. పబ్లిక్, ట్రాన్స్‌పోర్ట్‌లో మహిళల పట్ల ఎలా ప్రవర్తించాలనేదానిపై అవగాహన కలిగించాల్సిన అవసరం ఉందని బెంచ్ అభిప్రాయపడింది. బస్సుల్లో, మెట్రో, రైళ్లలో చేయదగిన పనులు, చేయకూడని వాటికి సంబంధించి విస్తృతంగా ప్రచారం చేయాలని బెంచ్ అభిప్రాయపడింది. 2012లో ఢిల్లీలో డిసెంబర్ 16వ తేదీన 23 ఏళ్ల ఫిజియోథెరపిస్టుపై బస్సులో సామూహిక అత్యాచారం జరిగిందని, ఇది దేశవ్యాప్తంగా సంచలనమైందని పావని బెంచ్‌కి తెలిపారు. చాలా కేసుల్లో పలు మార్గదర్శకాలు జారీ చేసినప్పటికీ అవి అమలవుతున్నాయా? అని ఆమె ప్రశ్నించారు. చట్టాల అమలులో ఎక్కడ లోపం జరుగుతుందో పరిశీలించాల్సిన అవసరం ఉందని సూర్యకాంత్, జ్జల్ భుయాన్‌లతో కూడిన బెంచ్ పేర్కొంది.

## అమిత్‌షా వాషింగ్‌మిషన్‌లోకెళ్లి బయటికొచ్చిన వారంతా పరిశుద్ధులే : ఖర్గే



న్యూఢిల్లీ : రాజ్యాంగం అమల్లోకి వచ్చి 75 ఏళ్లు పూర్తయిన సందర్భంగా నేడు, రేపు రాజ్యసభలో చర్చ జరగనుంది. ఈ సందర్భంగా కాంగ్రెస్ సీనియర్ నేత మల్లికార్జున ఖర్గే సోమవారం సభలో ప్రసంగిస్తూ కేంద్ర హోంమంత్రి అమిత్‌షాపై వ్యంగ్యాస్త్రాలు సంధించారు. 'అమిత్ షా పెద్ద వాషింగ్ మిషన్ కొన్నాడు. ఆ మెషిన్‌లోకి ఎవరెళ్లినా.. వారు పరిశుద్ధులై బయటకొస్తారు' అని ఎద్దేవా చేశారు. ప్రతిపక్షపార్టీ నేతలపై ఈడి దాడులతో కేంద్రం అవినీతిపరులుగా ముద్ర వేస్తోంది. ఆ సమయంలో వారు బిజెపిలోకి చేరుతున్నారు. వీరలా బిజెపిలోకి చేరగానే.. అవినీతిపరులు కాస్తా.. నీతిపరులైపోతున్నారన్న అర్థం వచ్చేలా సభలో ఖర్గే ఈ వ్యాఖ్యలు చేశారు. 'ఏదైనా రాష్ట్రం లేదా ప్రాంతంలో మీకు వ్యతిరేకంగా ఓటు వేస్తే వ్యతిరేకంగా మీరు ప్రతీకారం తీర్చుకోకూడదు' అని ఖర్గే హితవు పలికారు. కాగా, ఎగువ సభలో మణిపూర్ సంక్షోభం అంశాన్ని ఖర్గే లేవనెత్తారు. ప్రధాని మోడీ ఎన్నికలు ఎక్కడుంటే అక్కడికి వెళ్తారు. కానీ ఆయన ఇంతవరకు మణిపూర్ వెళ్లలేదు. అక్కడికెళ్లేందుకు ఆయన ఇష్టపడడం లేదు అని ఖర్గే విమర్శించారు. అదే సమయంలో రాహుల్ మణిపూర్‌కి వెళ్లారని, అక్కడి యాత్ర చేపట్టారని ఖర్గే గుర్తు చేశారు. 'మీకు చాలా భద్రత ఉంది. అయినా మణిపూర్‌కి మీరెందుకు వెళ్లడం లేదు? మీరు ఈ సమస్యను ఎందుకు పరిష్కరించడం లేదు' అని ఖర్గే ప్రధానిని నిలదీశారు.

## కేటీఆర్ అరెస్టు పై ఏమి చెప్పలేను : మంత్రి పొంగులేటి



ఫార్ములా ఈ-రేసు వ్యవహారంలో మాజీ మంత్రి కేటీఆర్ పై విచారణకు గవర్నర్ అనుమతి ఇచ్చారని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. తాజాగా ఆయన మీడియాతో మాట్లాడారు. గవర్నర్ అనుమతి పై కేబినెట్ లో చర్చ జరిగింది. ఈ-కారు రేసు వ్యవహారంలో చట్ట ప్రకారమే దర్యాప్తు కొనసాగుతుందని తెలిపారు. కేటీఆర్ ను విచారణ చేపట్టేందుకు అనుమతి లభించిందని.. గవర్నర్ అనుమతి ఇస్తూ జారీ చేసిన దస్త్రాన్ని ఇవాళ రాత్రి లేదా మంగళవారం సీఎస్ శాంతి కుమారి ఏసీబీకి పంపిస్తారని చెప్పారు మంత్రి పొంగులేటి. ఈ ఫార్ములా రేస్ పై జరిగిన దోపిడీ పై కేబినెట్ చర్చించినట్టు వెల్లడించారు. కేటీఆర్ అరెస్ట్ పై తాను చెప్పలేను. చట్టం తన పని తాను చేస్తుందని.. బాంబు తుస్సుమందని ఇటీవలే బీఆర్ఎస్ నేతలు వ్యాఖ్యానించారు. అది తుస్సుమనేదైతే.. ఢిల్లీ చుట్టూ ప్రదక్షిణ ఎందుకు చేశారని ప్రశ్నించారు. అసెంబ్లీలో ఎమ్మెల్యేల్లా కాకుండా గూండాల్లా ప్రవర్తించారు. మాట్లాడటానికి అంశం లేనందుకే ప్లకార్డులు, నినాదాలతో సభకు ఇవాళ ఆటంకం కలిగించినట్టు తెలిపారు. ఇందిరమ్మ ప్రభుత్వం కక్ష సాధింపు ఉండదని తెలిపారు మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి.

## ఏపీకి గేమ్ ఛేంజర్ పోలవరం




పోలవరం : పోలవరం ప్రాజెక్టు ఏపీకి జీవనాడి అని,పోలవరం పూర్తి చేసి నదుల అనుసంధానం చేస్తే రాష్ట్రానికి గేమ్ ఛేంజర్‌లా తయారవుతుందని సీఎం చంద్రబాబు అన్నారు. సోమవారం పోలవరం ప్రాజెక్టును ముఖ్యమంత్రి పరిశీలించారు. నిర్మాణ పనులను పరిశీలించి అధికారులతో సమీక్ష నిర్వహించారు. అనంతరం సీఎం చంద్రబాబు మీడియాతో మాట్లాడుతూ పోలవరం ఏపీకి జీవనాడి అని అన్నారు. పోలవరం, అమరావతి రెండు కళ్లు అని చెప్పారు. ఈ ప్రాజెక్టు కారణంగా 7.20 లక్షల ఎకరాలకు కొత్త ఆయకట్టు అందుబాటులోకి వస్తుందని తెలిపారు. 28 లక్షల మందికి తాగునీరు, 960 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తికి అవకాశం ఉంటుందన్నారు. విశాఖ పారిశ్రామిక అవసరాలు, తాగునీటికి 23 టీఎంసీలు అందుబాటులోకి వస్తాయన్నారు. పోలవరం పూర్తి చేసి నదుల అనుసంధానం చేస్తే రాష్ట్రానికి గేమ్ ఛేంజర్‌లా తయారవుతుందని సీఎం చంద్రబాబు తెలిపారు. 28 సార్లు క్షేత్ర స్థాయికి వచ్చాననీ, 82 సార్లు వర్చువల్ గా సమీక్ష చేశానని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో 2019లో బలవంతంగా నోటీసులు ఇచ్చి సైట్ లోనుంచి వెళ్లిపోవాలని ఆదేశాలిచ్చారని గుర్తు చేశారు. పోలవరం ప్రాజెక్టులో 50 లక్షల క్యూసెక్కుల నీటికి నిర్మాణం చేస్తున్నామని, నదిని డైవర్ట్ చేస్తున్నామని తెలిపారు. డయా ఫ్రం వాల్ కట్టి వదిలిపెట్టామని తెలిపారు. తమ హయాంలో 70 శాతం పనులు పూర్తయ్యాయన్నారు. పోలవరం ప్రాజెక్ట్ పూర్తయితే నీటి సమస్య ఉండదని తెలిపారు. ఆగస్టు-అక్టోబర్ 2020లో వరదల వల్ల డయా ఫ్రం వాల్ పూర్తిగా దెబ్బతిందనీ, అప్పటి నుంచి ఇప్పటి వరకు ఈ ప్రాజెక్ట్ ని పూర్తిగా నిర్వీర్యం చేశారని సీఎం చంద్రబాబు ఆరోపించారు.

## సాంస్కృతిక ఐక్యతకు చిహ్నం : ప్రధాని మోడీ



న్యూఢిల్లీ : జాకీర్ హుస్సేన్ నిజమైన మేధావి, సాంస్కృతిక ఐక్యతకు చిహ్నమని ప్రధాని నరేంద్ర మోడీ పేర్కొన్నారు. ప్రముఖ తబలా విద్వాంసుడు జాకీర్ హుస్సేన్ మృతికి ఆయన సంతాపం ప్రకటించారు. జాకీర్ హుస్సేన్ మృతి తీరనిలోటని, భారతీయ శాస్త్రీయ సంగీత ప్రపంచంలో విప్లవాత్మకమైన మార్పులు తీసుకువచ్చిన నిజమైన మేధావి అని ప్రధాని కొనియాడారు. తన అసమానమైన రిథమ్‌తో లక్షలాది మందిని సంగీత ప్రియులను ఆకర్షించడమే కాకుండా తబలాను ప్రపంచ వేదికపైకి తీసుకువచ్చారని అన్నారు. భారతీయ శాస్త్రీయ సంప్రదాయాలను ప్రపంచ సంగీతంతో మిళితం చేసి సాంస్కృతిక ఐక్యతకు చిహ్నంగా నిలిచారని అన్నారు. ఆయన ప్రదర్శనలు సంగీత విద్వాంసులతో పాటు ఎంతోమంది సంగీత ప్రియుల్లో కూడా స్ఫూర్తి నింపాయన్నారు. జాకీర్ హుస్సేన్ కుటుంబ సభ్యులతో పాటు ప్రపంచవ్యాప్తంగా ఉన్న అభిమానులకు సానుభూతి ప్రకటిస్తున్నట్లు ఎక్స్‌లో పేర్కొన్నారు.ప్రముఖ తబలా విద్వాంసుడు జాకీర్ హుస్సేన్ శాన్‌ఫ్రాన్సిస్కోలోని ఆస్పత్రిలో ఆదివారం రాత్రి మరణించిన సంగతి తెలిసిందే. ఊపిరితిత్తుల సమస్య (ఐపిఎఫ్)తో ఐసియులో చికిత్స పొందుతూ మరణించినట్లు కుటుంబసభ్యులు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు.

## ఇజ్రాయిల్ సైన్యం దాడులు
## గడచిన 24 గంటల్లో 69 మంది మృతి



గాజా : గాజాపై ఇజ్రాయిల్ సైన్యం ఏడాదికిపైగాదాడులు కొనసాగిస్తోంది. ఈ దాడుల వల్ల వేలాది మంది పాలస్తీనియన్లు మృతి చెందిన సంగతి తెలిసిందే. తాజాగా గాజాపై ఇజ్రాయిల్ సైన్యం జరిపిన దాడుల వల్ల కనీసం 69 మంది మృతి చెంది ఉంటారని వైద్య వర్గాలు పేర్కొన్నాయి. గాజా స్ట్రిప్‌లో పాఠశాలల్లో తలదాచుకుంటున్న పాలస్తీనియన్లను లక్ష్యంగా చేసుకుని ఇజ్రాయిల్ సైన్యం నాలుగుసార్లు దాడులకు పాల్పడినట్లు వైద్యులు తెలిపారు. అయితే తాజాగా ఇజ్రాయిల్ సైన్యం చేసిన ఈ క్రూరమైన దాడుల్ని ఇరాన్ విదేశీ మంత్రిత్వశాఖ తీవ్రంగా ఖండించింది. ఐక్యరాజ్యసమితి ఇజ్రాయిల్ సైన్యాన్ని దాడుల్ని ఆపమని ఎన్నిసార్లు హెచ్చరిస్తున్నా.. బేఖాతరు చేస్తూ దాడులు కొనసాగించడం.. గాజాలో మారణహోమానికి అమెరికా మద్దతు ఇవ్వడం సిగ్గులేని చర్య అని ఇరాన్ అధికార ప్రతినిధి ఎస్మాయిల్ బఘాయి ఈమేరకు ప్రకటనలో తెలిపారు. మారణహోమాన్ని ఆపాలంటే.. ఇజ్రాయిల్ నేతలను శిక్షించడానికి ముందు విచారించాలని ఆయన పిలుపిచ్చినట్లు ఇరాన్ మంత్రిత్వశాఖ ప్రకటన పేర్కొంది.


## బంగ్లాదేశ్ ఎన్నికలపై యూనస్ కీలక ప్రకటన



ఢాకా : బంగ్లాదేశ్ ఎన్నికలపై ఆ దేశ తాత్కాలిక నేత ముహమ్మద్ యూనస్ సోమవారం కీలక ప్రకటన చేశారు. వచ్చే ఏడాది చివరలో గాని, 2026 ప్రారంభంలో గాని బంగ్లాదేశ్ సార్వత్రిక ఎన్నికలకు వెళ్లే అవకాశం ఉందని అన్నారు. జాతినుద్దేశించి సోమవారం టెలివిజన్‌లో ప్రసంగించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఎన్నికల తేదీలను 2025 చివరినాటికి లేదా 2026 ప్రథమార్థంలో నిర్ణయించవచ్చని పేర్కొన్నారు. సార్వత్రిక ఎన్నికలకు ముందు పలు ఎన్నికల సంస్కరణలు చేపట్టాల్సి వుందని అన్నారు. లోపరహిత ఓటరు జాబితా వంటి కనీస సంస్కరణలతో ఎన్నికలను నిర్వహించేందుకు రాజకీయ పార్టీలు అంగీకరిస్తే.. 2025 నవంబర్ నెలాఖరులోగా ఎన్నికలు నిర్వహించవచ్చని అన్నారు. ఎన్నికల సంస్కరణల పూర్తి జాబితాను క్లియర్ చేయాలంటే మరికొన్ని నెలలు ఆలస్యం కావచ్చని అన్నారు. ఎన్నికల నిర్వహణపై యూనస్‌పై ఒత్తిడి పెరుగుతుండటంతో ఈ వ్యాఖ్యలు చేశారు. విద్యార్థుల తిరుగుబాటుతో ఈ ఏడాది ఆగస్టులో బంగ్లాదేశ్ ప్రధాని షేక్ హసీనా దేశాన్ని విడిచిపారిపోయిన సంగతి తెలిసిందే. అనంతరం నోబెల్ బహుమతి గ్రహీత యూనస్ బంగ్లాదేశ్ తాత్కాలిక ప్రభుత్వానికి ప్రధాన సలహాదారుగా నియమితులయ్యారు.

# ఘన చరిత్ర కలిగిన దేవరకొండ ఖిలా

### సప్తగిరుల దేవరాద్రి
### ఎన్నో అద్భుత కళాఖండాలకు ప్రసిద్ధి..
### అయినా అభివృద్ధిలో నిర్లక్ష్యం..
### పర్యాటక ప్రాంతం అయ్యేదెప్పుడు?



దేవరకొండ ఖిలాకు వందల ఏళ్ల చరిత్ర ఉంది. తెలంగాణలో ఉన్న కోటలన్నింటిలో దేవరకొండ కోట తనకంటూ ఓ ప్రత్యేకతను సొంతం చేసుకుంది. 13వ శతాబ్దంలో నిర్మితమైన దేవరకొండ ఖిలాకు సురగిరి అనే పేరుంది. అంటే దేవతల కొండ అని దీని అర్థం.

కోట చుట్టూ ఎనిమిది చోట్ల ఆంజనేయస్వామి రూపాన్ని చెక్కి కోటను అష్ట దిగ్బంధనం చేశారని ప్రతీతి. ఎంతో ప్రాచుర్యం పొందిన దేవరకొండ ఖిలాను పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలని ఈ ప్రాంత ప్రజల ఆకాంక్ష. అయినా పాలకులు దీనిపై దృష్టి పెట్టకపోవడంతో నిరాదరణకు గురవుతోంది.

**కోట చుట్టూ 360 బురుజులు..**

కాలక్రమేణా కోట గోడలు బీటలు వారినా.. నిర్మాణ శైలి నేటికీ అబ్బురపరుస్తోంది. పది కిలోమీటర్ల పొడవు, 500 అడుగుల ఎత్తులో ఏడు కొండల మధ్య నిర్మితమైన దేవరకొండ కోట శత్రుదుర్భేధ్యంగా ఉండేది. మట్టి, రాళ్లతో కట్టిన గోడలు నేటికీ నాటి నిర్మాణ కౌశలాన్ని చాటుతున్నాయి. 7 గుట్టలను చుట్టుకొని ఉన్న శిలా ప్రాకారంలో 360 బురుజులు, రాతితో కట్టిన 9 ప్రధాన ద్వారాలు, 32 ప్రాకార ద్వారాలు, 23 పెద్ద బావులు, 53 దిగుడు బావులు, కోనేర్లు, కొలనులు, సైనిక నివాసాలు, ధాన్యాగారాలు, సభావేదికలు, ఆలయాలు ఇలా.. ఎన్నో.. ఎన్నెన్నో. ప్రతీ నిర్మాణం వెనుక ఓ చారిత్రక గాథ పలకరిస్తుంటుంది. రాజదర్బార్ ఉన్న కోట ద్వారాలకు రెండు వైపులా పూర్ణకుంభాలు, సింహాలు, తాబేళ్లు, చేపలు, గుర్రాలు వంటి ఆకృతులు ఇక్కడ రాతిపై చెక్కబడి ఉన్నాయి. కోట సమీపంలో నరసింహ, ఓంకారేశ్వర, రామాలయం వంటి పురాతన దేవాలయాలు దర్శనమిస్తాయి. ఇక్కడి శిల్పకళా సంపద చరిత్రకు సజీవ సాక్ష్యాలుగా నిలుస్తాయి.

**పద్మనాయకుల రాజధానిగా..**

15వ శతాబ్దంనాటి ఈ కోటకు సంబంధించి ఎన్నో విశేషాలు వెలుగులోకి వచ్చాయి. సుమారు 700 ఏళ్ల కిందట 13వ శతాబ్దంలో కాకతీయులకు సామంతులుగా ఉండి.. ఆ తర్వాత స్వతంత్రులైన పద్మనాయకుల రాజధానిగా దేవరకొండ కీర్తి గడించింది. అనపోతనాయుడు, రెండవ మాదానాయుడి కాలంలో కోట నిర్మాణం జరిగింది. మాదానాయుడి వారసులు దేవరకొండని, అనపోతనాయుడి వారసులు రాచకొండను రాజధానిగా చేసుకొని క్రీ.శ 1236 నుంచి 1486 వరకు పాలన కొనసాగించారు. తర్వాత ఈ కోటను బహమనీ సుల్తానులు, కుతుబ్‌షాహీలు వశం చేసుకున్నారు.

**సందర్శకుల తాకిడి..**

దేవరకొండ ఖిలా సందర్శనకు హైదరాబాద్‌తోపాటు చుట్టుపక్కల ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున పర్యాటకులు వస్తుంటారు. సెలవు రోజుల్లో ఈ ప్రాంతం బిజీగా ఉంటుంది. అంతే కాకుండా హైదరాబాద్ నుంచి పలు ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు, విదేశీయులు సైతం కోటను సందర్శించి ఇక్కడి శిల్పకళా సంపదను చూసి ముగ్ధులవుతున్నారు. ఇక తొలి ఏకాదశి, మహా శివరాత్రి పర్వదినాల్లో దేవరకొండ చుట్టుపక్కల ప్రాంతాల నుంచి భక్తులు పెద్దఎత్తున కోటకు చేరుకొని దేవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహిస్తుంటారు. ఈ కోట సింహద్వారంపై చెక్కబడిన పూర్ణకుంభం చిహ్నం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ప్రభుత్వ చిహ్నంగా తీసుకోవడం గమనార్హం.


**పర్యాటక ప్రాంతంగా మార్చితే..**

ఖిలాను పర్యాటక కేంద్రంగా ఏర్పాటు చేయాలన్నది ఇక్కడి ప్రాంత ప్రజల చిరకాల కోరిక. దేవరకొండ ఖిలా గతమెంతో ఘనచరిత్ర కలిగి నాటి శిల్పకళా సంపదకు నిలువెత్తు రూపంగా నిలిచింది. ఈ ప్రాంతాన్ని ప్రభుత్వం పర్యాటక కేంద్రంగా ఏర్పాటు చేస్తే దేవరకొండతోపాటు చుట్టుపక్కల పట్టణాలు సైతం అన్నిరంగాల్లో అభివృద్ధి చెందుతాయి. ఈ ఖిలా విశిష్టత సైతం నలుమూలల వ్యాప్తి చెందుతుందని ఇక్కడి ప్రజల కోరిక. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఖిలా ఆవరణలో పార్క్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంది. ప్రస్తుతం పార్క్ నిర్మాణ పనులు పూర్తయినట్టు అధికారులు పేర్కొంటున్నారు.

**దేవరకొండ ఖిలాకు చేరుకునేదిలా..**

దేవరకొండ ఖిలా హైదరాబాద్‌కు 110 కిలోమీటర్లు, నాగార్జునసాగర్‌కు 45 కి.మీ, నల్లగొండ నుంచి సాగర్‌కు వెళ్లే దారిలో కొండమల్లేపల్లి పట్టణం నుంచి 7 కిలోమీటర్ల దూరంలో ఉంది. హైదరాబాద్, నల్లగొండ, సాగర్ నుంచి దేవరకొండకు నేరుగా బస్సు సౌకర్యం ఉంది.

# మంచినీళ్ల కుండ



'చదువని వాడజ్ఞుండగు! చదివిన సదసద్వివేక చతురత గలుగున్!' అంటాడు పోతన తన ఆంధ్ర మహా భాగవతంలో. చదవకపోతే ఏమీ తెలీదు, చదువుకుంటేనే మంచీ చెడుల వివేకం కలుగుతుందిబీ అందుకే, 'చదువంగ వలయు జనులకు! చదివించెద నార్యులొద్ద, చదువుము తండ్రీ!' అని ప్రహ్లాదుడికి తండ్రి హిరణ్యకశ్యపుడితో చెప్పిస్తాడు. నిజంగానే ఆ గురువుల దగ్గరి చదువేదో పూర్తికాగానే, 'చదివించిరి నను గురువులు! చదివితి ధర్మార్థ ముఖ్య శాస్త్రంబులు! నే/ జదివినవి గలవు పెక్కులు! చదువులలో మర్మ మెల్ల జదివితి తండ్రీ!' అని జవాబిస్తాడు ప్రహ్లాదుడు. కొడుకుకు కలిగిన వివేకం తండ్రి కోరుకున్నదేనా అన్నది పక్కనపెడితే, చదువనేది భిన్న ద్వారాలు తెరుస్తుందన్నది నిజం. ప్రహ్లాదుడు పుట్టు వివేకి కాబట్టి, తనకు కావాల్సిన సారాన్ని గ్రహించగలిగాడు. అందరికీ అలాంటి గుణం ఉంటుందా? అందుకే, 'చదువులన్ని చదివి చాలవివేకియౌ/ కపటికెన్న నెట్లు కలుగు ముక్తి/ దాలిగుంటగుక్క తలచిన చందము' అన్నాడు వేమన. 'చదువులెల్ల చదివి సర్వజ్ఞుడై యుండి'నప్పుడు కూడా ఉండే బలహీనతలను ఎత్తిపొడిచాడు. ఆత్మసారం తెలుసుకోవడమే ముఖ్యమన్నాడు. అతడు 'బాగా చదువుకున్నవాడు' అంటే లోకాన్ని బాగా అర్థం చేసుకున్నవాడు, పరిణత స్వభావం ఉన్నవాడు, గౌరవనీయుడు, ఒక్క మాటలో వివేకి అని! వివేకం అనేది ఎన్నో గుణాలను మేళవించుకొన్న పెనుగుణమే కావొచ్చు. అయినా అదొక్కటే చాలా? 'చదువది యెంతగల్గిన రసజ్ఞత యించుక చాలకున్న నా/ చదువు నిరర్థకమ్ము' అన్నాడు భాస్కర శతకకర్త మారవి వెంకయ్య. 'బదునుగ మంచి కూర నలపాకము చేసిననైన నందు నిం/పొదవెడు నుప్పులేక రుచి బుట్టగ నేర్చునటయ్య భాస్కరా!' అని ప్రశ్నించాడు. కూరకు రుచి తెచ్చే ఉప్పులాగే జీవితంలో 'యించుక' రసజ్ఞత ఉండాలి. చాలామందిలో ఆ సున్నితం, ఆ సరస హృదయం లోపించడం వల్లే సంబంధాలు బండబారుతున్నాయి. అందుకే వివేకం, రసజ్ఞతలను పెంచే చదువు ముఖ్యం. ఈ చదువు తరగతి చదువు కాదని ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. తరగతి గదిలోనే ఇవి అలవడితే అంతకంటే కావాల్సింది ఏముంది! ప్రపంచంలోకి దారి చూపే చదువు, ప్రపంచాన్ని చేరువ చేసే చదువు సాహిత్య రూపంలో ఉంటుంది. ఆ సాహిత్యం మంచి పుస్తకం రూపంలో హస్తభూషణమై ఉంటుంది. మనుషుల వివేకాన్ని కొలవదలిచినవాళ్లు 'ఇప్పుడు ఏం చదువుతున్నారు?' అని అడుగుతారు. చదవడం మాత్రమే సరిపోదు, ఆ చదువుతున్నది ఏమిటి? 'నీ దగ్గర ఎన్ని పుస్తకాలు ఉన్నాయన్నది విషయం కాదు, నీ దగ్గరున్న పుస్తకాలు ఎంత మంచివి అన్నదే ముఖ్యం' అంటాడు గ్రీకు తత్వవేత్త సెనెకా. మంచిని ఎలా కొలవాలి? 'మనల్ని గాయపరిచే, పోటుపొడిచే పుస్తకాలే మనం చదవాలి. తల మీద ఒక్క చరుపు చరిచి మేలుకొలపకపోతే అసలంటూ ఎందుకు చదవడం' అంటాడు రచయిత ఫ్రాంజ్ కాఫ్కా. చదవడమే పెద్ద విషయం అయిన కాలంలో, దానికి ఇన్ని షరతులా అన్న ప్రశ్న రావడం సహజమే. ఎందుకంటే, 'నేషనల్ లిటరసీ ట్రస్ట్' నివేదిక ప్రకారం, భారతీయ చిన్నారుల్లో చదవడం దాదాపు సంక్షోభం స్థాయికి పడిపోయింది. 5%-%18 ఏళ్లవారిలో కేవలం మూడింట ఒక్కరు మాత్రమే తమ ఖాళీ సమయంలో చదవడాన్ని ఆనందిస్తామని చెప్పారు. కేవలం 20 శాతం మంది మాత్రమే, ప్రతిరోజూ ఏదో ఒకటి చదువుతున్నామని జవాబిచ్చారు. చదివే అలవాటును పెంచకపోతే, వికాసానికి దారులు మూస్తున్నట్టే! ఆధునిక తరానికి చదవడం మీద ఉత్సాహం కలిగించేలా, అయోమయ తరానికి రసజ్ఞత పెంచేలా 'హైదరాబాద్ బుక్ ఫెయిర్' డిసెంబర్ 19 నుంచి 29 వరకు పాటు కాళోజీ కళాక్షేత్రం (ఎన్టీఆర్ స్టేడియం)లో జరగనుంది. మధ్యాహ్నం పన్నెండు నుంచి రాత్రి తొమ్మిది వరకు ఇది కొనసాగుతుంది. తెలుగు, ఆంగ్లం, ఉర్దూ, హిందీలో పేరున్న భిన్న ప్రచురణకర్తలు, విక్రేతలు, రచయితల స్టాళ్లు సుమారు 350 వరకు ఏర్పాటవుతాయి. నూతన పుస్తకాల ఆవిష్కరణలు, ఉపన్యాసాలు ఉంటాయి. 1985 నుంచి జరుగుతున్న ఈ బుక్ ఫెయిర్‌ను ఈసారి పదిహేను లక్షల మంది సందర్శిస్తారని అంచనా. 'మనం అనేక పండుగలు చేసుకుంటాం. కానీ పుస్తకాల పండుగ ప్రత్యేకమైనది. పెద్ద జాతరలో మంచినీళ్ల కుండ లాంటిది బుక్ ఫెయిర్. ఏ రకమైనా కావొచ్చుగాక, అసలు పుస్తకాల వైపు రాగలిగితే మనిషికి వివేకం, వివేచన పెరుగుతాయి. జీవిత సారాన్ని అందించేదే కదా పుస్తకమంటే! 'ఏడు తరాలు' లాంటి నవలకు మనం ఎట్లా కనెక్ట్ అయ్యాం! పుస్తకాలు, అక్షరాలు లేకపోతే మనం ఎక్కడుండేవాళ్లం? అందుకే ఈసారి నచ్చిన, మెచ్చిన, ప్రభావితం చేసిన పుస్తకం అంటూ పుస్తకం కేంద్రకంగా కొన్ని సెషన్లు నిర్వహిస్తున్నాం' అని చెబుతున్నారు బుక్ ఫెయిర్ అధ్యక్షుడు 'కవి' యాకూబ్. అయితే, పుస్తకాల దుకాణాల కన్నా, దగ్గర్లోని బజ్జీల బండికి గిరాకీ ఎక్కువ అనే వ్యంగ్యం మన దగ్గర ఉండనే ఉంది. అన్నింటిలాగే ఇదీ ఒక ఔటింగ్, ఒక వినోదం, బయటికి వెళ్లడానికి ఒక సాకు... లాంటి ప్రతికూల అభిప్రాయాలు ఉండనే ఉన్నాయి. ఏ వంకతో వెళ్లినా దేవుడి దగ్గరికి వెళ్లగానే భక్తిగా కళ్లు మూసుకున్నట్టు, పుస్తకం చూడగానే ఆర్తిగా చేతుల్లోకి తీసుకుంటున్నప్పుడు ఏ కారణంతో వెళ్తేనేం? కాకపోతే వ్యక్తిత్వానికి సరిపడే, వివేకం%-% రసజ్ఞతలను పెంచే పుస్తకాలను ఎంపిక చేసుకోవడమే పెద్ద పని. దానికోసం కొంత పొల్లు కూడా చదవాల్సి రావొచ్చు. కానీ క్రమంగా ఒక ఇంట్యూషన్ వృద్ధి అవుతుంది. అదే చదువరి పరిణతి.

## చదరంగంలో భారత కీర్తి పతాకను సమున్నతంగా ఎగరేసిన గ్రాండ్ మాస్టర్ గుకేశ్



చదరంగంలో భారత కీర్తి పతాకను సమున్నతంగా ఎగరేసిన గ్రాండ్ మాస్టర్ దొమ్మరాజు గుకేశ్‌కు అభినందనలు. సింగపూర్‌లో జరిగిన ఫిడే 18వ ప్రపంచ చాంపియన్‌షిప్ ఫైనల్‌లో ప్రస్తుత వరల్డ్ చాంపియన్, చైనాకు చెందిన 32 ఏళ్ల ఆటగాడు డింగ్ లిరెన్‌ను ఓడించి గుకేశ్ చరిత్ర సృష్టించాడు. అతి పిన్న వయసులో ప్రపంచ చెస్ చాంపియన్‌షిప్ గెలుచుకున్న ఆటగాడిగా గ్యారీ కాస్పరోవ్ నాలుగు దశాబ్దాల రికార్డును గుకేశ్ బద్దలుకొట్టాడు. అంతేకాదు ఈ ప్రతిష్టాత్మక టైటిల్‌ను సాధించిన భారతీయులలో రెండవ ఆటగాడిగా రికార్డుకెక్కాడు. అయిదు సార్లు (2000, 2007, 2008, 2010, 2013) ప్రపంచ చాంపియన్‌గా నిలిచిన జీనియస్ విశ్వనాథన్ ఆనంద్ తరువాత ఈ టైటిల్ సాధించిన రెండవ భారతీయ ఆటగాడిగా, మూడవ ఆసియా వాసిగా రికార్డుకెక్కాడు. ఆసియాలో ఇప్పటివరకు ముగ్గురే ముగ్గురు ప్రపంచ చెస్ చాంపియన్లు. వీరే విశ్వనాథన్ ఆనంద్, డింగ్ లిరెన్ (చైనా), గుకేశ్. చెన్నైలో విశ్వనాథన్ ఆనంద్ చెస్ అకాడెమీ 'వెస్ట్ బ్రిడ్జ్'లో రెండేళ్ల కఠోర శిక్షణ, అద్భుతమైన ప్రతిభ, అంకితభావం, చివరి క్షణం వరకు పోరాడాలనే కసే అతడ్ని చదరంగంలో ఉన్నత శిఖరాలకు చేర్చాయనడంలో ఏమాత్రం అతిశయం లేదు. ఈ పద్దెనిమిదేళ్ల గ్రాండ్ మాస్టర్ ఇప్పుడు కోట్లాది మంది యువ చెస్ ఆటగాళ్లకు ప్రేరణగా నిలిచాడు. 14 రౌండ్ల ప్రపంచ చెస్ టైటిల్ కోసం ప్రస్తుత చాంపియన్ డింగ్ లిరెన్‌ను సవాల్ చేసిన గుకేశ్ మొదటి రౌండ్‌లో ఓటమి చవిచూసినప్పటికీ చెక్కు చెదరని మనో నిబ్బరంతో ఆట కొనసాగించాడు. తరువాతి రెండు రౌండ్లు డ్రా చేసుకుని నాలుగో రౌండ్‌లో విజయం సాధించడం ద్వారా స్కోరును సమం చేశాడు. మ్యాచ్‌పై పట్టు కోసం ఇరువురూ తీవ్రంగా పోరాడారు. పోటాపోటీ వ్యూహాలతో 13వ రౌండ్ ముగిసే సరికి చెరో ఆరున్నర పాయింట్లతో సమ ఉజ్జీలుగా నిలిచారు. దీంతో చివరి 14వ రౌండ్ నిర్ణయాత్మకంగా మారింది. కీలకమైన ఫైనల్ రౌండ్‌లో నల్ల పావులతో ఆడిన గుకేశ్ 58 ఎత్తుల్లో తన ప్రత్యర్థిని చిత్తు చేసి టైటిల్ చేజిక్కించుకున్నాడు. గేమ్ డ్రా దిశగా మరలుతున్న సమయంలో 55వ ఎత్తులో డింగ్ బిషప్‌ను తప్పుడు స్థానంలో ఉంచి పొరపాటు చేశాడు. దానిని అడ్వాంటేజ్‌గా తీసుకున్న గుకేశ్ ఇక వెనుదిరిగి చూడలేదు. ఆ తరువాత మూడు ఎత్తుల్లోనే ప్రత్యర్థికి చెక్ పెట్టాడు. డింగ్‌కు ఓటమిని అంగీకరించడం మినహా మరో గత్యంతరం లేని స్థితి కల్పించాడు. ప్రపంచ చెస్ చాంపియన్‌షిప్ టైటిల్ పోరు ఇద్దరు ఆసియన్ల మధ్యే జరగడం ఇదే మొదటిసారి. చెన్నైలో పుట్టిన గుకేశ్ మూలాలు ఆంధ్రప్రదేశ్‌లోని తూర్పు గోదావరి జిల్లాలో ఉన్నాయి. ఆయన తండ్రి డాక్టర్ రజనీకాంత్ ఇఎన్‌టి నిపుణులు, తల్లి పద్మజ మైక్రోబయాలజిస్టు. గుకేశ్‌కు చిన్నప్పటి నుంచే చదరంగం పట్ల మక్కువ ఎక్కువ. తొమ్మిదేళ్ల ప్రాయంలోనే ఆసియా స్కూల్ ఆఫ్ చెస్ చాంపియన్‌షిప్ అండర్ 9 విభాగంలో విజేతగా నిలిచాడు. 2018లో ప్రపంచ యూత్ చెస్ చాంపియన్‌షిప్ టైటిల్‌ను, ఆ తరువాత ఆసియా యూత్ చెస్ చాంపియన్‌షిప్‌ను సాధించాడు. 2017లో అంతర్జాతీయ స్థాయికి ఎదిగి అతి పిన్న వయస్కుడైన మూడవ గ్రాండ్ మాస్టర్ హోదా సాధించాడు. అంచెలంచెలుగా ఎదుగుతూ 18 ఏళ్ల వయసులో ఫిడే ప్రపంచ చెస్ చాంపియన్ టైటిల్ సాధించడం అనితర సాధ్యం. ప్రపంచ చదరంగ చరిత్రలో విశ్వనాథన్ ఆనంద్, గుకేశ్ పేర్లు సువర్ణాక్షరాలతో లిఖించబడతాయి. ఇటీవల కాలంలో మరికొందరు చిచ్చర పిడుగులు కూడా ముందుకు రావడం చదరంగంలో భారత్ రారాజుగా వెలుగొందుతుందన్న ఆశావహ పరిస్థితి కనిపిస్తోంది. గుకేశ్‌తో బాటు టాప్ 15 ర్యాంకుల్లో ఉన్న గ్రాండ్ మాస్టర్స్ అర్జున్ ఎరిగైసి, ఆర్. ప్రజ్ఞానంద వంటి యువ ఆటగాళ్లలో ప్రపంచ చాంపియన్లుగా ఎదిగేందుకు అవసరమైన ప్రతిభాపాటవాలు పుష్కలంగా ఉన్నాయి. చెస్‌లో ఇటువంటి యంగ్ జీనియస్‌లకు గుకేశ్ విజయం స్ఫూర్తిదాయకంగా నిలుస్తుంది.

# అల్పపీడనం - మూడురోజులపాటు వానలు



అమరావతి : దక్షిణ మధ్య బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా నేడు, రేపు, మూడురోజులపాటు ఉత్తర కోస్తా, దక్షిణ కోస్తా, రాయలసీమలోని పలు ప్రాంతాల్లో మోస్తరు వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ వెల్లడించింది. వాతావరణ శాఖ అధికారుల వివరాల మేరకు నిన్నటి ఆగ్నేయ బంగాళాఖాతంలోని ఉపరితల ఆవర్తనం ప్రభావంతో సోమవారం ఉదయం దక్షిణ మధ్య బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడింది. దీని అనుబంధ ఉపరితల ఆవర్తనం సగటు సముద్ర మట్టానికి 3.1 కి.మీ ఎత్తు వరకు వరకు విస్తరించింది. తరువాత రెండు రోజులలో బాగా గుర్తించబడిన అల్పపీడనంగా బలపడి పశ్చిమ-వాయువ్య దిశగా తమిళనాడు తీరం వైపు కదిలే అవకాశముంది. పలుచోట్ల ఈశాన్య గాలులు వీస్తాయి. వీటి ఫలితంగా ఉత్తర కోస్తా ఆంధ్రప్రదేశ్, యానాంలలో, దక్షిణ కోస్తా, రాయలసీమలోనూ ఈ మూడు రోజులపాటు తేలికపాటి నుండి ఒక మోస్తరు వర్షాలు ఒకటి లేదా రెండు చోట్ల కురిసే అవకాశముంది. ఉరుములతో కూడిన జల్లులు కొన్ని చోట్ల కురిసే అవకాశముంది. ఉరుములతో కూడిన మెరుపులు ఒకటి లేదా రెండు చోట్ల సంభవించే అవకాశముంది.

# ఆర్థికమంత్రి ఆరోపణలపై గట్టి కౌంటరిచ్చిన ఖర్గే



న్యూఢిల్లీ : పార్లమెంటు శీతాకాల సమావేశాలు కొనసాగుతున్నాయి. సోమవారం రాజ్యసభలో భారత రాజ్యాంగంపై అధికార, ప్రతిపక్షాల మధ్య వాడి వేడి చర్చ జరిగింది. ఈ సందర్భంగా ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ ఆరోపణలపై కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే గట్టిగా కౌంటరిచ్చారు. కులగణనకు వ్యతిరేకిస్తున్న బిజెపి, అందరినీ మోసం చేసేందుకు జుమ్లా (అసత్యాలు) వల్లెవేస్తోందని, తమ పార్టీని నిందిస్తోందని ఖర్గే మండిపడ్డారు. బిజెపి కన్నా వేగంగా తమ ప్రభుత్వమే వేగంగా మహిళా రిజర్వేషన్లను అమలు చేస్తుందని అన్నారు. కుటుంబ పాలన కోసం కాంగ్రెస్ యథేచ్ఛగా రాజ్యాంగ సవరణలు చేసిందని ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఆరోపించారు. 1976, డిసెంబర్ 18న అప్పటి రాష్ట్రపతి 42వ రాజ్యాంగ సవరణ చట్టానికి ఆమోదం ప్రకటించడంతో ఎమర్జెన్సీ విధించారని అన్నారు. ఎమర్జెన్సీ సమయంలో సరైన కారణం లేకుండానే లోక్‌సభ పదవీకాలాన్ని పొడిగించారని, ఆ సమయంలో మరో రాజ్యాంగ సవరణతో మొత్తం ప్రతిపక్షాన్ని జైలుకు పంపారని ఆరోపించారు.

# రాజ్యాంగంపై చర్చ.. కాంగ్రెస్‌పై నిప్పులు చెరిగిన నిర్మలా సీతారామన్



ఢిల్లీ: రాజ్యసభలో రాజ్యాంగంపై చర్చ సమయంలో మాజీ ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ, కాంగ్రెస్‌పై కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ విమర్శలు గుప్పించారు. పౌర హక్కులను పరిమితం చేయడానికి కాంగ్రెస్ పదే పదే రాజ్యాంగాన్ని సవరించిందని ఆరోపించారు. రాజ్యసభలో నిర్మలా సీతారామన్ మాట్లాడుతూ.. 'గత ఏడు దశాబ్దాలలో మన రాజ్యాంగంలో అనేక సవరణలు జరిగాయి. నెహ్రూ తాత్కాలిక ప్రభుత్వంలో రాజ్యాంగంలో వాక్ స్వాతంత్ర్యాన్ని అరికట్టేలా మొదటి సవరణ జరిగింది. మీడియా సంస్థలు ముఖ్యంగా రాజకీయంతో సంబంధం ఉన్న కీలక అంశాలపై లోతుగా విచారణ జరపరడాన్ని నెహ్రూ వ్యతిరేకించారని, పత్రికా స్వాతంత్ర్యాన్ని తగ్గించేందుకు రాజ్యాంగాన్ని ఆమోదించిన ఏడాదిలోపే రాజ్యాంగాన్ని సవరించారని పేర్కొన్నారు. గత వారం లోక్‌సభలో రెండు రోజులపాటు జరిగిన వాడివేడి చర్చల తర్వాత ఇవాళ సీతారామన్ రాజ్యసభలో రాజ్యాంగంపై చర్చను ప్రారంభించారు . ఉపరాష్ట్రపతి, రాజ్యసభ ఛైర్మన్ జగదీప్ ధన్‌ఖడ్‌పై ప్రతిపక్ష పార్టీలు ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానంపై ఉద్రిక్తతలు పెరుగుతున్న నేపథ్యంలో ఈ చర్చ జరిగింది. పార్లమెంట్ శీతాకాల సమావేశాల్లో రాజ్యాంగంపై చర్చ జరపాలని ప్రతిపక్షాలు కీలక డిమాండ్ చేశాయి. దీంతో పాటు అదానీ వివాదం, జార్జ్ సోరోస్ ఆరోపణలు , ఉపరాష్ట్రపతి,రాజ్యసభ ఛైర్మన్ జగ్‌దీప్ ధన్‌ఖడ్‌పై విపక్షాలు అవిశ్వాస తీర్మానం నోటీసు వంటి అంశాలు ఉభయ సభల్లో గందరగోళానికి దారి తీశాయి.

# 90 ఏళ్ల తర్వాత.. గడగడలాడించిన చిడో తుపాన్



పారిస్ : చిడో తుపాన్ బీభత్సం సృష్టిస్తోంది. హిందు మహాసముద్రంలో ఏర్పడిన చిడో తుపాను తీవ్రతతో మయోట్ ద్వీపంలో వందల మంది ప్రాణాలు కోల్పోయారు. వేలాది మంది నిరాశ్రయులైనట్లు ఫ్రాన్స్ హోం మంత్రిత్వ శాఖ వెల్లడించింది. తుపాను కారణంగా గంటకు దాదాపు 220 కిలోమీటర్ల వేగంతో బలమైన గాలులు ద్వీపాన్ని అతలా కుతలం చేశాయి. ఫలితంగా తాత్కాలిక గృహాలు, ప్రభుత్వ భవనాలు, ఆసుపత్రులు దెబ్బతిన్నాయని అధికారులు వెల్లడించారు. ఈ గాలుల ప్రభావం వల్ల ప్రాణ,ఆస్తినష్టం భారీ ఎత్తున జరిగిందని అన్నారు. గత 90 ఏళ్లలో మయోట్‌ను తాకిన అత్యంత భయంకరమైన తుపాను ఇదేనని అధికారులు చెప్పారు. ఫ్రాన్స్ ప్రభుత్వ లెక్కల ప్రకారం.. ఆదివారం ఉదయం చిడో తుఫాన్ ప్రారంభంలో 11మంది మరణించగా, 250 మందికి పైగా తీవ్ర గాయాలైనట్లు ధృవీకరించింది. అయితే మరణాలు, గాయపడ్డ వారి సంఖ్య సోమవారం ఉదయం నాటికి గణనీయంగా పెరిగినట్లు అంచనా వేసింది. శనివారం తుఫాను కారణంగా మయోట్ ద్వీపం పూర్తిగా దెబ్బ తిన్నదని, జరిగిన ప్రాణనష్టం, ఆస్తినష్టం ఎంతనేది అంచనా వేయడం కష్టంగా ఉందన్నారు. ఫ్రాన్స్ రెస్క్యూ టీమ్‌లు.. మెడిసిన్, ఆహారంతో పాటు ఇతర నిత్యవసర వస్తువుల్ని ద్వీపానికి తరలించినట్లు మయోట్ ద్వీప ప్రభుత్వ అధికారులు పేర్కొన్నారు.

# వక్ఫ్ బిల్లుతో పాలిటిక్స్

## కర్నాటక, కేరళ, తమిళనాడులో ఆ పార్టీ నాయకుల తీరు

## కాషాయపార్టీ తీరుపై ముస్లిం సంఘాలు, ప్రతిపక్షాల ఆగ్రహం




న్యూఢిల్లీ : దేశంలో వక్ఫ్ బిల్లుతో హిందూత్వ రాజకీయాలకు బీజేపీ యత్నిస్తున్నది. ఆ పార్టీ నాయకులు ఈ బిల్లును తమ రాజకీయ ప్రయోజనాలకు అనుకూలంగా మలుచుకుంటున్నారు. ప్రజల మధ్య వైషమ్యాలు రెచ్చగొట్టి మరీ ఈ విధంగా వ్యవహరిస్తున్నారు. కర్నాటక, కేరళ, తమిళనాడు వంటి రాష్ట్రాల్లో పలు సందర్భాల్లో బీజేపీ నాయకుల తీరు దీనికి అద్దం పడుతున్నది. కర్నాటకలోని బీజేపీ నాయకులు వక్ఫ్ బోర్డుకు వ్యతిరేకంగా తీవ్ర ప్రచారాన్నే చేస్తున్నారు. ఆ పార్టీ ఎంపీలు, ఎమ్మెల్యేలు అందివచ్చిన ప్రతి సందర్భాన్నీ ఉపయోగిం చుకుంటున్నారు. అక్టోబర్‌లో బీజేపీ ఎంపీ తేజస్వి సూర్య.. విజయపుర జిల్లాలోని రైతులను కలిశారు. హొనవాడలోని ఒక గ్రామంలో 1500 ఎకరాలకు సంబంధించి వక్ఫ్ బోర్డుకు చెందిన భూమిని రైతులు ఆక్రమించారంటూ అప్పటికే వారికి నోటీసులు వచ్చాయి. దీంతో రంగంలోకి దిగిన బీజేపీ ఎంపీ.. ఎలాంటి ఆధారాలు, వివరణ లేకుండా నోటీసులు పంపటాన్ని ప్రశ్నించారు. గెజిట్ నోటిఫికేషన్‌లో తప్పిదం కారణంగా విజయపుర గ్రామంలోని రైతులకు నోటీసులు అందాయని కర్నాటక ప్రభుత్వం పేర్కొన్నది. రాష్ట్రంలోని ఇతర ప్రాంతాల రైతులకూ జారీ అయిన నోటీసులను ఉపసంహరించుకోవాలని ముఖ్యమంత్రి సిద్ధరామయ్య అధికారులను ఆదేశించారు.ఇలాంటి నోటీసులు హావేరి జిల్లాలో హింసకు దారితీశాయి. కడకోల్ జిల్లాలోని గ్రామస్థులు తమ భూమిని కూడా వక్ఫ్ ఆస్తిగా క్లెయిమ్ చేస్తారనే భయంతో ముస్లిం నివాసితుల ఇండ్లపై రాళ్లు రువ్వారు. ఇదే ఆందోళనతో ధార్వాడ్, కల్బుర్గిలో కూడా నిరసనలు వెల్లువెత్తాయి. వక్ఫ్‌బోర్డులు భూ ఆక్రమణదారులనీ, దానిని తక్షణమే సవరించాల్సిన అవసరమున్నదనే అభి,ప్రాయాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు బీజేపీ తీవ్ర ప్రయత్నాలనే చేసింది. ఈ చర్యలే రైతులు, ప్రజల్లో ముస్లింల పట్ల ఆగ్రహానికి కారణమవుతున్నాయని అంటు న్నారు.సాధారణంగా బీజేపీ శ్రేణులు, హిందూత్వ శక్తులు.. ముస్లింల పట్ల ద్వేషాన్ని పెంచటానికి 'జిహాద్' పదాన్ని ఉపయోగిస్తుంటారు. లవ్ జిహాద్ అంటూ ఆ మధ్య సాక్షాత్తూ బీజేపీ ప్రభుత్వాలే చర్యలు తీసుకున్న సందర్భాలున్నాయి. ఇప్పుడు దీనిని భూములకూ అన్వయిస్తున్నాయి బీజేపీ, దాని అనుబంధ హిందూత్వ శక్తులు. దీనికే 'ల్యాండ్ జిహాద్' అనే పేరును పెట్టాయి. వక్ఫ్ చట్టం, 1995లో నిర్దేశించిన అధికారాలను కలిగి ఉన్న రాష్ట్రస్థాయి సంస్థల ద్వారా వక్ఫ్ భూముల నిర్వహించబడతాయి. భారత్‌లోని ప్రతి రాష్ట్రం, కేంద్రపాలిత ప్రాంతాని(యూటీ)కి 30 వక్ఫ్ బోర్డులున్నాయి. వక్ఫ్ బోర్డుల పనితీరుకు సవరణలు ప్రతిపాదించే బిల్లును సమీక్షించే జాయింట్ పార్లమెంటరీ కమిటీ(జేపీసీ) పదవీకాలాన్ని నవంబర్ 28న లోక్‌సభ పొడిగించింది. ఇప్పుడది ఫిబ్రవరి బడ్జెట్ సెషన్‌కు మారింది. వక్ఫ్ బిల్లును ప్రతిపక్షాలు, ముస్లిం సంస్థలు వ్యతిరేకిస్తున్నాయి. ఇప్పటికే మోడీ సర్కారుకు వ్యతిరేకంగా తీవ్ర ఆందోళనలు చేపట్టాయి కూడా. వక్ఫ్ బోర్డులను భూ ఆక్రమణదారులుగా చిత్రీకరించే బీజేపీ వ్యూహం పట్ల తాము జాగ్రత్తగా ఉన్నామని ముస్లిం సంఘాలు అంటున్నాయి. పార్లమెంటు ప్యానెల్‌లో సభ్యుడు, తృణమూల్ కాంగ్రెస్(టీఎంసీ) ఎంపీ కళ్యాణ్ బెనర్జీ మాట్లాడుతూ పార్లమెంటులో బిల్లును ముందుకు తీసుకురావటం కష్టంగా ఉన్నందున, వక్ఫ్ బోర్డులకు వ్యతిరేకంగా సాధారణ ప్రజలలో వాతావరణాన్ని సృష్టించటానికి బీజేపీ లేనిపోని సమస్యలను లేవనెత్తిందని అన్నారు. ఢిల్లీ వక్ఫ్ బోర్డు మాజీ న్యాయవాది వజీ షఫీక్ మాట్లాడుతూ "ముస్లింలను విలన్‌లుగా చిత్రీకరించటానికి, సమాజానికి వ్యతిరేకంగా ఓటర్లను పోలరైజ్ చేయటానికి ఇది బీజేపీ కొత్త ఎత్తుగడ అని హెచ్చరించారు.వక్ఫ్ ఆస్తులన్నింటినీ జాతీయం చేయాలని కర్నాటకలో బీజేపీ ఎమ్మెల్యే బసనగౌడ పాటిల్ యత్నాల్ డిమాండ్ చేశారు. గతనెల కర్నాటకలోని మూడు అసెంబ్లీ స్థానాలకు ఉప ఎన్నికలు జరిగినప్పుడు కూడా బీజేపీ ఈ వివాదాన్ని ఎన్నికల అంశంగా ఉపయోగించుకున్నది. హిందువులు సాగు చేసుకుంటున్న ప్లాట్లను వక్ఫ్ ఆస్తిగా తప్పుగా గుర్తించటం ద్వారా కాంగ్రెస్ ముస్లింలను సంతృప్తి పరుస్తున్నదని బీజేపీ ఆరోపించింది. వక్ఫ్ బిల్లును సవరించే అంశం, మతపరమైన మార్గాల్లో ఓటర్లను పోలరైజ్ చేయడానికి భూ వివాదాలను ఉపయోగించుకునే బీజేపీ వ్యూహం ఇటీవలి నెలల్లో కేరళలో కూడా స్పష్టంగా కనిపిస్తున్నది. ఎర్నాకుళం జిల్లాలోని మునంబం తీరం వెంబడి ఉన్న 404 ఎకరాల భూమి వక్ఫ్ బోర్డు, 600 హిందూ, క్రైస్తవ మత్స్యకారుల కుటుంబాల మధ్య 1960ల నుంచి న్యాయపరమైన వివాదానికి కేంద్రంగా ఉన్నది. కమ్యూనిటీ సభ్యులకు చెందిన ఆస్తులపై వక్ఫ్ బోర్డు చట్టవిరుద్ధంగా క్లెయిమ్‌లు వేసిందని ఆరోపిస్తూ సైరో-మలబార్ చర్చి నేతృత్వంలోని క్రైస్తవ సంస్థలు జేపీసీకి లేఖ రాయటంతో కర్నాటక వివాదం జరిగిన సమయంలోనే ఈ విషయం మళ్లీ తెరపైకి వచ్చింది. వయనాడ్ లోక్‌సభ స్థానానికి గత నెలలో జరిగిన ఉపఎన్నికల ప్రచార ర్యాలీలో బీజేపీ ఎంపీ సురేష్ గోపి మాట్లాడుతూ.. బిల్లుకు సవరణలు వక్ఫ్ బోర్డు క్రూరత్వాన్ని అణిచివేస్తాయన్నారు. ఓటర్లు బీజేపీకి మద్దతు ఇవ్వకుంటే కేరళలోని శబరిమల ఆలయం, తమిళనాడులోని వేలంకన్ని చర్చిలపై వక్ఫ్ బోర్డు క్లెయిమ్ చేస్తుందని ఆయన హెచ్చరించారు. తమిళనాడులో వక్ఫ్ బోర్డు "ల్యాండ్ జిహాద్" అని ఆరోపించేందుకు బీజేపీ ఇదే నమూనాను అనుసరించింది. తిరుచ్చిలోని తిరుచెందురై ఆలయానికి, 600 మందికి చెందిన భూమిని వక్ఫ్ బోర్డు అక్రమంగా క్లెయిమ్ చేసిందని కేంద్ర మంత్రి శోభా కరంద్లాజే ఆరోపించారు. వక్ఫ్ బిల్లును సమీక్షిస్తున్న పార్లమెంటరీ ప్యానెల్ సభ్యుడు, కాంగ్రెస్ ఎంపీ ఇమ్రాన్ మసూద్ మాట్లాడుతూ వక్ఫ్ బోర్డులతో మొత్తం ముస్లిం సమాజాన్ని లక్ష్యంగా చేసుకోవటానికి బీజేపీ ల్యాండ్ జిహాద్ కుట్ర సిద్ధాంతాన్ని ప్రచారం చేస్తోందని అన్నారు.

# శిరస్త్రాణం (హెల్మెట్) ఒక రక్షణాస్త్రం



'వేగం కన్నా ప్రాణం మిన్న', 'అతి వేగం ప్రాణానికే ప్రమాదం' వంటి సూక్తులు నిత్యం వింటుంటాం. బైక్ నడపడంలో తాము నేర్పరులమని, శిరస్త్రాణం అవసరం లేదని, ఇది శిరోభారం మాత్రమేనని భావిస్తుంటాం. శిరస్త్రాణం (హెల్మెట్) ఒక రక్షణాస్త్రం ద్విచక్ర వాహనదారుల తలకు భద్రత కల్పించే రక్షణ కవచం. శిరస్త్రాణంతో ప్రాణం పదిలం. 'సోదరా నెత్తిన పెట్టుకో హెల్మెట్/ అది నీ తల చుట్టూ గట్టి సాకెట్/ హెల్మెట్ వుంటే నీ లైఫ్ నాటౌట్/ హెల్మెట్ లేకుంటే నీ లైఫ్ రనౌట్' అంటాడో కవి. ఎండావానలకు, మంచు, చలి, దుమ్మూధూళికి కూడా రక్షణగా నిలుస్తుంది. యువత బైక్ ఎక్కితే చాలు మితిమీరిన వేగం, మద్యం మత్తులో నడపడం, ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘించడం పరిపాటిగా మారింది. ఇటీవల యువత సెల్‌ఫోన్ డ్రైవింగ్, రాంగ్‌రూట్, ఓవర్‌టేక్ చేయడం, నిర్లక్ష్యంగా హెల్మెట్ లేకుండా డ్రైవింగ్ చేస్తూ నిండుప్రాణాలు బలిపెట్టుకుంటున్నారు. కుటుంబాలకు, ఆత్మీయులకు దు:ఖాన్ని మిగుల్చుతున్నారు. సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనాలు నడుపుతున్న సంఘటనలు ఇటీవల ఎక్కువయ్యాయి. 'శరీరానికి శిరస్సు ప్రధానం, ఇంద్రియాలలో నేత్రం ప్రధానం, షడ్రుచులలో ఉప్పు ప్రధానం, నదులకు నీరు ప్రధానం' అని సుభాషిత రత్నావళి చెబుతుంది. కానీ, శిరస్సుకు శిరస్త్రాణం ప్రధానం అని జీవితం చెబుతుంది. ఉరుకుల పరుగుల జీవితంలో వేగానికున్న ప్రాధాన్యత భద్రతకు ఇవ్వకపోవడంతో భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వస్తోంది. హెల్మెట్ లేకపోతే ఏమౌతుందిలే అన్న చిన్నపాటి నిర్లక్ష్యం వల్ల ఎంతోమంది యువకులు ప్రాణాలను కోల్పోతున్నారు. దేశంలో ఏడాదికి సగటున 1.78లక్షల మంది రోడ్డు ప్రమాదాలలో మరణిస్తున్నారని, అందులో 60మంది 18నుంచి 34 ఏళ్లలోపు వారేనని సాక్షాత్తూ కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ ఇటీవల లోక్‌సభలో వెల్లడించారు. దేశంలో ప్రతి గంటకూ దాదాపు 53 ప్రమాదాలు, 19 మరణాలు జరుగుతున్నాయి. దీనిలో 45శాతం ద్విచక్ర వాహన ప్రమాదాలేనని కేంద్రమంత్రి తెలిపారు. దేశంలో ప్రస్తుతం యువ జనాభా ఎక్కువగా వుంది. అయితే, ప్రస్తుతం 15 ఏళ్ల లోపు వున్న బాలల శాతం 2036 నాటికి గణనీయంగా తగ్గనుందని 'భారతదేశంలో మహిళలు-పురుషులు 2023' నివేదిక వెల్లడిస్తోంది. దీనికంటే ఆందోళన కలిగించే విషయం ఏమిటంటే%ౌ% ద్విచక్ర వాహన ప్రమాదాలలో చనిపోతున్న వారిలో ఎక్కువమంది యువతే కావడం. రాష్ట్రంలో 99 శాతం మంది హెల్మెట్ ధరించకుండా బైక్‌లు నడుపుతున్నారని, హెల్మెట్ ధారణ తప్పనిసరి చేయాలని ఎ.పి హైకోర్టు గతంలోనే స్పష్టం చేసింది. తాజాగా 'హెల్మెట్ పెట్టుకోకపోవడం వల్ల ప్రమాదాలు పెరుగుతున్నాయని, గత జూన్ నుంచి సెప్టెంబర్ మధ్యకాలంలో హెల్మెట్ ధరించకపోవడం వల్ల రాష్ట్రంలో 667 మంది చనిపోయారని' తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. హెల్మెట్ వినియోగించేలా చేయడంలో పోలీసులు కఠినంగా వ్యవహరించకపోవడం వల్లే అంతమంది చనిపోయారని, పోలీసుల అలసత్వం వల్లే ఈ పరిస్థితి నెలకొందని హైకోర్టు వ్యాఖ్యానించింది. ఒక పరిమితి వరకే బండి వేగం మన చేతుల్లో వుంటుంది. ఆ పరిమితి దాటితే ఆ వేగాన్ని కంట్రోల్ చేయడం కష్టం. వేగాన్ని నియంత్రించుకోలేకపోతే అది ప్రమాదానికి దారితీస్తుంది. ద్విచక్ర వాహనదారులు కచ్చితంగా హెల్మెట్ పెట్టుకోవాలని 'మోటారు వాహనాల చట్టం 1998లోని 129, 177 సెక్షన్లు చెబుతున్నాయి. దీని ప్రకారం జరిమానా విధించడమే కాదు, డ్రైవింగ్ లైసెన్స్ రద్దు చేసే అవకాశం కూడా వుంటుంది. మనం ప్రయాణించే రోడ్డు రేస్ ట్రాక్ కాదు. వాహనం ఎక్కగానే రేసింగ్ మూడ్‌లోకి వెళ్లిపోవడం వల్ల కోరి ప్రమాదాన్ని తెచ్చుకోవడమే అవుతుంది. టైర్లు, బ్రేకులు, బైక్ కండిషన్ పట్ల శ్రద్ధ పెట్టాలి. చాలావరకు రోడ్డు ప్రమాదాలు, టైర్లు, బ్రేకులు విఫలమవడం వల్లనే జరుగుతాయి. హెల్మెట్ ధరిస్తే ప్రాణాలు కోల్పోకుండా కనీసం గాయాలతోనైనా బయటపడే అవకాశం వుంటుంది. హెల్మెట్లు ప్రమాదాలలో మరణాన్ని నివారించగలవు, నిరోధించగలవు. అయితే, అది మాత్రమే చాలదు. బైక్ నడిపేటప్పుడు నిర్లక్ష్యంగా వ్యవహరించడం మీకే కాదు, తోటి ప్రయాణీకులకు కూడా ప్రమాదమేనన్న విషయం గుర్తించాలి. డ్రైవింగ్‌లో దరి చేరనివ్వకు నిర్లక్ష్యం. హెల్మెట్ ధరించి నిలుపుకో నీ ప్రాణం.

# దేశ ఐక్యత మా ప్రాధాన్యత.. అందుకే ఆర్టికల్ 370 రద్దు చేశాం



దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా పార్లమెంటులో రాజ్యాంగం సాధించిన విజయాలపై చర్చ జరిగింది. ఈ సందర్భంగా లోక్‌సభలో ప్రధాని నరేంద్ర మోదీ ప్రసంగించారు. దేశంలోని భిన్నత్వంలో ఏకత్వం, ఏకత్వమే రాజ్యాంగ ప్రాతిపదికగా ప్రధాని అభివర్ణించారు. భిన్నత్వం, ఏకత్వం మన అనాదిగా వస్తున్న సంప్రదాయాలు, సంస్కృతిలో భాగమని అన్నారు. మనలో మనం ఐక్యంగా ఉండాలని మన రాజ్యాంగం నేర్పిందని ప్రధాని మోదీ అన్నారు. తన ప్రసంగం ప్రారంభంలో, బాబా సాహెబ్ అంబేద్కర్ ప్రకటనను చదివి, దేశప్రజలకు ఐక్యతా సందేశాన్ని అందించారు. 75 ఏళ్ల రాజ్యాంగం సాధించిన ఈ ఘనత అసాధారణమని ప్రధాని మోదీ అన్నారు. దేశ సమైక్యత నేపథ్యంలో రాజ్యాంగ పరిషత్‌లో భాగమైన ఆ ముగ్గురు మహానుభావుల ప్రకటనను ప్రధాని చదివి వినిపించారు. దీనికి సంబంధించి పురుషోత్తం దాస్ టాండన్, డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్, డాక్టర్ భీంరావు అంబేద్కర్‌ల ప్రకటనలను ఆయన చదివి వినిపించారు. రాజ్యాంగ పరిషత్‌లో భీమ్‌రావ్ అంబేద్కర్ అన్నారని - ప్రజాస్వామ్యం అంటే ఏమిటో భారతదేశానికి తెలియదని కాదు. భారతదేశంలో అనేక రిపబ్లిక్‌లు ఉండే కాలం. రాజ్యాంగ నిర్మాతలకు దేశ సమైక్యత తొలి ప్రాధాన్యత అని, అందుకే మా ప్రభుత్వం ఆర్టికల్ 370ని తొలగించిందని, తద్వారా దేశంలో ఐక్యత కనిపిస్తోందని ప్రధాని మోదీ అన్నారు. ఆర్టికల్ 370 దేశ సమైక్యతకు గోడగా మారిందని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. భారతదేశ ఐక్యతను బలోపేతం చేయడానికి నిరంతరం కృషి చేస్తున్నామని ఆయన అన్నారు. ఆర్టికల్ 370 దేశ సమైక్యతకు గోడలా మారింది. అందుకే రద్దు చేశామని, 'దేశ ఐక్యత మా ప్రాధాన్యత' అని ప్రధాని అన్నారు. ఆర్టికల్ 370ను 5 ఆగస్టు 2019న రద్దు చేయడం జరిగింది. ఇది కాకుండా, వన్ నేషన్ వన్ హెల్త్ కార్డ్- ఆయుష్మాన్ సేవా కార్డ్ అమలు చేయబడింది మరియు దేశంలోని సుదూర ప్రాంతాల్లో విద్యుత్ వ్యవస్థను బలోపేతం చేయడానికి వన్ నేషన్, వన్ గ్రిడ్ అమలు చేయడం జరుగుతుందన్నారు. 2014 తర్వాత ప్రజలు సులభంగా ఆహార ధాన్యాలు పొందాలని నిర్ణయించుకున్నారని చెప్పారు. వీలైనంత ఎక్కువ మందికి రేషన్ అందించేందుకు ఏర్పాట్లు చేశామన్నారు. దీన్ని అందుబాటులోకి తీసుకురావడానికి, వన్ నేషన్-వన్ రేషన్ కార్డ్ ప్రారంభించినట్లు ప్రధాని మోదీ తెలిపారు. ప్రస్తుతం దేశం మొత్తం ఒకే దేశం-ఒకే రేషన్ కార్డు వ్యవస్థ అమలులో ఉంది. ఇంతకు ముందు ఇలాంటి వ్యవస్థ లేదని మోదీ తెలిపారు. రాజ్యాంగాన్ని రూపొందించిన వారే వారసత్వ సంపదను కాపాడుకున్నారన్నారు. రాజ్యాంగ నిర్మాతల భావాలకు అనుగుణంగా జీవించిన వారు అభినందనలకు అర్హులని ప్రధాని మోదీ అన్నారు. మన రాజ్యాంగ నిర్మాతలకు భారతదేశపు వేల సంవత్సరాల సాంస్కృతిక వారసత్వం గురించి తెలుసు. అర్థం చేసుకున్నారు. రాజ్యాంగాన్ని రూపొందించే సమయంలో దీనిపై పూర్తి జాగ్రత్తలు తీసుకున్నారు. భారతదేశ చరిత్ర,ప్రజాస్వామ్యం చాలా గొప్పది, అందుకే దీనిని ప్రజాస్వామ్య మాత అని పిలుస్తారని మోదీ అన్నారు. నేటికి రాజ్యాంగం 75 ఏళ్లు పూర్తి చేసుకుంటున్నదని, అయితే మన దేశంలో 25 ఏళ్లు, 50 ఏళు కూడా ముఖ్యమని, అయితే ఏం జరిగిందో గుర్తుంచుకోవాలన్నారు. మన దేశంలో ఎమర్జెన్సీ విధించారు. రాజ్యాంగాన్ని లాక్కున్నారు. రాజ్యాంగ ఏర్పాట్లు రద్దు చేశారు. పౌరుల హక్కులను దోచుకున్నారు. కాంగ్రెస్ నుదుటిపైన ఈ పాపం ఎప్పటికీ చెరిగిపోదని ప్రధాని మోదీ గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో న్యాయవ్యవస్థ రెక్కలు తెగిపోయాయని ప్రధాని మోదీ అన్నారు. ఇందిరాగాంధీ ప్రభుత్వం హయాంలో ముఖంపై రక్తం కారుతోంది, ఆపేవారు లేరు. అందువల్ల, ఇందిరా గాంధీ ఎన్నికను అనైతిక కారణాల వల్ల కోర్టు తిరస్కరించడంతో, ఆమె ఎంపీ పదవిని వదిలివేయవలసి వచ్చిందన్నారు. అప్పుడు ఆమె ఆగ్రహంతో దేశంలో ఎమర్జెన్సీని విధించారని మోదీ గుర్తు చేశారు. నెహ్రూ నుంచి మన్మోహన్ సింగ్ వరకు కాంగ్రెస్ ప్రధానులు రిజర్వేషన్లపై దాడి చేశారని అన్నారు.

నేటి శుభోదయ
ప్రతి క్షణం - ప్రజల కోసం
తెలుగు దినపత్రిక

## సంపాదకీయం

# 'జమిలి'కి ఎన్నో చిక్కులు, సవాళ్లు

## (విశ్లేషణ)

జమిలి ఎన్నికలకు సంబంధించిన రెండు బిల్లులకు కేంద్ర కేబినెట్ గురువారం ఆమోదం తెలిపిన సంగతి తెలిసిందే. ప్రస్తుతానికి లోక్‌సభ, రాష్ట్రాల అసెంబ్లీలకు ఏకకాలంలో ఎన్నికలను నిర్వహించే బిల్లులనే ప్రభుత్వం తీసుకొస్తున్నట్టు సమాచారం. స్థానిక సంస్థల ఎన్నికలపై తరువాత నిర్ణయం తీసుకునే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది. రామ్‌నాథ్ కోవింద్ కమిటీ సిఫార్సుల ప్రకారం లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికలతో పాటు స్థానిక సంస్థల ఎన్నికలనూ నిర్వహించాల్సి ఉంది. అయితే స్థానిక సంస్థల ఎన్నికల విషయం ప్రస్తుతానికి పక్కనపెట్టి లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికలపై తీసుకొచ్చిన బిల్లులకు కేబినెట్ ఆమోదం తెలిపింది. దీనికి 50 శాతం రాష్ట్రాల ఆమోదం తెలపవలసిన అవసరం లేదని చెబుతున్నారు.స్థానిక సంస్థల ఎన్నికలను కూడా ఒకేసారి నిర్వహించాలంటే రాజ్యాంగ సవరణతోపాటు 50 శాతం రాష్ట్రాలు ఆమోదించవలసి వస్తుంది. ఈ జమిలి ఎన్నికలకు దేశంలో 32 పార్టీలు అనుకూలంగా ఉన్నాయి. 15 పార్టీలు వ్యతిరేకిస్తున్నాయి. దీని వల్ల స్థానిక, ప్రాంతీయ అంశాలు పక్కకు పోయి జాతీయ అంశాలదే పైచేయి అవుతుందని ప్రాంతీయ పార్టీలు ఆందోళన చెందుతున్నాయి. ఈ నేపథ్యంలో జమిలి ఎన్నికల సాధ్యాసాధ్యాలపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. వన్ నేషన్, వన్ ఎలక్షన్ ప్రక్రియ ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని ఎవరెంత మొత్తుకున్నా ప్రధాని మోడీ పట్టించుకోలేదు. జమిలి ఎన్నికల ఆలోచన వెనుక ఆంతర్యం ఏమిటి? అని ప్రశ్నించుకుంటే 2015నాటి ఓ సర్వే ప్రకారం ఏకకాలంలో లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికలు జరిగితే 77 శాతం ఓటర్లు రెండింటా ఒకే పార్టీకి ఓటు వేస్తారని తేలింది. దీన్ని దృష్టిలో ఉంచుకునే బిజెపి నేతలు జమిలి ఎన్నికలను తెరపైకి తీసుకువస్తున్నారని ఒక అంచనా. దేశమంతటా డబుల్ ఇంజన్ సర్కారుకై తహతహలాడుతున్న బిజెపి ఓటర్ల తాలూకు ఈ ఏకకాలపు ఎన్నికల మనస్తత్వం కలిసొస్తుందని బిజెపి ఆశపడుతోంది. నిజానికి ఏకకాలంలో ఎన్నికలు అనేవి మన దేశానికి కొత్తేమీ కావు. 195152లో మొదటి జనరల్ ఎలక్షన్ల నుంచి లోక్‌సభ , రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలు ఒకేసారి జరుగుతుండేవి. అయితే కాలవ్యవధి పూర్తికాకుండానే రాష్ట్ర అసెంబ్లీలు రద్దవడం ఎప్పుడైతే మొదలైందో, అప్పుడు 1967 తర్వాత నుంచి ఎన్నికల కథ మారిపోయింది. 2020 నవంబర్ 26 న జరిగిన అఖిల భారత సభాధ్యక్షుల సమావేశంలోనూ ప్రధాని మోడీ జమిలి ఎన్నికల అమలు తప్పనిసరి అని స్పష్టం చేశారు. లోక్‌సభకు, విధాన సభకు, స్థానిక సంస్థలకు ఒకేసారి ఎన్నికలు జరిగితే ప్రభుత్వానికి ఆర్థిక భారం చాలా వరకు తగ్గుతుందని, ఎన్నికల ఆంక్షలు పదేపదే అడ్డుతగలకుండా అభివృద్ధి పథకాలను సజావుగా అమలు చేయడానికి వీలవుతుందని అభిప్రాయం వెలిబుచ్చారు. ఎన్నికల నియమావళి అమలుతో ప్రభుత్వ పథకాలు నిలిచిపోతాయన్నది వాస్తవమే అయినా ఈ సమస్యను పరిష్కరించడానికి జమిలి ఎన్నికలే శరణ్యం అనుకోవడం సమంజసం కాదని రాజ్యాంగ నిపుణులు హెచ్చరిస్తున్నారు. ప్రస్తుత రాజకీయ పరిస్థితుల బట్టి శాసనసభల్లో అధికార పక్షాలు అధికారంలో ఉండే అవకాశాలు తక్కువగా ఉంటున్నాయి. శాసనసభ్యుల ఫిరాయింపుల వల్ల అవి మెజారిటీ కోల్పోయి, కూలిపోయే అవకాశాలే ఎక్కువగా తటస్థపడుతున్నాయి. ఏ ఒక్కపార్టీ తగిన మెజారిటీతో ప్రభుత్వాన్ని నెలకొల్పే అవకాశం లేనప్పుడు కొద్ది కాలం రాష్ట్రపతి పాలన విధించినా, ఆ తర్వాత ఎన్నికలు నిర్వహించడం తప్పనిసరి అవుతుంది. అంతేకాదు ఒక్కో రాష్ట్ర అసెంబ్లీ పదవీకాలం ఒక్కోసారి ముగింపుకి చేరుకుంటుంది. అలాంటప్పుడు లోక్‌సభ ఎన్నికలు జరిగేవరకు ఆ రాష్ట్రంలో రాష్ట్రపతి పాలన విధించి కొనసాగించడం ప్రజాస్వామిక ప్రక్రియకు తీవ్ర విఘాతం కలుగుతుందని రాజ్యాంగ నిపుణులు చెబుతున్నారు. అయితే ఈమేరకు రాజ్యాంగ సవరణలు చేయడానికి మోడీ ప్రభుత్వం సిద్ధమవుతోంది. ప్రస్తుత రాజ్యాంగ నిబంధనల ప్రకారం రాజ్యాంగం 83వ ఆర్టికల్ రాజ్యసభ పూర్తిగా రద్దు కావడమనేది లేకుండా చూస్తుంది. రాజ్యాంగ 85 వ అధికరణ పార్లమెంటను సమావేశ పర్చుడం, సమావేశాలను ముగించడానికి సంబంధించినది. ఏడాదిలో కనీసం రెండు సార్లయినా పార్లమెంట్‌ను సమావేశపర్చాలని ఈ అధికరణ చెబుతోంది. అంటే ప్రతి రెండు సమావేశాల మధ్య వ్యవధి ఆరు మాసాలకు మించరాదు. ఆర్టికల్ 172 ఎమర్జెన్సీ పొడిగింపునకు సంబంధించింది. ఆర్టికల్ 175 రాష్ట్ర శాసన సభలను ఉద్దేశించి గవర్నర్ ప్రసంగించడం, వాటికి సందేశాలను పంపించడాన్ని నిర్దేశిస్తుంది. 356 అధికరణ రాష్ట్రాల్లో కల్లోల పరిస్థితులు ఏర్పడినప్పుడు వాటిని నివారించడంలో ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమైనప్పుడు కేంద్రం జోక్యం చేసుకుని అక్కడి పరిస్థితులను చక్కదిద్దడానికి వీలు కల్పిస్తుంది.ఇప్పుడు ఈ అన్ని అధికరణాలను తగు రీతిలో సవరిస్తే కానీ జమిలి ఎన్నికలు అమలు చేయడం సాధ్యం కాదు. ప్రపంచంలో జమిలి ఎన్నికల సంప్రదాయం బెల్జియం, స్వీడన్, దక్షిణాఫ్రికాలో ఉంది. ఇదిలా ఉండగా లోక్‌సభ ఎన్నికల నిర్వహణకు కేంద్రానికి రూ. 4 వేల కోట్లు వరకు ఖర్చవుతుందని గణాంకాలు చెబుతున్నాయి. ఇక అసెంబ్లీ ఎన్నికల ఖర్చు వేరుగా ఉంటోంది. ప్రభుత్వ అధికారిక వ్యయం కాకుండా వివిధ పార్టీలు, అభ్యర్థులు చేసే ఖర్చు అనేక రెట్లు ఉంటుందని ఇప్పుడు జమిలి ఎన్నికలు అమలులోకి వస్తే అంత చాలా వరకు తగ్గుతుందని బిజెపి, దాని మిత్రపక్షాలు చెబుతున్నాయి. అంతేకాకుండా పరిపాలన కుంటుపడకుండా నివారించవచ్చని భరోసా ఇస్తున్నాయి.. ఏదేమైనా ఈ జమిలి ఎన్నికల నిర్వహణ ఎన్నో చిక్కులు, సవాళ్లతో ముడిపడి ఉందన్నది వాస్తవం.

# 300 ఏళ్ల నాటి సంభాల్ శివాలయం..
# 46ఏళ్ళుగా ఎందుకు క్లోజ్ చేశారు? ఎంత స్థలం ఆక్రమణకు గురైందో తెలుసా..!





ప్రస్తుతం అందరి దృష్టి సంభాల్ ప్రాంతంలో వెలుగులోకి వచ్చిన శివాలయం మీదనే ఉంది. ఈ ఆలయం 1978లో అల్లర్లు జరిగిన తర్వాత ముసి వేయబడింది. అంతకు ముందు ఈ ప్రాంతంలో 42 హిందూ కుటుంబాలు నివసించేవి. 1978లో అల్లర్లు జరిగిన తర్వాత హిందూ కుటుంబాలు క్రమంగా ఈ ప్రాంతం నుంచి వలస వెళ్ళిపోయాయి. తర్వాత ఆలయాన్ని ఆక్రమించి గుడి పైభాగంలో ఉన్న బాల్కనీలను ఆక్రమణదారులు తొలగించారు. ఆలయ ప్రదక్షిణ మార్గం కూడా ఆక్రమణకు గురైంది. ఉత్తరప్రదేశ్‌లోని సంభాల్‌లో 46 ఏళ్లుగా మూతపడిన శివాలయాన్ని అధికారులు తెరిచారు. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం ఈ ఆలయ ఆక్రమణలపై సమాచారం అందుకున్న పరిపాలన బృందం సంఘటనా స్థలానికి చేరుకున్నారు. అప్పుడు ఈ పురాతన ఆలయం వెలుగులోకి వచ్చింది. పోలీసులు ఆలయాన్ని శుభ్రం చేశారు. ఆలయంలో శివలింగంతో పాటు హనుమాన్ విగ్రహం కూడా ఉంది. అంతేకాదు ఈ ఆలయ ప్రాంగణంలో ఒక పురాతన బావి కూడా ఉన్నట్లు పరిశోధనకారులు గుర్తించారు. అక్కడ జరిపిన తవ్వకంలో మరో మూడు విగ్రహాలు వెలుగులోకి వచ్చాయి. సంభాల్‌లోని ఖగ్గు సరాయ్ ప్రాంతంలోని ఈ ఆలయన్ని కార్తీక శంకర ఆలయంగా గుర్తించారు. అంతేకాదు ఈ ఆలయం సుమారు 300 సంవత్సరాల నాటిదని చెబుతున్నారు. అప్పటి సంఘటనలను గుర్తుచేసుకుంటూ 82 ఏళ్ల విష్ణు శరణ్ రస్తోగి ఈ ప్రాంతం గతంలో హిందువుల ఆధిపత్యంలో ఉండేదని.. ఈ కార్తీక శంకర ఆలయం హిందువుల విశ్వాసానికి కేంద్రంగా ఉందని చెప్పారు. అయితే 1978 అల్లర్ల తర్వాత హిందూ కుటుంబాలు ఈ ఆలయంలో పూజలు చేయడం మానివేశాయన్నారు.

### హిందువులు ఎందుకు వలస వెళ్ళారంటే..

కొన్ని వంటల ఏళ్ల క్రితం పూర్వీకులు ఈ ఆలయాన్ని నిర్మించారని విష్ణు శరణ్ రస్తోగి (82 సంవత్సరాలు) చెప్పారు. ఈ ఆలయానికి దగ్గరలో ఒక రావి చెట్టు ఉంది. ఒక బావి కూడా ఉంది. ప్రజలు ఉదయం, సాయంత్రం ఆలయానికి వచ్చి దర్శనం చేసుకునేవారు. బావి దగ్గర దేవుడిని తలచుకుంటూ కీర్తనలు చేసేవారని చెప్పారు విష్ణు విష్ణు శరణ్. అయితే 1978లో ఈ ప్రాంతలో అల్లర్లు జరిగాయి. అప్పుడు హిందువులు భయంతో ప్రాణాలను అరచేతిట్లో పెట్టుకుని ఈ ప్రాంతం నుంచి పారిపోయారు. చుట్టుపక్కల ముస్లిం జనాభా ఉండడంతో భయంతో ఇక్కడ నుంచి వలస వెళ్లిపోయారు. విష్ణు శరణ్ రస్తోగి ఈ ప్రాంతం గురించి ఇంకా అనేక విషయాలను పంచుకున్నారు. ఈ ప్రాంతంలో 40 నుంచి 42 హిందూ కుటుంబాలు నివసిస్తుండేవని.. సమీపంలోనే ముస్లిం కుటుంబాలు నివసిస్తూ ఉండేవారని చెప్పారు. అందరిలో సోదరభావం చాలా ఉండేది. ఆలయంలో అన్ని మత సంప్రదాయాలు జరిగాయని చెప్పారు. ఈ ప్రాంతంలోని తమ పూర్వీకులకు సంబంధించిన చివరి ఇల్లు 2005లో అమ్మివేసినట్లు తెలిపారు.





ఆలయం చుట్టూ 4 అడుగుల మేర ప్రదక్షిణ మార్గం ఉండేది.

విష్ణు శరణ్ ఈ ఆలయం గురించి ఇంకా అనే విషయాలను పంచుకున్నారు. ఈ ఆలయంలో పూజ చేయడానికి, హారతి ఇవ్వడానికి ఎవరూ మిగిలి లేరు. తమ ఇంటిని కూడా ముస్లిం కుటుంబానికి అమ్మేశామని చెప్పారు. అనంతరం స్థానికులు గుడి పైభాగంలో బాల్కనీలు తీశారు. ఆలయం చుట్టూ 4 అడుగుల ప్రదక్షిణ మార్గం ఉండేది. అయితే గుడి ముందు భాగం మినహా మూడు వైపులా ఆక్రమణకు గురైందని అన్నారు.గుడి తాళం తమ కుటుంబం వద్దే ఉందని.. ఆ ఆలయ నిర్వహణ తమ కుటుంబానికే చెందింది. అయితే తాము ఆ గుడిని తెరవలేదు, పూజలు చేయలేదు. 40 ఏళ్ల క్రితమే గుడిలో పూజలు చేసేందుకు పూజారిని ఏర్పాటు చేశానని .. అయితే ఆ పూజారికి గుడికి వెళ్లే ధైర్యం చేయలేదు.. ముందు ఆ పుజారీ గుడిలో పూజ చేయడానికి రెండు మూడు రోజులు వెళ్ళాడు.. ఆ తర్వాత ఆ పుజారీ గుడికి వెళ్లి పూజ చేయడనికి నిరాకరించాడని చెప్పారు. ఆక్రమణదారులు బావిని మూసివేశారని, కారు పార్క్ చేసేందుకు దానిపై ర్యాంప్‌ను ఏర్పాటు చేశారని విష్ణు శరణ్ చెప్పారు. గుడి కోసం భూమి తమ కుటుంబం ఇచ్చిందని అన్నారు. ఈ గుడి సుమారు 300 సంవత్సరాల క్రితం నుంచి ఉందని.. కాలక్రమంలో ఈ ప్రాంతంలో హిందువులు తక్కువ అవడంలో ఆలయంలో పూజలు ఆగిపోయాయని తెలిపారు.

# కొరుకుడుపడని కొయ్యగా మారిన దేశ రాజధాని..
# ఈసారైనా కమలనాథుల కల నెరవేరేనా..?

భారతీయ జనతా పార్టీ కేంద్రంలో వరుసగా మూడోసారి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయగలిగింది. కానీ దేశ రాజధాని ఢిల్లీలో మాత్రం మూడు దశాబ్దాలుగా అధికారం ఆ పార్టీకి అందని ద్రాక్షగా మిగిలిపోయింది. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్, ఆమ్ ఆద్మీ పార్టీ కలిసి పోటీ చేసినా సరే క్లీన్ స్వీప్ చేసిన కమలదళం అసెంబ్లీ ఎన్నికలు వచ్చేసరికి చతికిలపడుతోంది. చివరిసారిగా 1993లో గెలుపొందిన ఆ పార్టీ, మళ్లీ ఇప్పటి వరకు అధికారం చేజిక్కించుకోలేకపోయింది. మరో రెండు నెలల్లో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో ఈసారి ఎలాగైనా గెలిచి తీరాలన్న పట్టుదలతో కమలదళం ఉంది. బీజేపీకి సైద్ధాంతిక మాతృసంస్థ 'రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ ' కూడా రంగంలోకి దిగి బీజేపీ గెలుపు కోసం వ్యూహాలు అమలు చేస్తోంది. వరుసగా రెండు పర్యాయాలు గెలిచి అధికారంలో ఉన్న ఆమ్ ఆద్మీ పార్టీ ను ఈ సారి ఎలాగైనా నిలువరించాలి ప్రయత్నిస్తోంది. ఈ క్రమంలో పార్టీ ఓటుబ్యాంకును కాపాడుకోవడంతో పాటు సామాజిక సమీకరణాలు, భావోద్వేగ అంశాలను తెరపైకి తెస్తోంది. మరోవైపు బీజేపీ, దాని అనుబంధ సంఘాలు, సంఘ్ పరివార్ ఢిల్లీలోని ప్రతి ఇంటినీ చుట్టేసే ప్రయత్నాలు చేస్తున్నాయి. తాజాగా జరిగిన 4 రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో హర్యానా, మహారాష్ట్రలో అనూహ్య విజయం సాధించిన కమలదళం ఇప్పుడు ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లోనూ గెలుపొంది దశాబ్దాలుగా అందకుండా పోతున్న అధికార పీఠాన్ని కైవసం చేసుకోవాలని చూస్తోంది. ఎన్నికల తేదీలు ఇంకా ప్రకటించక ముందే అభ్యర్థుల ఎంపికకు సంబంధించిన ప్రాథమిక కసరత్తు ఇప్పటికే పూర్తిచేసింది. త్వరలోనే మొత్తం 70 స్థానాలకు అభ్యర్థులను ప్రకటించేందుకు ఏర్పాట్లు చేసుకుంటోంది.

పకడ్బందీగా అభ్యర్థుల ఎంపిక

ఏ పార్టీకైనా తమ సొంత బలానికి తోడు అభ్యర్థుల బలం కూడా తోడైతేనే విజయం వరిస్తుంది. అందుకే అన్ని రాజకీయ పార్టీలు బలమైన అభ్యర్థుల కోసం గాలం వేస్తుంటాయి. ఈ క్రమంలోనే పార్టీ ఫిరాయింపులు జరుగుతున్నాయి. ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల విషయంలో భారతీయ జనతా పార్టీ అభ్యర్థుల ఎంపికపై తీవ్ర కసరత్తు చేసింది. క్షేత్రస్థాయిలో బలమైన ముద్ర, ఓటర్లలో ఆదరణ కలిగిన నేతలకు టికెట్ ఇవ్వాలని నిర్ణయించినట్టు తెలిసింది. అలాగే వరుసగా 2 పర్యాయాలు ఓడిపోయిన నేతలకు ఈసారి టికెట్ ఇవ్వడం లేదు. మరోవైపు మీనాక్షి లేఖి, పర్వేశ్ వర్మ, రమేశ్ బిధూరి వంటి నగరవ్యాప్త ప్రభావం కలిగిన సీనియర్ నేతలను ఆమ్ ఆద్మీ పార్టీ కి వ్యతిరేకంగా ఎన్నికల వాతావరణాన్ని తయారుచేయగలరని అధినాయకత్వం



భావిస్తోంది. ఎన్నికల ప్రచారంలో వారికి కీలక బాధ్యతలు అప్పగించే అవకాశాలున్నాయి. వారితో పాటు ఆమ్ ఆద్మీ పార్టీని వీడి బీజేపీలో చేరిన రాష్ట్ర మాజీ మంత్రి కైలాష్ గెహ్లోట్‌కు జాట్ సామాజికవర్గంలో గట్టి పట్టుంది. ఆయనను నజఫ్‌గఢ్ నుంచి బరిలోకి దించే అవకాశాలున్నాయి. మాజీ ముఖ్యమంత్రి మదన్‌లాల్ ఖురానా కుమారుడు హరీష్ ఖురానాను మోతీనగర్ నుంచి పోటీ చేయించవచ్చు. మొత్తం 70 అసెంబ్లీ స్థానాల్లో యువ నాయకత్వాన్ని ప్రోత్సహించడంతో పాటు కొత్త ముఖాలను పరిచయం చేయడం కోసం సగం స్థానాలను కొత్తవారికి కేటాయించనున్నట్టు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. అంటే కనీసం 35 స్థానాల్లో కొత్త అభ్యర్థులు బరిలోకి దిగే అవకాశాలున్నాయి. హర్యానా, మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో "చావో రేవో" అన్నట్టుగా శ్రమించిన కమలదళం.. ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలను అంతకంటే సీరియస్‌గా తీసుకుని పోరాడాలని చూస్తోంది.

కోర్ ఓట్‌బ్యాంకు విస్తృతికి వ్యూహం

ఢిల్లీలో భారతీయ జనతా పార్టీకి అసెంబ్లీ ఎన్నికల్లో 30 శాతాన్ని మించిన ఓటుబ్యాంకు ప్రతిసారీ ఉంటోంది. నగరంలోని వ్యాపారవర్గాలు బీజేపీకి ఎల్లవేళలా మద్ధతుగా నిలుస్తున్నారు. వారితో పాటు విద్యాధిక వర్గాలు, కొన్ని సామాజికవర్గాలు బీజేపీకి బలమైన ఓటుబ్యాంకుగా నిలిచాయి. అయితే ప్రత్యర్థి ఆమ్ ఆద్మీ పార్టీ ఏకంగా 50 శాతాన్ని మించి ఓటుబ్యాంకు కైవసం చేసుకుంటున్నప్పుడు ఈ బలం సరిపోదు. అందుకే ఈసారి ఓటుబ్యాంకును విస్తరించుకోవడంపై కమలనాథులు దృష్టి పెట్టారు. తమ ఓటుబ్యాంకు చేజారకుండా కాపాడుకోవడం ఒకెత్తయితే.. కొత్త ఓటుబ్యాంకును సృష్టించుకోవడం మరో ఎత్తు. కొత్త ఓటుబ్యాంకు తయారు చేసుకోవాలి అంటే ప్రత్యర్థి ఓటుబ్యాంకును చెదరగొట్టి తమవైపు ఆకట్టుకోవాలి.ఢిల్లీలోని మురికివాడల్లో నివసించే పేద, నిరుపేద ఓటర్లు ఆమ్ ఆద్మీ పార్టీ (%ూూా%)కు బలమైన ఓటు బ్యాంకుగా ఉన్నారు. ఈ క్రమంలో ఢిల్లీలోని 1,194 బస్తీలు, మురికివాడల్లో రాత్రి పూట పార్టీ నేతలు గడిపేలా కార్యక్రమాలు రూపొందించారు. ఇప్పటికే పలువురు నేతలు బస్తీ నిద్రలు చేస్తున్నారు. తద్వారా బస్తీ ప్రజల సమస్యలు తెలుసుకుని, వారికి భరోసా కల్పించవచ్చని భావిస్తున్నారు. ఉచిత పథకాలకు ఆకర్షితులై ఆమ్ ఆద్మీ పార్టీకి ఓటేస్తున్నవారిలో ఇలాంటి బస్తీ ఓటర్లే ఎక్కువ సంఖ్యలో ఉన్నారని పార్టీ నాయకత్వం గ్రహించింది. అందుకే బస్తీ ఓటర్లను లక్ష్యంగా చేసుకుని వివిధ రకాల ప్రచార కార్యక్రమాలను రూపొందించుకుంది. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వారికి వివరించి చెప్పడంతో పాటు వారి అవసరాలకు తగ్గ హామీలను మేనిఫెస్టోలో చేర్చేందుకు ప్రయత్నిస్తోంది.

తెరవెనుక సంఘ్ వ్యూహాలు

ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల కోసం రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ హర్యానా, మహారాష్ట్రలో మాదిరిగా తెరవెనుక అనేక వ్యూహాలను అమలు చేస్తోంది. ఆరెస్సెస్ జాయింట్ జనరల్ సెక్రటరీ అరుణ్ కుమార్ ఢిల్లీలోనే మకాం పెట్టి అనేక సమావేశాలు నిర్వహించారు. బీజేపీ %-% ఆరెస్సెస్ మధ్య మెరుగైన సమన్వయం కోసం ప్రయత్నిస్తున్నారు. ఆమ్ ఆద్మీ పార్టీ అధినేత అరవింద్ కేజ్రీవాల్ స్థాయికి తగ్గ నేత ప్రస్తుతం ఢిల్లీ బీజేపీలో లేరని ఆరెస్సెస్‌కు కూడా తెలుసు. అయితే వరుసగా పదేళ్లు అధికారంలో ఉన్న ఆప్ సర్కారుపై ప్రజల్లో ఏర్పడ్డ వ్యతిరేకతను కేజ్రీవాల్‌పై అస్త్రంగా మలచుకోవాలని చూస్తోంది.ప్రజలకు పరిమిత యూనిట్ల వరకు ఉచిత కరెంట్, ఉచిత నల్లా నీరు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం వంటి ప్రజాకర్షక ఉచిత పథకాలతో ఓటర్లను ఆకట్టుకుంటూ రెండు పర్యాయాలు అధికారం సాధించిన ఆమ్ ఆద్మీ పార్టీ, రోడ్లు, మురుగునీటి నిర్వహణ, తాగునీటి సరఫరా విషయంలో విమర్శలు ఎదుర్కొంటోంది. ఢిల్లీ మద్యం పాలసీ అక్రమాల కేసు ద్వారా కేజ్రీవాల్‌పై ఇంతకాలం ఉన్న 'నీతి-నిజాయితీ' ముద్ర కూడా చెరిగిపోయింది. మరోవైపు కాంగ్రెస్ పార్టీ సైతం పునర్ వైభవం కోసం శ్రమిస్తోంది. ఢిల్లీలో ఆప్ ఎదుగుదల కాంగ్రెస్ పార్టీనే తీవ్రంగా దెబ్బతీసింది. ఆ పార్టీ ఓటుబ్యాంకు పూర్తిగా చెల్లాచెదురైపోయింది. ఈ సారి కాంగ్రెస్ పార్టీ ఆప్‌తో కలిసి పోటీ చేయడం లేదు. తద్వారా మైనారిటీలు, మరికొన్ని వర్గాల ఓట్లను కాంగ్రెస్ చీల్చడం కూడా బీజేపీకి కలిసొచ్చే అవకాశం ఉంది. వీటన్నింటినీ సద్వినియోగం చేసుకుంటే అధికారం చేజిక్కించుకోవడం కష్టమేమీ కాదని కమలదళం అంచనా వేస్తోంది.

# దేశంలో విప్లవాత్మక మార్పులు తీసుకొస్తున్న
# స్వచ్ఛ భారత్ మిషన్.. షాక్‌కు గురిచేస్తున్న గణాంకాలు!

మహాత్మా గాంధీ కలలుగన్న పరిశుభ్ర భారతావనిని సాధించడమే లక్ష్యంగా దేశవ్యాప్తంగా 'స్వచ్ఛ భారత్' కార్యక్రమాన్ని గాంధీ జయంతి సందర్భంగా 2014, అక్టోబర్ 2న ప్రధాని మోదీ స్వచ్ఛ భారత్ కార్యక్రమానికి పిలుపునిచ్చారు. స్వచ్ఛ భారత్ మిషన్ పదేళ్లుగా కొనసాగుతోంది. స్వచ్ఛభారత్ కార్యక్రమం దేశంలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చింది. స్వచ్ఛతతో పాటు ఆరోగ్యానికి వ్యాయామం లాంటిది అంటుంటారు ప్రధాని మోదీ.ఒక దశాబ్దం క్రితం భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్వచ్ఛ భారత్ అభియాన్‌ను ప్రారంభించినప్పుడు కేవలం ఐదుగురిలో ఒక్కరు మాత్రమే ఇప్పుడు సగానికి పైగా భారతీయ గృహాలు టాయిలెట్ క్లీనర్‌లను ఉపయోగిస్తున్నారు. ఇతర లక్ష్యాలతో పాటు, మరిన్ని మరుగుదొడ్లను నిర్మించడం, ఘన వ్యర్థ పదార్థాల నిర్వహణను మెరుగుపరచడం ద్వారా బహిరంగ మలవిసర్జన సమస్యను తొలగించడం మిషన్ లక్ష్యం.2014లో టాయిలెట్ క్లీనర్ల వినియోగం 19% శాతం, , ఫ్లోర్ క్లీనర్ల వాడకం 8% మాత్రమే. ఒక నివేదిక ప్రకారం, ఇది రెండింతలు పెరిగింది. 2024లో 53% కుటుంబాలు టాయిలెట్ క్లీనర్‌లను ఉపయోగిస్తున్నాయి. 22% ఫ్లోర్ క్లీనర్‌లను కొనుగోలు చేస్తున్నాయి. అంటే 128 మిలియన్లకు పైగా కొత్త కుటుంబాలు టాయిలెట్ క్లీనర్‌లను కొనుగోలు చేస్తున్నాయి. 52 మిలియన్ కుటుంబాలు ఫ్లోర్ క్లీనర్లను వినియోగిస్తున్నట్లు గణాంకాలు చెబుతున్నాయి.దాగి ఉన్న ప్రమాదాల గురించి వినియోగదారులను అప్రమత్తం చేయడం నుండి మెరుగైన పరిశుభ్రత పద్ధతుల గురించి అవగాహన కల్పించడం వరకు, %=వఎిఓ



దీవఅఎిఎిఅంవతీ, ఎఱఅఎబర్ఖుఅ ఖఅఱశ్రీవజవతీ, ఙుఎబతీ% వంటి బాత్రూమ్ పరిశుభ్రత ఉత్పత్తుల విక్రయదారులు కూడా సహకరిస్తున్నారు. "స్వచ్ఛ్ భారత్ అభియాన్ కింద గ్రామీణ గృహాల టాయిలెట్ల నిర్మాణం పరిశుభ్రత గురించి అవగాహన పెంచడంలో సహాయపడింది, తద్వారా శుభ్రపరిచే ఉత్పత్తుల అవసరం. దేశంలో పట్టణ ప్రాంతాల్లో హౌసింగ్ సెగ్మెంట్ వృద్ధి, అవగాహన ఉన్న కొనుగోలుదారుల సంఖ్య పెరుగుదల కారణమని డాబర్ మార్కెటింగ్ హెడ్ (హోమ్ కేర్) వైభవ్ రాఠి అభిప్రాయపడ్డారు.భారతదేశం ఉపరితల క్లీనర్ మార్కెట్ విలువ సుమారు రూ.4,200 కోట్లు అని మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి. ఇందులో టాయిలెట్ క్లీనర్ల వాటా రూ.2,000 కోట్లు. దశాబ్దం క్రితం ఈ వర్గం ఎక్కువగా నగర కేంద్రంగా ఉండేదని నివేదిక పేర్కొంది. అయితే ఇప్పుడు అందులో చాలా మార్పు వచ్చింది. ఒక దశాబ్దం క్రితం, టాయిలెట్ క్లీనర్‌లను కొనుగోలు చేసే గృహాలలో 82% పట్టణ ప్రాంతాల్లో ఉండేవి. ఫ్లోర్ క్లీనర్ల కోసం 90% మంది ఉన్నారు. ప్రస్తుతం గ్రామీణ ప్రాంతాల్లో 52% వినియోగదారులు పెరిగినట్లు వరల్డ్‌ప్యానెల్ విభాగం దక్షిణాసియా మేనేజింగ్ డైరెక్టర్ కె రామకృష్ణన్ అన్నారు. "స్పష్టంగా, స్వచ్ఛ భారత్ అభియాన్ భారతీయ ఇళ్లలో పరిశుభ్రత ప్రాముఖ్యతను పెంచింది. తయారీదారులు గృహ పరిశుభ్రత వర్గాల్లోకి రాణించడానికి దోహదపడింది. 2014లో ప్రారంభించినప్పటి నుండి, స్వచ్ఛ భారత్ అభియాన్ 5,00,000 గ్రామాలకు బహిరంగ మలవిసర్జన రహిత ప్లస్ హోదాను సాధించింది. గ్రామీణ పారిశుధ్యం 39% నుండి 100%కి పెరిగింది. ఇది కాకుండా, అక్షయ్ కుమార్ నటించిన టాయిలెట్ ఏక్ ప్రేమ్ కథ (2017) కూడా గ్రామీణ ప్రాంతాల్లో టాయిలెట్ల ఆవశ్యకతను దృష్టిలో ఉంచుకుని ఈ సందేశాన్ని ఇంటికి తీసుకెళ్లడానికి ప్రయత్నించింది. పరిశుభ్రత ఉత్పత్తులను విక్రయించే కంపెనీలు తమ కార్పొరేట్ సామాజిక బాధ్యతను పెంపొందించుకున్నాయి. ఉదాహరణకు, హిందుస్థాన్ యూనిలీవర్ 2016లో సువిధ కేంద్రాలుగా పిలవబడే కమ్యూనిటీ టాయిలెట్ బ్లాక్‌లను ప్రారంభించింది. ఇప్పుడు వాటి సంఖ్య 16కి కుదించుకుపోయింది. అంటే దీన్ని బట్టి పరిశుభ్రత పట్ల ప్రతిఒక్కరిలో అవగాహన పెరుగుతోంది


# పట్టు చీరలో సంయుక్త.. సో గోర్జియస్ గురూ!



మాలీవుడ్ బ్యూటీ సంయుక్త మీనన్ కు టాలీవుడ్ సినీ ఇండస్ట్రీలో ఎలాంటి క్రేజ్ ఉందో అందరికీ తెలిసిందే. తెలుగులో చేసింది తక్కువ సినిమాలే అయినా మంచి ఫేమ్ సంపాదించుకున్నారు. తనకంటూ ప్రత్యేక ఫ్యాన్ బేస్ ను సొంతం చేసుకున్నారు. వరుస హిట్స్ అందుకోవడం వల్ల గోల్డెన్ బ్యూటీ అనే ట్యాగ్ ను దక్కించుకున్నారు. మాలీవుడ్ మూవీ పాప్ కార్న్ తో సినీ ఇండస్ట్రీలోకి ఎంట్రీ ఇచ్చిన అమ్మడు.. ఆ తర్వాత వరుస చిత్రాల్లో నటించారు. తన యాక్టింగ్ తో అందరినీ మెప్పించారు. మూడేళ్ల క్రితం ఎరిడ చిత్రంతో కోలీవుడ్ లోకి ఎంట్రీ ఇచ్చారు. ఆ తర్వాత ఏడాది తెలుగు సినీ ప్రియులకు పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ భీమ్లా నాయక్ మూవీతో పలకరించారు సంయుక్త. అందులో టాలీవుడ్ హాల్క్ రానా భార్యగా కనిపించి మెప్పించారు. తన అందం, అభినయంతో అలరించారు. ఆ తర్వాత నందమూరి కళ్యాణ్ బింబిసారలో హీరోయిన్ గా ఛాన్స్ కొట్టేశారు. ఆ సినిమాతో మంచి హిట్ ను తన ఖాతాలో వేసుకున్నారు. అదే ఏడాది గాలిపట -2 మూవీతో శాండల్ వుడ్ లోకి కూడా సంయుక్త ఎంట్రీ ఇచ్చారు. ఇక బింబిసార హిట్ తో తెలుగులో వరుస అవకాశాలు అందుకున్నారు. సార్ మూవీతో ఆమె కెరీర్ మలుపు తిరిగిందనే చెప్పాలి. అందులో తన నటనతో ఫిదా చేశారు. ఆ తర్వాత సాయి దుర్గ తేజ్ విరూపాక్షతో కెరీర్ లోనే ది బెస్ట్ హిట్ ను అందుకున్నారు. అనంతరం డెవిల్ లో నటించినా.. అనుకున్న స్థాయిలో హిట్ సాధించలేకపోయారు. ఇప్పుడు చేతి నిండా సినిమాలతో బిజీగా ఉన్నారు. యంగ్ హీరో నిఖిల్ తో స్వయంభూ సినిమా చేస్తున్నారు. శర్వానంద్, బెల్లంకొండ శ్రీనివాస్ తో చెరో చిత్రంలో యాక్ట్ చేస్తున్నారు. వాటితో పాటు మరికొన్ని మూవీలను లైన్ లో పెట్టినట్లు తెలుస్తోంది. అయితే సినిమాలతో బిజీగా ఉన్నా.. సోషల్ మీడియాలో ఫుల్ యాక్టివ్ గా ఉంటారు. ఎప్పటికప్పుడు పర్సనల్ తోపాటు కెరీర్ విషయాలను షేర్ చేసుకుంటూ ఉంటారు. కొత్త కొత్త పిక్స్ ను పోస్ట్ చేస్తుంటారు. ఎక్కువగా చీరల్లో దిగిన ఫోటోస్ ను షేర్ చేస్తుంటారు. ట్రెడిషనల్ గా కనిపిస్తూనే మాయ చేస్తుంటారు. సింపుల్ అండ్ ప్లెయిన్ శారీస్ లో ఎక్కువగా ఫోటో షూట్ చేసి తన ఫ్యాన్స్ కు ట్రీట్స్ ఇస్తుంటారు అమ్మడు. తాజాగా కొత్త పిక్స్ ను షేర్ చేశారు. బనారస్ చీరలో అందాలు ఆరబోశారు. హెయిర్ లీవ్ చేసుకుని రకరకాల పోజులు ఇచ్చారు. సింపుల్ మేకప్ తో అందరినీ ఫ్లాట్ చేశారు. తన నవ్వు, చూపుతో మైండ్ బ్లాక్ చేశారు. సంయుక్త పిక్స్ నెట్టింట తెగ చక్కర్లు కొడుతుండగా.. ఫోటోలు చాలా బాగున్నాయని నెటిజన్లు చెబుతున్నారు. లైకులు కొడుతూ షేర్ చేస్తున్నారు. సో గోర్జియస్ సంయుక్త మేడం జీ అంటూ కామెంట్లు పెడుతున్నారు.



# తెల్ల గులాబీ.. మల్లె సొగసు.. ఆలియా స్టన్నింగ్!



ఓవైపు 'గ్రేటెస్ట్ షోమ్యాన్ ఆఫ్ ఇండియన్ సినిమా' రాజ్ కపూర్ 100వ పుట్టినరోజు వేడుకలను పురస్కరించుకుని కపూర్ కుటుంబం ఘనంగా సెలబ్రేషన్స్ నిర్వహిస్తోంది. ప్రధాని మోదీ సహా చాలామంది ప్రముఖులను ఈ కార్యక్రమానికి హాజరు కావాల్సిందిగా కపూర్ కుటుంబం ఆహ్వానించింది. అట్టహాసంగా మొదలైన ఈ వేడుకలో టాప్ సెలబ్రిటీలు పాల్గొన్నారు. / అయితే కోట్లాది మంది వీక్షించే ఈ ఈవెంట్ లో అలియా భట్ కొత్త రూపంతో తళుకులీనింది. తెల్లటి చీర ధరించిన ఆలియా చేతిలోకి తెల్ల గులాబీ అందుకుని సిగ్గులమొగ్గవుతూ కెమెరాలకు ఫోజులిచ్చింది. ఆలియా అరవిరిసిన తెల్ల గులాబీలా అందంగా ఉందంటూ ప్రశంసిస్తున్నారు. మల్లెపువ్వు చీరలో తెల్ల గులాబీ చిక్కుకుంది! అంటూ ఆలియా రూపానికి అద్భుతమైన కాంప్లిమెంట్లు ఇస్తున్నారు కొందరు. మొత్తానికి ఆలియా ఈ కొత్త లుక్ లో అందరి దృష్టిని ఆకర్షించింది. రాజ్ కపూర్ 100వ పుట్టినరోజు వేడుకల రెడ్ కార్పెట్ ఈవెంట్‌లో అలియా భట్ డిజైనర్ లుక్ కి అద్భుతమైన స్పందనలు వచ్చాయి. చాలామంది బాలీవుడ్ భామలు దీనిపై స్పందించారు. ఆలియా సోదరి షాహీన్ భట్ ఆమె అందంగా కనిపించిందని పేర్కొనగా, భూమి పెడ్నేకర్ అద్భుతంగా కనిపించావ్ అంటూ ప్రశంసించారు. రియా కపూర్ కూడా ఈ ఫోటోలను 'లవ్లీ' అని ట్యాగ్ చేసింది. ఒక తెల్ల చీర - అలియా భట్! అజేయమైన అమ్మాయి అంటూ ఆలియా గంగూబాయి కతియావాడి సినిమాను ప్రమోట్ చేస్తున్న విధానాన్ని ఎవరో ఒక అభిమాని గుర్తు చేసుకున్నారు. గంగూభాయిగా నటనకు ఆలియా జాతీయ చలనచిత్ర అవార్డును అందుకున్న సంగతి తెలిసిందే. మొత్తం కపూర్ కుటుంబం ఈ కార్యక్రమానికి హాజరు కాగా, ఆలియా తల్లిదండ్రులు మహేష్ భట్ - సోనీ రజ్దాన్ కూడా వేడుకలో పాల్గొన్నారు. ఆలియా సోదరి షాహీన్ కూడా తన తల్లిదండ్రులతో కలిసి వేడుకకు విచ్చేసింది. ఈవెంట్ రణబీర్ కపూర్ తన మామగారైన మహేష్ భట్ ని వేడుకలో హగ్ చేసుకుని పలకరించడం కనిపించింది. వీరితో పాటు కరీనా కపూర్, సైఫ్ అలీ ఖాన్, కరిష్మా కపూర్, నీతూ కపూర్, రిద్ధిమా కపూర్ షానీటు కరీనా కపూర్, సైఫ్ అలీ ఖాన్, కరిష్మా కపూర్, నీతూ కపూర్, రిద్ధిమా కపూ, రేఖ, విక్కీ కౌశల్, ఆదార్ జైన్, సంజయ్ లీలా భన్సాలీ, రితేష్ - జెనీలియా దేశ్‌ముఖ్, జాకీ భగ్నానీ, టైగర్ ష్రాఫ్, శర్వరి, హుమా ఖురేషీ, ఆదిత్య రాయ్ కపూర్, ఫర్హాన్ అక్తర్, ఆకాంక్ష మల్హోత్రా సహా చాలామంది ఈ కార్యక్రమానికి హాజరయ్యారు.



# రాశి ఖన్నా ఒంపుసొంపుల ఖిల్లా!



రాశి ఖన్నా తన కెరీర్ బెస్ట్ ఫేజ్ ని ఆస్వాధిస్తోంది. ఈ బ్యూటీ అగ్ర హీరోల సరసన అవకాశాలు దక్కించుకోలేకపోయినా కానీ నిరాశ చెందక తనవైపు వచ్చిన అవకాశాల్ని సద్వినియోగం చేసుకుంటోంది. ఇటీవలే %-%సబర్మతి రిపోర్ట్%-% లాంటి విమర్శకుల ప్రశంసలు పొందిన కాన్సెప్ట్ బేస్డ్ చిత్రంలో రాశీ నటించింది. అంతకుముందు రాజ్ అండ్ డీకే రూపొందించిన బ్లాక్ బస్టర్ సిరీస్ %-%ఫర్జీ%-%లో, సిద్ధార్థ్ మల్హోత్రా %-%యోధ%-%లోను తన నటనకు ప్రశంసలు అందుకుంది. ప్రస్తుతం వరుసగా క్రేజీ వెబ్ సిరీస్‌లు, సినిమాల్లో నటించేందుకు రాశీ సన్నాహకాల్లో ఉందని సమాచారం. సిద్ధు జొన్నలగడ్డ %-% తెలుసు కదా%-% అనే తెలుగు చిత్రంలో నటిస్తున్న రాశీ... టిఎంఇ (విక్రాంత్ మాస్సే) అనే హిందీ చిత్రంలోను నటిస్తోంది. %-%అగథియా%-% ప్రస్తుతం చిత్రీకరణలో ఉంది. టిఎంఇ, అగథియా కూడా కాన్సెప్ట్ బేస్డ్ చిత్రాలేనని తెలుస్తోంది. తమిళ చిత్రం అగథియాలో జీవా, అర్జున్ లాంటి స్టార్లతో కలిసి నటిస్తోంది. మరోవైపు రాశీ తనలోని గ్లామర్ ఎలివేషన్ తో టీజ్ చేయడంలో తగ్గేదే లే అంటోంది. ఇటీవల కొన్ని బోల్డ్ ఫోటోషూట్లతో అభిమానుల హృదయాలను కొల్లగొట్టింది ఈ బ్యూటీ. తాజాగా రాశీ ఖన్నా షేర్ చేసిన ఫోటోషూట్ వైరల్‌గా మారుతోంది. బ్లాక్ డ్రెస్ లో రాశీ ఒంపుసొంపుల వడ్డనలు యూత్ కి గిలిగింతలు పెడుతున్నాయి. రాశీ ఒంపు సొంపుల ఖిల్లా అదుర్స్ అంటూ యువతరంలో ఒకటే చర్చ సాగుతోంది. రాశీ అల్ట్రా స్టైలిష్ అవతార్ కి ఫ్యాన్స్ ఫిదా అయిపోతున్నారు. ప్రస్తుతం ఈ ఫోటోషూట్ అంతర్జాలంలో వైరల్ అవుతోంది.

# మోడ్రన్ అప్సరసలా రెజీనా మెరుపులు

సౌత్ లో గ్లామరస్ హీరోయిన్ గా తనకంటూ ప్రత్యేకమైన ఇమేజ్ సొంతం చేసుకున్న అందాల భామ రెజీనా కసాండ్ర. ఈ అమ్మడు 2005లో నటిగా కెరియర్ స్టార్ట్ చేసింది. అయితే 2010లో శివ మనసులో శృతి సినిమాతో టాలీవుడ్ లోకి ఎంట్రీ ఇచ్చింది. నెక్ట్స్ సందీప్ కిషన్ కి జోడీగా రొటీన్ లవ్ స్టోరీ అనే మూవీలో చేసింది. ఈ సినిమాలు ఆశించిన స్థాయిలో మెప్పించలేదు. అయితే రవితేజకి జోడీగా చేసిన 'పవర్', సాయి ధరమ్ తేజ్ మొదటి సినిమా 'పిల్లా నువ్వు లేని జీవితం' రెజీనాకి కమర్షియల్ బ్రేక్ ఇచ్చాయి. ఈ సినిమాల తర్వాత అమ్మడు వెనక్కి తిరిగి చూసుకోలేదు. వరుసగా తెలుగులో అవకాశాలు అందుకుంది. అలాగే మాతృభాష తమిళంలో కూడా మంచి ఛాన్స్ లు అందుకుంది. ఆమె చివరిగా తెలుగులో 'ఎవరు' అనే మూవీతో సూపర్ హిట్ అందుకుంది. ఆ తరువాత చెప్పుకోదగ్గ మూవీస్ పడలేదు. తమిళంలో కూడా వరుసగా సినిమాలు చేస్తోన్న స్టార్ హీరోలతో జోడీ కట్టే అవకాశాలు మాత్రం రావడం లేదు. రీసెంట్ గా తెలుగులో 'ఉత్సవం' అనే మూవీతో రెజీనా ప్రేక్షకుల ముందుకొచ్చింది. ఈ మూవీ పెద్దగా మెప్పించలేదు. అజిత్ 'విడాముయార్చి' సినిమాలో రెజీనా కీలక పాత్రలో నటించింది. హిందీలో గోపీచంద్ మలినేని దర్శకత్వంలో బాబీ డియోల్ హీరోగా తెరకెక్కుతోన్న 'జాట్' మూవీలో నటించింది. అలాగే 'సెక్షన్ 108', 'ఫ్లాష్ బ్యాక్' అనే హిందీ సినిమాలు పోస్ట్ ప్రొడక్షన్ దశలో ఉన్నాయి. ఇలా ఈ బ్యూటీ చేతిలో నాలుగు సినిమాలున్నాయి. ఇదిలా ఉంటే ఈ రోజు రెజీనా కసాండ్రా బర్త్ డే సందర్భగా సోషల్ మీడియాలో చాలా మంది ఆమెకి విషెస్ చెబుతున్నారు. IIFA ఉత్సవం ఇన్ స్టాగ్రామ్ పేజీలో రెజీనా గ్లామరస్ ఫోటోని షేర్ చేసి బర్త్ డే విషెస్ చెప్పారు. ఈ ఫోటోలో అమ్మడు చాలా కలర్ ఫుల్ గా ఉంది. వైట్ కలర్ లాంగ్ ఫ్రాక్ లో అదిరిపోయే అందంతో కట్టిపడేస్తోంది. చూడగానే మోడ్రన్ అప్సరసలా రెజీనా ఉందనే కామెంట్స్ వినిపిస్తున్నాయి. హీరోయిన్ గా ఛాన్స్ లు తగ్గిన రెజీనా తన టాలెంట్ తో విభిన్న క్యారెక్టర్స్ చేస్తూ దూసుకుపోతోంది. గ్లామర్ రోల్స్ కి కూడా రెజీనా పెర్ఫెక్ట్ ఛాయస్ అని ఈ ఫోటోలు చూస్తుంటే అనిపిస్తోంది.



Printed Published and owned by Gongura Srinivas Rao, Printed at M R Publications, # 6-3-1880, Vanasthalipuram, Ranga Reddy (Dist), Telangana 500070. at H.No 8-7-12/671, Sai Colony, Madhuban Colony, Rajendranagar, Ranga Reddy District, Telangana-500077, Editor: Gongura Srinivas Rao RNI Title Code :- TELTEL12296